శబరిమలకు ఆర్టీసీ ప్రత్యేక ప్యాకేజీ టూర్

నెల్లూరు(క్రైం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : అయ్యప్ప భక్తుల కోసం ఏపీఎస్ ఆర్టీసీ తక్కువ చార్జీలతో నెల్లూరు నుంచి శబరిమలకు నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి షమీమ్ తెలిపారు. సోమవారం నెల్లూరు ప్రధాన బస్టాండులో కరపత్రాలను విడుదల చేసి, ఆమె మాట్లాడారు. ఐదు రోజుల ప్యాకేజీ టూర్ ఉంటుందని నెల్లూరు నుంచి కాణిపాకం భవాని, ఎలిమేలి, పంబ మీదుగా శబరిమలకు తిరుగు ప్రయాణంలో కుర్తాళం, మధురై, మేల్‌మరవత్తూర్ మీదుగా నెల్లూరుకు బస్ చేసుకుంటుందని పేర్కొన్నారు. సూపర్ లగ్జరీ బస్సు చార్జీ రూ.4వేలు, అల్ట్రా డీలక్స్ రూ.3900, ఎక్స్‌ప్రెస్ రూ.3600లుగా నిర్ణయించినట్లు చెప్పారు. నెల్లూరు ప్రధాన బస్టాండు నుంచి ఈ నెల 17, 22, 23, 24, 30 తేదీల్లో, అదేవిధంగా డిసెంబరులో 1, 3, 5, 7, 11, 14, 15, 17, 22, 26, 31 తేదీల్లో, జనవరిలో 2, 5, 10 తేదీల్లో ప్రత్యేక బస్సులు బయలుదేరుతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు 1, 2 డిపోల మేనేజర్లు వెంకటేశ్వర్లు, కరీమున్నీసా, సూపర్‌వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

తండ్రి హత్య కేసులో తనయుడికి జీవితఖైదు

8

ఓం నమఃశివాయ!

శివం శంకరం శంభో మీశాన మీడే
ప్రభుం ప్రాణనాథం విభుం విశ్వనాథం
జగన్నాథనాథం సదానంద భాజామ్
భవద్భవ్యభూతేశ్వరం భూతనాథం
శివం శంకరం శంభుమీశానమీడే

శివనామస్మరణతో మారుమోగిన ఆలయాలు

కార్తీక మాసం 3వ సోమవారం సందర్భంగా జిల్లాలోని శైవాలయాలు శివనామస్మరణలతో మారుమోగిపోయాయి. తెల్లవారు జామునే పుణ్య స్నానాలు ఆచరించి శివయ్య దర్శనం కోసం జనం బారులు తీరి పాలభిషేకాలు, మహాన్యాస రుద్రాభిషేకాలు నిర్వహించారు. అనంతరం విశేష అర్చనలు, పూజలు జరిగాయి. ఈ సందర్భంగా భక్తులు కార్తీక సోమవార ఉపవాస దీక్షలు చేపట్టారు. చంద్రోదయం అయిన తర్వాత కార్తీక వనభోజనాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయాల్లో విశేష పుష్ప అలంకారాలు, ప్రాకారోత్సవాలు, పల్లకీసేవలు జరిగాయి. భక్తులతో ఆలయాలు కిటకిట లాడాయి. నెల్లూరులోని మూలా పేట మూల స్థానేశ్వర స్వామి ఆలయానికి భక్తులు తరలి వచ్చారు. మూ స్థానేశ్వరుడికి పాలభిషేకాలు, సహస్ర లింగేశ్వరుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషే కాలు జరిపించారు. విశేష అర్చనలు జరిగాయి. బుచ్చిరెడ్డిపాళెం మండలం జొన్నవాడలోని కామాక్షితాయి ఆలయంలో సాయంత్రం లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. తరలివచ్చిన భక్తులు ఆలయం ముందు దీపాలు వెలిగించి, ఆదిదంపతులను పూజించారు.

- నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి)



నెల్లూరు : మూలస్థానేశ్వరాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు



శివలింగానికి జలభిషేకం



నెల్లూరు : వెంగమాంబ ఆలయంలో స్వస్తిక్ ఆకృతిలో దీపాల వరుస



బుచ్చి : జొన్నవాడలో లక్షదీపోత్సవంలో పాల్గొన్న భక్తులు



సంగం : తిరుమనకొండలో పాలభిషేకం


'సోమశిల'లో 71 టీఎంసీల నీరు

అనంతసాగరం నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సోమశిల జలాశయానికి ఎగువ నుంచి 12,026 క్యూసెక్కుల ప్రవాహం వస్తున్నట్లు అధికారులు తెలిపారు. దిగువకు 12,650, ఉత్తర కాలువకు 50, కండలేరుకు 560 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ఇక డ్యాంలో 71.747 టీఎంసీల నీరు నిల్వ ఉంది.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు

నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

- వివరాలు 8లో..



'మేము ఏం చేసినా చెల్లుతుందన్న ధీమానో లేదా ఏం చేసినా ఎవరేమి అడుగుతారులే' అన్న ధైర్యమో తెలియదు కానీ నెల్లూరు ఆర్‌అండ్‌బీ అధికారుల తీరు మాత్రం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికే జిల్లాలో ఉద్యోగులు వర్సెస్ అధికారులు అన్నట్లుగా వివాదాలు నడుస్తున్నాయి. తాజాగా మరో టెండర్ వ్యవహారం ఆర్‌అండ్‌బీ అధికారుల తీరును వేలెత్తి చూపుతోంది. నచ్చిన కాంట్రాక్టర్‌కు వర్కులు దక్కేలా ఏకంగా టెండర్ నిబంధనలే మార్చడంపై తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల తీరుతో అత్యవసరంగా చేయాల్సిన పనులు నెలల కొద్దీ ఆలస్యమవుతున్నాయి.

ఎవరి కోసం ఈ మార్పు?

- గత నెలలో మూడు శ్లాబ్ కల్వర్టర్ల నిర్మాణానికి టెండర్లు
- పటిష్టంగా ఉండేలా బీఎం-బీసీ విధానంలో ఎస్టిమేషన్లు
- మిక్సింగ్ ప్లాంట్ ఉన్న కాంట్రాక్టర్లకే ఎలిజిబులిటీ
- ఉన్నపళంగా టెండర్లను రద్దు చేసిన ఆర్అండ్‌బి అధికారులు
- ఇప్పుడు ప్లాంట్ అవసరం లేని విధంగా నిబంధనలు మార్పు
- ఓ కాంట్రాక్టర్‌కు కట్టబెట్టేందుకు తెరవెనుక లాలూచీ?

నెల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పొదలకూరు-సోమశిల రోడ్డుతోపాటు సంగం-విరువూరు-కలువాయి రోడ్డులో బాగా దెబ్బతిన్న మూడు స్లాబ్ కల్వర్టర్లను నిర్మించేందుకు ప్రభుత్వం అనుమతులు మంజూరు చేసింది. ఒక్కో కల్వర్టర్‌ను రూ.50 లక్షలతో నిర్మించేందుకు గత నెలలో అత్యవసర మరమ్మతుల పేరుతో ఆర్‌అండ్‌బీ అధికారులు టెండర్లు పిలిచారు. ఈ మూడు కల్వర్టర్ల నిర్మాణంతోపాటు రెండు వైపులా అప్రోచ్ రోడ్డును కూడా నిర్మించాల్సి ఉంది. సాధారణంగా ఆర్‌అండ్‌బీ రోడ్లను బీఎం-బీసీ (50ఎంఎం-30ఎంఎం) క్వాంటిటీతో నిర్మిస్తుంటారు. ఇలా నిర్మించే రోడ్లు వంద టన్నుల లోడ్‌తో వాహనాలు వచ్చినా తట్టుకుంటాయి. గత నెలలో టెండర్ పిలిచిన మూడు స్లాబ్ కల్వర్టర్ల విషయంలో కూడా ఇదే నిబంధన పాటిస్తూ ఎస్టిమేషన్లు తయారు చేశారు. బీఎం-బీసీ క్వాంటిటీ ఉంటే మిక్సింగ్ ప్లాంట్ ఉన్న కాంట్రాక్టర్లకు మాత్రమే టెండర్ వేసేందుకు అర్హత ఉంటుంది. అయితే ఓ కాంట్రాక్టర్ ఈ మూడు కల్వర్టర్ల పనులు దక్కించుకునేందుకు ప్రయత్నాలు ప్రారంభించి ఆర్‌అండ్‌బీ అధికారుల ద్వారా పావులు కదిపారు. తనకు టెండర్ వేసేందుకు అర్హత వచ్చే విధంగా మిక్సింగ్ ప్లాంట్ నిబంధన తీసేసేలా తెరవెనుక ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలోనే దసరా సమయంలో మామూళ్ల పేరుతో భారీగా చేతులు తడిసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ వెంటనే ఉన్నపళంగా అధికారులు టెండర్లను రద్దు చేశారు. ఇందుకు ఎస్టిమేషన్లో తప్పులున్నాయన్న కారణాన్ని చూపించారు. మరి ముందుగా ఎస్టిమేషన్లు తయారు చేసినప్పుడు ఏఈ నుంచి ఎస్ఈ వరకూ ప్రతీ ఒక్కరూ పరిశీలించి టెండర్లు పిలిచాక తప్పులు ఎక్కడి నుంచి వచ్చాయో అధికారులే చెప్పాలి. ఇదిలా ఉంటే అత్యవసరంగా నిర్మించాల్సిన స్లాబ్ కల్వర్టర్ల విషయంలో ఆర్‌అండ్‌బీ అధికారులు తీవ్ర నిర్లక్ష్య ధోరణిని ప్రదర్శిస్తున్నారు. ఓ కాంట్రాక్టర్‌కు లబ్ధి చేకూర్చేందుకు నెల రోజుల క్రితం రద్దు చేసిన టెండర్లను ఇప్పటి వరకూ మళ్లీ పిలవలేదు. మిక్సింగ్ ప్లాంట్ నిబంధన తీసేసి టెండర్లు పిలిచేలా మళ్లీ ఎస్టిమేషన్లను మారుస్తున్నట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారం ఆర్‌అండ్‌బీ వర్గాల్లో చర్చనీయాంశంగా ఉంది. అధికారులకు రోడ్డు పటిష్టత కన్నా కాంట్రాక్టర్లే ముఖ్యమని, అందుకే బీఎం-బీసీ క్వాంటిటీను మార్చి తక్కువ క్వాలిటీ నిబంధనను పెడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా ఈ విషయంపై ఆర్‌అండ్‌బీ ఇన్‌చార్జ్ ఎస్ఈ రామకృష్ణప్రసాద్‌ను వివరణ కోరగా స్లాబ్ కల్వర్టర్లకు సంబంధించి మరో మారు టెండర్లు పిలవనున్నట్లు చెప్పారు. ఈసారి మిక్సింగ్ ప్లాంట్ నిబంధనను తొలగించినట్లు ఆయన స్పష్టం చేశారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న కౌలు రైతులు

జిల్లాకు 'బిర్లా' పరిశ్రమ

- బొడ్డువారిపాళెంలో 48.47 ఎకరాల స్థలం కేటాయింపు
- రూ.240 కోట్ల పెట్టుబడితో ఫైబర్ సిమెంట్ బోర్డ్ ప్లాంట్
- ప్రత్యక్షంగా 588 మందికి ఉపాధి

నెల్లూరు (వెంకటేశ్వరపురం) నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పారిశ్రామికంగా శరవేగంగా అభివృద్ధి చెందుతోంది. పరిశ్రమల ఏర్పాటుకు అనువైన భూమి, నీరు, రవాణాకు అనువుగా రామాయపట్నం, కృష్ణపట్నం పోర్టులు ఉండటంతో అనేక భారీ పరిశ్రమలు జిల్లాకు క్యూ కడుతున్నాయి. ఇప్పటికే విశ్వసముద్ర, హిందుస్థాన్ పెట్రోలియం కంపెనీ, ఇండోసోల్ సోలార్, జేఎస్‌డబ్ల్యూ, శ్రీచక్ర, క్రిబ్‌కో గ్రీన్ ఎనర్జీ ఇలా అనేక ప్రసిద్ధ కంపెనీలు జిల్లాలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వస్తున్నాయి. తాజాగా బిర్లా గ్రూప్ భారీ పరిశ్రమ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకొన్నది. రాజుపాళెం సమీపంలోని బొడ్డువారిపాళెం ఎంఎస్ఎంఈ పార్కులో 48.47 ఎకరాల భూమిని ఇప్పటికే ఆ సంస్థ కొనుగోలు చేసింది. దాదాపు రూ.240 కోట్ల పెట్టుబడితో ఎకో ఫ్రెండ్లీ ఫైబర్ సిమెంట్ బోర్డులను తయారు చేయనున్నారు. 588 మంది నిరుద్యోగులకు ఉపాధి లభించనున్నది త్వరలోనే గ్రౌండ్ లేవల్ పనులు ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది.

మమ్మల్ని ఆదుకోండి!

కలెక్టరేట్ వద్ద కౌలు రైతుల ధర్నా

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కౌలు రైతులను అన్ని విధాలా ప్రభుత్వ ఆదుకోవాలని కౌలు రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ముత్యాల గుర్నాథం, జిల్లా కార్యదర్శి తుళ్లూరు గోపాల్, పొట్టేపాళెం చంద్రమౌళి డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నేతలు మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ కింద కౌలు రైతులకు రూ.20 వేలు ప్రభుత్వం అందించాలన్నారు. కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకు యూరియా సక్రమంగా అందేలా చూడాలన్నారు. అనంతరం కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి మూలి వెంగయ్య, జిల్లా అధ్యక్షుడు పూడిపర్తి జనార్దన్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళం పుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.



నెల్లూరు : బస్టాండులో సోదాలు చేస్తున్న పోలీసులు

ఢిల్లీ ఎఫెక్ట్..

జిల్లాలో పోలీసుల అలర్ట్

- వివిధ ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు

ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన బాంబు పేలుడు నేపథ్యంలో జిల్లాలో పోలీసు అధికారులు అప్రమత్తం అయ్యారు. కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా రెడ్ అలెర్ట్‌ను ప్రకటించడంతో పోలీసులు బృందాలుగా ఏర్పడి ఏకకాలంలో దాడులు చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని ఆర్టీసీ బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, ప్రధాన కూడళ్లు, సమస్యాత్మక ప్రదేశాలు ఇలా అన్నీ ప్రాంతాల్లోనూ విస్తృత తనిఖీలు చేశారు. ప్రధానంలో జనసమూహం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌లు సోదాలు చేశాయి. ఈ సందర్భంగా ఎస్పీ అజిత వేజెండ్ల మాట్లాడుతూ అనుమానితులు ఎవరైనా ఉంటే వెంటనే సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అలాగే కావలిలో సీఐలు రాజేశ్వరరావు, గిరిబాబు, ఫిరోజ్‌లు వాహనాలను క్షుణ్ణంగా తనిఖీలు చేశారు.

- నెల్లూరు (క్రైం, ఆంధ్రజ్యోతి)



కావలిలో.

స్వర్ణాంధ్ర సాధనే లక్ష్యంగా..

ప్రతి నియోజకవర్గంలో పర్యవేక్షణ కేంద్రాలు

ఉదయగిరి సచివాలయం-3లో ఏర్పాటు

ఉదయగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం స్వర్ణాంధ్ర (విజన్-2047)కు శ్రీకారం చుట్టింది. పది సూత్రాల అమలు కోసం ప్రస్తుతం నియోజకవర్గానికి ఒకటి చొప్పున పర్యవేక్షణ కేంద్రం ఏర్పాటు చేసింది. ఇందుకు పది సూత్రాలు నిర్దేశించింది. పేదరిక నిర్మూలన, ఉద్యోగాల కల్పన, మానవ వనరులు, నైపుణ్యాభివృద్ధి, జల సంరక్షణ, రైతులకు తోడ్పాటుగా వ్యవసాయంలో సాంకేతికాభివృద్ధి, అంతర్జాతీయంగా సరుకు రవాణాభివృద్ధి, ఇంధన ఖర్చు తగ్గింపు, ఉత్పత్తి సామర్థ్యం పెంపు, స్వచ్ఛాంధ్ర సాధన, సామాజిక, ఆర్థిక శిక్షణ, ప్రభుత్వ రంగాల్లో ఏఐ అభివృద్ధి లక్ష్యాలుగా పెట్టుకుని ఈ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇందుకోసం నియోజకవర్గానికో పర్యవేక్షణ కేంద్రం ఏర్పాటు చేశారు. ఉదయగిరికి సంబంధించి స్థానిక సచివాలయం-3లో రూ.లక్షల విలువైన కంప్యూటర్లు, ఫర్నిచర్, ఇతరత్రా సామగ్రితో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. కార్యాలయంలో ఉద్యోగులు విధులు నిర్వహించే గదితోపాటు చైర్మన్, ప్రత్యేకాధికారులకు ప్రత్యేక గదులు ఏర్పాటు చేశారు.



కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు

- అరుగురు ఉద్యోగుల నియామకం

స్వర్ణాంధ్ర కోసం ఐదుగురు ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ఓ యంగ్ ప్రొఫెషనల్‌ను నియమించారు. ఈ కేంద్రానికి చైర్మన్‌గా ఎమ్మెల్యే, ప్రత్యేకాధికారిగా డివిజన్‌స్థాయి అధికారి ఉంటారు. ఉద్యోగులు నిత్యం నియోజకవర్గ ప్రగతిని స్థానిక ఎమ్మెల్యేకు నివేదించాల్సి ఉంటుంది. ప్రస్తుతం ఏర్పాటు చేసిన కేంద్రం నుంచి వీరంతా వారికి అప్పగించిన శాఖల వారీ పురోగతితోపాటు పీ-4 అమలు తదితర వాటిని ఎప్పటికప్పుడు ఆప్‌లోడ్ చేస్తారు. నియోజకవర్గంలో చేపట్టే అభివృద్ధి పనులపై సమీక్షలు, ప్రజాదర్బారు, ప్రజా సమస్యల పరిష్కార వేదిక తదితర కార్యక్రమాలు ఈ కేంద్రం నుంచే నిర్వహించాల్సి ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

ఎమ్మార్పీఎస్ రాజకీయ అవగాహన సదస్సు

రాపూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి గోవింద రంగయ్య ఆధ్వర్యంలో మాదిగల చైతన్య అభివృద్ధి, రాజకీయ ఎదుగుదల తదితర అంశాలపై అవగాహన సదస్సు సోమవారం నిర్వహించారు. గోవింద రంగయ్య మాట్లాడుతూ మాదిగలు విద్య, వైద్య తదితర రంగాలలో రాణించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు మద్దూరు శ్రీనివాసులు, గంపల పుల్లయ్య, తుమాటి పెంచలయ్య, ఎద్దుల నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11546
వెండి కిలో ధర	రూ. 152900
వెండి ఒక గ్రాము	రూ. 158.90

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి 100 ఎకరాల స్థల సేకరణ

పొదలకూరు, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఏపీ టౌన్ షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్టక్చర్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) మండలంలోని మొగళ్లూరు గ్రామంలోని ఎల్‌పీఎం నెంబరు 945 (పాత సర్వే నెంబరు 268)లోని ప్రభుత్వ భూమిని 100 ఎకరాలను తీసుకోవడానికి మంత్రివర్గం ఆమోదించింది. మొత్తం ఈ భూమి విలువ రూ.7.50 కోట్లు. ఎకరానికి రూ.7.50 లక్షలు. ఐదు సమాన వార్షిక వాయిదాల్లో రూ. 1.50 కోట్ల చొప్పున చెల్లించేలా ఆమోదించినట్లు విశ్వసనీయ సమాచారం.

రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ బోర్డు డైరెక్టర్‌గా వీరేంద్రనాయుడు



ఇందుకూరుపేట, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి) : మండలంలోని కొరుటూరు గ్రామానికి చెందిన రాష్ట్ర టీడీపీ కార్యదర్శి రావెళ్ల వీరేంద్రనాయుడు ఆంధ్రప్రదేశ్ సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా సోమవారం నియమితులయ్యారు. తన నియామకానికి కృషి చేసిన ఐటీ శాఖామంత్రి లోకేష్, పార్లమెంటు సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి వీరేంద్రనాయుడు కృతజ్ఞతలు తెలిపారు. కాగా ఆయన నియామకం పట్ల మండలం లోని పలువురు టీడీపీ నాయకులు మిఠాయిలు పంచి హర్షం వ్యక్తం చేశారు.

దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

వెంకటాచలం, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని పుంజులూరుపాడు గ్రామంలో గిరిజనులకు సోమవారం పీఏసీఎస్ ఛైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు చేతులమీదుగా దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి సహకారంతో దుప్పట్లను అందించామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు కొణిదిన వెంకటకృష్ణమ నాయుడు, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి



చేతుల శుభ్రత గురించి వివరిస్తున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

వెంకటాచలం, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని ఎర్రగుంట గ్రామంలో విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఎన్‌ఎస్‌ఎస్ (జాతీయసేవా పథకం) యూనిట్-4 ఆధ్వర్యంలో సోమవారం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రత్యేక శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు వ్యక్తిగత పరిశుభ్రత, పోషక విలువలు కలిగిన ఆహారం చేతుల శుభ్రత గురించి వివరించారు. ఆటలపోటీలు నిర్వహించారు. మంగళవారం గ్రామంలో ఉచితవైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నామని, గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని వలంటీర్లు కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వడ్డెర సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ వల్లెపు మునిస్వామి, ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త డా. వెంకటసుబ్బారెడ్డి, ఎంబీఏ, కెమిస్ట్రీ, టూరిజం, సోషల్ వర్క్ విభాగం విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కాకాణి జన్మదిన వేడుకలు

పొదలకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని పంచాయతీ బస్టాండ్ సెంటర్లో మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి జన్మదిన వేడుకలు మండల వైసీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. బాణాసంచా కాల్చి భారీ కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. సర్వేపల్లి నియోజకవర్గ బూత్ కన్వీనర్ బచ్చల సురేష్ రెడ్డి, ఐటీ సెల్ సెక్రటరీ రావుల ఇంద్రసేన గౌడ్, ఉపసర్పంచ్ వాకాటి శ్రీనివాసులురెడ్డి, వార్డు మెంబరు షేక్ అంజాద్, నాయకులు పెదమల్లు రమణారెడ్డి పాల్గొన్నారు.

అభివృద్ధికి దూరం.. 'గాంధీ' గిరిజనం!

కోవూరు, నవంబరు 10, (ఆంధ్రజ్యోతి) : పేదలందరికీ పక్కాగృహాలను నిర్మించే ప్రభుత్వం తాహసీల్దారు కార్యాలయానికి సమీపంలోని గిరిజనకాలనీపై నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తోంది. దీంతో స్థానిక గాంధీ సంఘంలోని గిరిజనులు నిరాదరణకు గురవుతున్నారు. కోవూరు పట్టణ నడిబోడ్డులో తాలుకా ఆఫీసు కూడలిలో పూరి గుడిసెల్లోనే గిరిజనులు కష్టాల్ని ఎదుర్కోవడం ఆశ్చర్యం కలిగిస్తోంది. రెక్కాడితే గాని డొక్కాడని స్థితిలో ఉన్న గిరిజనులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందకపోవడం గమనార్హం. పేదలందరికీ ఆదర్శ గృహాల్ని నిర్మించామని చెబు తున్న ప్రభుత్వ యంత్రాంగం వీరి వైపు కన్నెత్తి చూడనే లేదు. గత కొద్ది సంవత్సరాలుగా అడపాదడపా వారిచ్చిన అర్జీల్ని స్వీకరించి హామీలు ఇచ్చి అధికారులు వెళ్ళి పోతున్నారు తప్ప. పేద గిరిజనుల బతుకుల్లో వెలుగు నింపేందుకు ఎవ్వరూ ప్రయత్నించకపోవడం గమనార్హం. నిత్యం అధికారులు సంచరించే ప్రధాన కూడలిలో ఉన్న కాలనీవైపు దృష్టి సారించకపోవడంతో పేద గిరిజనులు తీవ్రమైన ఇక్కట్లకు గురవుతున్నారు. గాంధీ పేరుతో వెలసిన తమ కాలనీలో కనీస వసతులు కల్పించి, తమ జీవితాల్లో వెలుగులు నింపేందుకు అధికారులు కృషి చేయాలని వారు కోరుతున్నారు.



పూరిగుడిసెలతో దర్శనమిస్తున్న గాంధీ గిరిజన కాలనీ

బడి మానేసిన బాలలు

కాలనీ పక్కనే ఒకటికి మూడు పాఠశాలలున్నప్పటికీ కాలనీలోని పిల్లలను చదువు వైపు మళ్ళించే నాథుడే ఇక్కడ కరువయ్యాడు. కూలినాలితో పాటు, పంచాయితీలో చెత్తాచెదారం తొలగించే పనులకు వెళ్ళే తలిదండ్రులు పిల్లలను గాలికొదిలేశారు. బడిఈడు కలిగిన బాలబాలికలను పాఠశాలల్లో చేర్పిస్తామని చెప్పుకునే అధికారులు గాంధీ సంఘంలోని భావిభారత పౌరులపై దృష్టి సారించాల్సి ఉంది.

వైసీపీ హయాంలోనే దళితులపై దౌర్జన్యాలు



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

ముత్తుకూరు (తోటపల్లిగూడూరు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ హయాంలోనే దళితులపై దౌర్జన్యాలు, ఆస్తులను ధ్వంసం చేశారని టీడీపీ మండలాధ్యక్షుడు కొణతం రఘుబాబు పేర్కొన్నారు. మండలంలోని తోటపల్లి పంచాయతీ డక్కిలివారిపాలెంలో సోమవారం టీడీపీ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. గ్రామంలో ప్రభుత్వ భూమిలో ఉన్న ఇంటిని తొలగించు విషయంలో మండల వైసీపీ అధ్యక్షుడు శంకరయ్యగౌడ్ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డిపై చేసిన విమర్శలను తీవ్రంగా ఖండించారు. మా నాయకుడు దళితులపై ప్రేమ చూపిస్తాడు తప్ప. వారి ఆస్తులను ఎప్పుడూ కొల్లగొట్టలేదని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం హయాంలో మల్లికార్జునపురం దళితులు వరకవిపూడి చెరువులో 100 ఎకరాల భూమిని ధ్వంసం చేసిన నీచ చరిత్ర వైసీపీదేనన్నారు. దారా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ లబ్ధిదారునికి జగనన్న లేఅవుట్‌లో ఇల్లు ఉందని ఇంటి పన్ను కూడా కడుతున్నాడని తెలిపారు. ప్రభుత్వ స్థలంలో అనుమతులు లేకుండా కట్టడంతో పంచాయతీ సభ్యుని ఫిర్యాదుతో అధికారులు ఇంటిని తొలగించారని తెలిపారు. స్థానిక వైసీపీ నేత సర్పంచ్ తోటపల్లి రామాచార్యులు అనవసర రాజకీయం చేయడాన్ని వారు విమర్శించారు. ఈ సమావేశంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి మన్యం జిత్రేంద, స్థానిక నేతలు తోటపల్లి రామ్మోహన్‌నాయుడు, మీదూరు రవి, కిష్టయ్య, వెంకటేశ్వర్లు, ఈదూరు శివయ్య, స్థానిక గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ పార్కుకు నేడు శంకుస్థాపన

● హాజరుకానున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి



భూములను పరిశీలిస్తున్న ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్ తదితరులు

వెంకటాచలం, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని రామదాసు కండ్రిగ సమీపంలో పోర్టు రోడ్డుకు వెళ్ళే మార్గంలో ఉన్న ఏపీఐఐసీ భూములలో ఎంఎస్ ఎంఈ పార్కు ఏర్పాటుకు మంగళ వారం శంకుస్థాపన జరగనున్నట్లు ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ శివకుమార్ తెలిపారు. సోమవారం పార్కు ఏర్పాటు చేయబోయే భూములను ఆయన పరిశీలించారు. భూములలో మొలిచిన పిచ్చిమొక్కలను ఎస్కవేటర్ సాయంతో తొలగించారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన జరగనున్నదని జేఎం తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జోనల్ మేనేజర్ బ్రహ్మయ్య, పీఏసీఎస్ ఛైర్మన్ రావూరి రాధాకృష్ణమనాయుడు, సర్వేపల్లి కెనాల్ డిస్ట్రిబ్యూటరీ కమిటీ ఛైర్మన్ చల్లా నాగార్జున రెడ్డి, టీడీపీ మండలాధ్యక్షుడు కట్టంరెడ్డి రాధాకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

19న వైభవంగా లక్ష దీపోత్సవం



సమావేశంలో మాట్లాడుతున్న ఆలయ ఛైర్మన్ సురేష్‌కృష్ణ

విడవలూరు, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): కార్తీకమాసాన్ని పురస్కరించుకుని ఈనెల 19న ప్రముఖ పుణ్యక్షేత్రమైన రామతీర్థంలో వెలసిన రామలింగేశ్వర ఆలయంలో లక్షదీపోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఛైర్మన్ అచ్చిరాల సురేష్‌కృష్ణ తెలిపారు. కార్తీక సోమవారం సందర్భంగా ఆలయంలో స్వామి, అమ్మ వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాలనుంచి ఆలయానికి విచ్చేసిన భక్తులకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అదే విధంగా ఆలయ ప్రాంగణంలో దాతల సాయంతో అన్నసంతర్పణ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ లక్షదీపోత్సవ వేడుకలను ఎమ్మెల్యే సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. కావున భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

హైవే విస్తరణకు 50మందికి నోటీసులు

● వారంలోగా ఖాళీ చేయాలని ఆదేశం
● ఆందోళనలో చిరువ్యాపారులు

మనుబోలు, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని జాతీయరహదారి విస్తరణ కానున్నది. ప్రస్తుతం ఉన్న 4లేన్ల రహదారి ఆరు లేన్ల రహదారిగా మారనున్నది. ఇందులో బాగంగా హైవే స్థలంలో ఆక్రమించి దుకాణాలు, వ్యాపారాలు చేసుకునేవారందరికి ఆదివారం జాతీయరహదారి నిర్వహణ సంస్థ అధికారులు నోటీసులు అందజేశారు.దీంతో పాటు హైవే స్థలం ఎంతవరకు ఉన్నదన్నది మార్కు చేసి చూపించారు. దీనిపై సోమవారం హైవే ఆనుకుని ఉన్న వ్యాపారస్తులలో ఆందోళన మొదలైంది. వైఎస్ఆర్ విగ్రహం నుంచి, సెరెస్‌ఆగ్రోస్ కంపెనీ వరకు సుమారు 50మందికి నోటీసులు ఇచ్చి హెచ్చరించారు. వారం రోజులోగా జాతీయరహదారి స్థలంలో చేసుకున్న ఆక్రమణలు, వ్యాపారాలు ఖాళీ చేయాలని సూచించారు. వారం రోజుల తరువాత వ్యాపారాలు ఎలా చేసుకోవాలి, జీవనోపాధి కోల్పోతే పరిస్థితి ఏంటని వ్యాపారులు మదనపడిపోతున్నారు.

ప్రమాదాలు జరగకుండా క్రాస్‌రోడ్డు మూసివేత

బిట్రగుంట, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): బోగోలు మండలం ముంగమూరు జాతీయ రహదారి కూడలి క్రాస్ రోడ్డును కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్ఐ ప్రభాకర్, ఎన్‌హెచ్ 5 సిబ్బంది సోమవారం మూసివేశారు. ఈ సందర్భంగా సీఐ పాపారావు మాట్లాడుతూ కొండబిట్రగుంట, ముంగమూరు, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు రోడ్డు క్రాస్ చేస్తుండగా మృతి చెందారన్నారు. ప్రమాదాల నివారణకే క్రాస్ రోడ్డు మూసివేశామన్నారు. సమీపంలోని కడనూతలలో ఫ్లైఓవర్ బ్రిడ్జి ద్వారా సర్వీస్ రోడ్డు ఉన్నాయని, ఆ మార్గంలో వెళ్లాలని పోలీసులు సూచించారు.

నేలమ్మకు ఆకుపచ్చని వసంతం.. కయ్యలపై కొంగమ్మల సోయగం!



వ్యవసాయ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు బీడు భూములను దున్నే ప్రయత్నాలు చేస్తుంటారు. ముందుగా కయ్యలకు నీళ్ళు పట్టి రొంపి దుక్కి దున్నుతారు. ఈ సమయంలో భూమిలో ఉన్న పురుగులు, సూక్ష్మ క్రిములు నీటిపై తేలతాయి. వాటిని తినేందుకు కొంగలు ఎక్కడైతే దుక్కులు దున్నుతుంటారో అక్కడికి ఇలా గుంపులు గుంపులుగా చేరుకుంటాయి. సోమవారం పిడూరులో ఓ రైతు కయ్య దున్నుతుండగా కొంగల సోయగం, విహార విన్యాసాలు చూసేందుకు రెండు కళ్లూ చాలలేదు.

-మనుబోలు (ఆంధ్రజ్యోతి)

వైభవంగా కార్తీక లక్ష దీపోత్సవం

జొన్నవాడ ఆలయానికి కార్తీక శోభ
వాడవాడలా కార్తీక మాస పూజలు

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జొన్నవాడ ఆలయంలో కార్తీకమాస లక్ష దీపోత్సవం అశేష భక్తజనం నడుమ అత్యంత వైభవంగా జరిగింది. కార్తీక దీపాల వెలుగులతో ఆలయ పరిసర ప్రాంతం కార్తీక శోభ సంతరించుకుంది. ఆలయ ముఖ మండపం ముందు సన్నిధి వీధిలో భక్తులు కార్తీక దీపాలు వెలిగించేలా ఆలయ కమిటీ ఛైర్మన్ తిరుమూరు అశోక్‌రెడ్డి, కార్యనిర్వహణాధికారి ఏవీ శ్రీనివాసులురెడ్డి, సభ్యులు ఏర్పాట్లు చేశారు. ముందుగా ఉభయకర్తలు పందిళ్ళపల్లి హేమంత్‌రెడ్డి, సింధు దంపతులు, ఆలయ కమిటీ, ఈఓ ఆలయంలో స్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకము, అమ్మవారికి నవావరణ పూజలు నిర్వహించారు. అనంతరం గంగా, కామాక్షి సమేతంగా మల్లికార్జున స్వామివారిని అలంకారభూషితులను చేసి లక్ష దీపోత్సవం నిర్వహించే ప్రాంతంలోని ఆలయ ముఖమండపంలో కొలువుదీర్చారు. గణపతి పూజతో ప్రారంభించి స్వామి, అమ్మవారికి వేద మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ముందుగా ఉభయకర్తలు, ఆలయ కమిటీ ఛైర్మన్, సభ్యులు, ఈఓ దీపాలు వెలిగించి లక్ష దీపోత్సవం ప్రారంభించారు. తర్వాత అశేష భక్తజనం లక్ష దీపాలు వెలిగించి తరించారు. అనంతరం స్వామి, అమ్మవారిని ఆలయం చుట్టూ ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పెంచలయ్య, ఆలయ కమిటీ సభ్యులు శివకృష్ణ, వరలక్ష్మి, చాముండేశ్వరి, ప్రత్యూష, శ్రీనివాసులు, సుధాకర్, సుధారాణి, సీఐ, ఎస్ఐ సిబ్బంది, అగ్నిమాపక అధికారులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కార్తీక లక్ష దీపోత్సవంలో పాల్గొన్న ఆలయ కమిటీ సభ్యులు, అధికారులు



పొదలకూరులో కల్యాణ క్రతువులో పాల్గొన్న భక్తులు

పొదలకూరు: మండల పరిధిలోని మొగళ్లూరు గ్రామంలో కార్తీక మాసం మూడో సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పురాతన శివాల యంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని కార్తీక దీపాలు వెలిగించారు. సమీపంలోని సిద్ధలకొండపై గల కామాక్షి సమేత సిద్ధేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేశారు. నూతనంగా నిర్మించిన వేదికపై శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకుముందు వాస్తు హోమం జరిపారు. కల్యాణ వేడుకకు కొత్తలూరు కోటేశ్వర రావు, సుగుణమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు ఉభయ కర్తలుగా వ్యవహరించారు. అర్చకులు రాజశేఖర శాస్త్రి, రామకృష్ణశాస్త్రి పూజలు జరిపించారు. సిద్ధల కొండ ఆలయ నిర్వాహకులు పలుకూరు మల్లికార్జునరెడ్డి వేడుకలను పర్యవేక్షించారు. శివనామస్మరణ, వేదమంత్రోచ్చారణల నడుమ పట్టణంలోని పురాతన శివాలయంలో ఆది దంపతుల కళ్యాణం నేత్రపర్వంగా సాగింది. భక్తులకు విశేషమైన స్పటిక లింగేశ్వరుడు, నర్మదాబాణలింగములకు పాలాభిషేకం నిర్వహించారు. శివాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై అర్చకులు కళ్యాణ క్రతువును కోలాహలంగా జరిపించారు. కామాక్షితాయికి రామలింగేశ్వరుడి మాంగల్యధారణ కార్యక్రమం శాస్త్రోక్తంగా జరిగింది. తర్వాత స్వామివారిని గజవాహనంపై మంగళవాద్యాలు, మేళతాళాలతో ఊరేగించారు. భక్తజనంతో ప్రాంగణం నిండిపోయింది. ఉభయకర్తలుగా కనుపూరు పెంచలయ్య దంపతులు వ్యవహరించారు. అన్నదానం చేశారు.

రాపూరు: పరమశివుడికి అత్యంత ప్రీతిపాత్రమైన కార్తీకమాసం మూడో సోమవారం సందర్భంగా పట్టణంలో ఉన్న పర్వత వర్ధిని సమేత రామనాథేశ్వర ఆలయాన్ని అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. రుద్రాక్ష అలంకరణలో స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. కార్తీక సోమవారం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు వైభవంగా నిర్వహించారు. మహిళలు సాయంకాలం పెద్దఎత్తున ఆలయాల్లో కార్తీకదీపాలు వెలిగించి ముక్కంటిని దర్శించుకున్నారు.

C.R.I.M.E N.E.W.S

నెల్లూరు రూరల్లో ముగ్గురి మృతి

● ఈత కెళ్లి ఒకరు, గడ్డి మందు తాగి మరొకరు,
● పవర్ ప్లాంటులో వృద్ధుడు..



నీట మునిగి మృతిచెందిన షాకీర్

నెల్లూరు రూరల్లో, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని వివిధ ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. షేక్ షాకీర్ (15) వైఎస్ఆర్ నగర్‌కు చెందిన నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం కొండ్లపూడి పంచాయతీ టిడ్కో గృహ సముదాయం వద్ద ఉన్న చెరువులో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు షాకీర్ నీట మునగడంతో మిగిలిన వారు ఒడ్డుకు వచ్చేయగా ఇతను మాత్రం రాలేదు. దీంతో అతని తల్లిదండ్రులు తొలత కనపడటం లేదని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా సోమవారం ఆ బాలుడు చెరువులో శవమైన తేలాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **గడ్డి మందు తాగి..**

భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా కోడూరుపాడులోని కల్తీ కాలనీకి చెందిన వానపల్లి అమర్‌బాబు(29) ఆదివారం సాయంత్రం సమీపంలోని లేఅవుట్ ప్లాట్లలో గడ్డి మందుతాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. అక్కడ క్రికెట్ ఆడుతున్న కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతనిని వైద్యం కోసం నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతని తండ్రి గోపి ఇచ్చిన ఫిర్యాదుతో ఓలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **ఎస్‌ఎల్వీ పవర్ ప్లాంటులోకి దూకి...**

కోడూరుపాడు వద్దనున్న మూతపడిన ఎస్‌ఎల్వీ పవర్ ప్లాంటులో అనుమానాస్పద స్థితి అదే ప్రాంతం మార్కేండేయ కాలనీకి చెందిన పాకం వెంకటరమణయ్య(65) మృతి చెందాడు. ఈయన ఆదివారం సుబ్బారెడ్డి అనే వ్యక్తితో కలిసి ప్లాంటులోకి వెళ్లగా అక్కడ కుక్కలు మెరగడంతో సుబ్బారెడ్డి గోడ దూకి బయటకు వచ్చేయగా వెంకటరమణయ్య మాత్రం అక్కడే ఉండిపోయాడని సీఐ తెలిపారు. సోమవారం ఉదయం చూడగా ఆయన అక్కడ మరణించి ఉన్నాడని, ఇందుకు కారణం తెలియదని చెప్పారు. మృతుడి భార్య పద్మమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గండిపాళెంలో గుర్తుతెలియని యువకుడి హల్‌చల్

● గ్రామస్థుల బెంబేలు



బ్యాంకులో రికార్డులను చెల్లాచెదురు చేసిన గుర్తు తెలియని యువకుడు

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్ర జ్యోతి): మండలంలోని గండిపాళెంలో గుర్తు తెలియని యువకుడు సోమవారం హల్‌చల్ చేయడంతో గ్రామస్థులు బెంబేలెత్తిపోయారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని సెల్ దుకాణంలో ఓ సెల్‌ఫోన్ తీసుకొని వెళుతుండడంతో గమనించిన యజమాని గట్టిగా మందలించడంతో తిరిగి ఇచ్చేశాడు. మరో దుకాణం ఎదుట మోటారు బైకులో ఉన్న మద్యంసీసా, వాటర్ ప్యాకెట్‌ను తీసుకొని పరారయ్యాడు. అక్కడి నుంచి జలాశయానికి వెళ్లే మార్గంలోని అంకాళమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన నగదును తీసుకొని సమీపంలో ఉన్న గేదెల ఫారంలో సామగ్రి ఉండే గదిలోకి వెళ్లి గాలిస్తుండగా గమనించిన రైతు కేకలు వేయడంతో ఎదురు దాడికి దిగాడు. దీంతో ఆ యువకుడిని బస్టాండ్ సెంటర్‌కు తీసుకొచ్చి వదిలి వెళ్లాడు. అనంతరం బ్యాంకులో ప్రజలు రద్దీగా ఉన్న సమయంలో వెళ్లి కేకలు వేయడంతో అక్కడ ఉన్న సిబ్బంది, ఖాతాదారులు భయాందోళనకు గురయ్యారు. ఎలాగోలా నానా తిప్పలు పడి బయటకు పంపివేశారు. అయినప్పటికీ వెనుకవైపు పాత రికార్డులు భద్రపరిచిన ప్రాంతానికి వెళ్లి వాటిని చించి చిందర వందరగా పడేయడంతో పాటు అక్కడే నేలపై కూర్చొని బీభత్సం సృష్టించాడు. పొంతన లేని సమాధానం చెబుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో ఎక్కడ నుంచి వచ్చాడో తెలుసుకోవడం ప్రజలకు కష్టంగా మారింది. ఇలాంటి తరుణంలో కొంతమంది 100కు సమాచారం అందించారు. దీంతో గ్రామానికి చేరుకొన్న పోలీసు సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వివాహితను వేధిస్తున్న భర్త, అత్తింటివారిపై చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. రాజీవ్‌గృహకల్ప సముదాయంలో వాణి కుటుంబం నివాసం ఉంటోంది. భర్త మల్లికార్జున, అత్తింటి వారు ఆమెను దుర్భాషలాడుతూ, వేధింపులకు గురిచేస్తూ రెండేళ్ల క్రితం ఇంటి నుంచి గెంటేశారు. అప్పటినుంచి ఆమె తన కుమారుడితో కలిసి ఉంటోంది. అయినా భర్త తరచూ ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా ఆర్టీసీ బస్టాండు

● ప్రయాణికుల అవస్థలు



ఆర్టీసీ రోడ్డులోని బెల్ట్ షాపులు

వింజమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ రోడ్డు ఆర్టీసీ బస్టాండు మందుబాబులకు అడ్డాగా మారింది. ఈ రోడ్డులో బ్రాందీ షాపు, సినిమా హాలు, ఆర్టీసీ బస్టాండు ఉన్నందు వలన ప్రయాణికులు, సినీ ప్రేక్షకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. బ్రాందీ షాప్ పక్కన బెల్ట్‌షాప్ ఏర్పాటు చేసుకుని ఉదయం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. వారు రోడ్డు మీదే మద్యం సేవిస్తూ రోడ్డుపైనే మూత్ర విసర్జన చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం జన సంచారం ఉన్న ఈ రోడ్డుమీద మద్యం షాపును వెంటనే తొలగించాలని ఇతర షాపు యజమానులు కోరుతున్నారు. దీని వలన మద్యం బెల్టుషాపులు ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా అమ్ముతూ ఇబ్బంది పెడుతున్నారని షాప్ యజమానులు తెలిపారు. ముఖ్యంగా అసాంఘిక శక్తులను అరికట్టేందుకు పోలీసు వారు కానీ ఎక్సైజ్ వారు కానీ చర్యలు తీసుకోవడంలేదని, ఇలా చేయడం వలన మా వ్యాపారాలకు కూడా ఇబ్బంది కలుగుతుందని షాపు యజమానులు తెలిపారు. వెంటనే ఈ బ్రాందీ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	128
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254
కోడిగుడ్ల ధర (100): 600	

ఛాంపియన్ ఫార్మర్లకు శిక్షణ

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు సబ్‌డివిజన్ పరిధిలో ఎంపికైన ఛాంపియన్ ఫార్మర్లకు సోమవారం డీఆర్‌సీలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. వ్యవసాయంలో మెలకువలు, ఆధునిక పద్ధతులపై జిల్లా వ్యవసాయాధికారి (డీఏవో) పీ.సత్యవాణి అవగాహన కల్పించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఛాంపియన్ ఫార్మర్ల ఎంపిక జరిగిందని, ప్రతీ పంచాయతీ నుంచి ఒకరిని ఎన్నుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆత్మ పీడీ మురళి, నెల్లూరు, వెంకటాచలం, సైదాపురం మండలాల వ్యవసాయాధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఏవో సత్యవాణి, పక్కన ఆత్మ పీడీ మురళి


రాజరాజేశ్వరి ఆలయంలోని సుందరేశ్వరస్వామికి సహస్ర శంఖాభిషేకానికి సిద్ధం చేసిన శంఖాలు

శంభో శివ శంభో..!

శివనామ స్మరణతో మారుమోగిన ఆలయాలు ● భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని శైవ క్షేత్రాల్లో కార్తీక మాస మూడవ సోమవారం శివనామ స్మరణలు, అష్టకాలు, శత నామ స్మరణలతో ఆలయాలు మారుమోగాయి. కార్తీక దీపారాధనలతో ఆలయాలు కళకళలాడాయి. నగరంలోని మూలాపేట మూలస్థానేశ్వర స్వామి ఆలయంలో భక్తులు వేలాది సంఖ్యలో తెల్లవారు జాము నుంచే తరలివచ్చి శివయ్య సేవలో పునీతులయ్యారు. సహస్ర లింగేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిపించారు. భువనేశ్వరి అమ్మవారికి నిత్యపూజలు ప్రత్యేక అలంకారం జరిగింది. భక్తులు కార్తీక సోమవార వ్రత దీక్షలు చేపట్టి చండీహోమం, హోమాలలో పాల్గొన్నారు. సాయంత్రం విశేష పుష్పాలంకారం ఆకట్టుకుంది. రాత్రి కార్తీక దీపారాధనలు చేశారు. అనంతరం శివపార్వతులకు ప్రాకారోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ ఈవో అర్వభూమి వెంకట శ్రీనివాసులురెడ్డి పర్యవేక్షించారు.

● నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలోని మీనాక్షి సుందరేశ్వరస్వామికి ఉదయం పాలాభిషేకం, మహాన్యాస రుద్రాభిషేకం, సహస్ర శంఖాభిషేకం వైభవంగా జరిగాయి. రాజరాజేశ్వరిదేవికి అభిషేకాలు, ప్రత్యేక అలంకారం, నిత్యపూజలతోపాటు చండీహోమం జరిగింది. మహిళా భక్తులు రాహుకాల, కార్తీక దీపారాధనలు చేశారు. సాయంత్రం కుంభ హారతులు, మీనాక్షి సుందరేశ్వరస్వామికి పల్లకీసేవ జరిగింది. ఈ కార్యక్రమాను జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి పర్యవేక్షించారు.


మూలస్థానేశ్వరస్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

● స్టోన్‌హౌస్‌పేట కన్యకాపరమేశ్వరి ఆలయంలోని శివుడికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, అర్చనలు జరిగాయి. భక్తులు భారీగా తరలివచ్చి కార్తీక దీపారాధనలు చేశారు. ఈ కార్యక్రమాలను ఆలయ చైర్మన్ కోట గురుబ్రహ్మం, కార్యనిర్వాహక అధ్యక్షుడు షేగు షణ్ముఖరావు, కార్యదర్శి చిరంజీవి, కోశాధికారి ఒమ్మిన జనార్దన్‌రావు, గౌరవ సలహాదారులు ఎంపీ ఆంజనేయులు పర్యవేక్షించారు.

● బాలజీనగర్ సీతారామ మందిరం, ఉస్మాన్ సాహెబ్ పేట కాశీవిశ్వనాథుని ఆలయం, నవాబుపేట భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయాల్లో పాలాభిషేకాలు, మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష అలంకారం, ప్రాకారోత్సవాలు జరిగాయి.

● వైభవంగా కార్తీక దీపోత్సవం

కార్తీక మాసం 3వ సోమవారం సందర్భంగా నగరంలోని శెట్టిగుంట రోడ్డు వెంగమాంబ ఆలయంలో రాత్రి కార్తీక దీపోత్సవం వైభవంగా జరిగింది. భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేసి వివిధ ఆకృతులలో కార్తీక దీపాలు వెలిగించారు. ఉదయం విశేష పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాలను దేవస్థానం కమిటీ పర్యవేక్షించింది.


శెట్టిగుంటరోడ్డు వెంగమాంబ ఆలయంలో కార్తీక పూజల్లో భక్తులు

మంత్రి నేతృత్వంలో నగరం అభివృద్ధి

● డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్



శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్

నెల్లూరు(సిటీ), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరాన్ని అభివృద్ధి చేయడంలో మంత్రి నారాయణ దూసుకుపోతున్నారని ఎస్ఎంసీ డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ అన్నారు. 4వ డివిజన్ దీన్‌దయాళ్‌నగర్ వద్ద సీసీరోడ్డుకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేనంతగా నగరం అభివృద్ధి చెందుతుందన్నారు. మంత్రి నారాయణ రాజధాని పనుల్లో బిజీగా ఉన్నప్పటికీ తనను అత్యంత మెజార్టీతో గెలిపించిన నగర ప్రజలకు అభివృద్ధి ఫలాలు అందిస్తున్నారని తెలిపారు. తన పరిచయాలతో పెద్ద కంపెనీలతో మాట్లాడి సీఎస్ఆర్ ఫండ్స్‌ను తీసుకువచ్చి అనేక ప్రాంతాలు, విద్యా సంస్థలను బాగుచేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు మామిడాల మధు, ఆదినారాయణ రెడ్డి, మాల్యాద్రి పాల్గొన్నారు.

డ్రైవర్స్ కాలనీ వాసులకు పట్టాలు ఇవ్వాలి

● మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లు


కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న సీపీఎం నేతలు

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని డ్రైవర్స్ కాలనీ వాసులకు ఇళ స్థలం పట్టాలు ఇవ్వాలని డిప్యూటీ మేయర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదాలతో పాటు సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడుతూ దాదాపు 40 ఏళ్లుగా డ్రైవర్స్ కాలనీలో నివాసం ఉంటున్న బాధితులకు ఇళ్ల పట్టాల పంపిణీతో పాటు సైడు కాలువల నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పెంచలనర్సయ్య, సంపత్‌కుమార్, నరసింహారెడ్డి, శివాజీ, వెంకటేశ్, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న మున్సిపల్ కార్మికుల ఆందోళన

నెల్లూరు(సిటీ), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తమ డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్మికులు చేపట్టిన ఆందోళన సోమవారం నాటికి 7వ రోజుకు చేరింది. సమ్మె కాలంలో పాలకులు, అధికారులు ఇచ్చిన హామీ మేరకు జీతాలు చెల్లించాలని కోరారు. 60 ఏళ్లు నిండిన కార్మికులకు ఆర్థిక ప్రయోజనాలతో కూడిన ఉద్యోగ విరమణ చేయాలన్నారు. మరణించిన కార్మికుల కుటుంబ వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని తెలిపారు. అనంతరం మేయర్ స్రవంతికి వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కత్తి శ్రీనివాసులు, మనోజ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు కోడూరుపాడు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం, పీడీలు

నెల్లూరురూరల్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి హాకీ పోటీలకు నెల్లూరు రూరల్లోని కోడూరుపాడు జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం ప్రకాశం, పీడీ పద్మజ తెలిపారు. ఈనెల 7వ తేదీన జిల్లాస్థాయిలో జరిగిన హాకీ పోటీలలో తమ స్కూల్‌కు చెందిన అండర్-14 విభాగంలో షేక్ గౌషియా, రితిక, కామాక్షి, స్టాండ్‌బైగా ఇందువర్షిణిని, అండర్-17 విభాగంలో చైతన్య ప్రియ, స్టాండ్‌బైగా ఇందు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం వారిని స్కూల్లో అభినందించారు.

నూర్‌బాషా సంఘం కార్యాలయానికి స్థలం కేటాయించాలి

● మంత్రి నారాయణకు వినతి


మంత్రి నారాయణకు వినతిపత్రం సమర్పిస్తున్న నూర్‌బాషా సంఘం నాయకులు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో నూర్‌బాషా సంఘం కార్యాలయానికి స్థలం కేటాయించాలని కోరుతూ రాష్ట్ర పురపాలక పట్టణ అభివృద్ధి శాఖ మంత్రి నారాయణను నూరుబాషా సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు సోమవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కే బాబర్‌జాన్ ఆధ్వర్యంలో నాయకులు విజయవాడలోని సీఆర్‌డీఏ కార్యాలయంలో మంత్రి నారాయణకు వినతిపత్రం అందజేశారు. అందుకు ఆయన సానుకూలంగా స్పందించారని, త్వరలో స్థలం ఏర్పాటు చేయిస్తామని చెప్పారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు ఖాదర్‌బాషా, జిల్లా ప్రధాన కార్యదర్శి ఖాజా మస్తాన్, మహిళా అధ్యక్షురాలు మస్తానమ్మ, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు


పతకాలు సాధించిన క్రీడాకారులు


నెల్లూరు(విద్య), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి పీ.అఖిల్ తెలిపారు. నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్ హాలులో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 20 బంగారు, 3 వెండి, 3 కాంస్య పతకాలతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారన్నారు. విజేతలకు నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మనీషా, ఉపాధ్యక్షుడు ముఖేష్, కోశాధికారి శ్రీకాంత్, తైక్వాండో క్లబ్ నిర్వాహకుడు పవన్‌కుమార్, కోచ్‌లు వినోద్‌కుమార్, శ్రీనివాసులు, అస్రాస్, ప్రభ, నవీన్, ఆంజనేయులు, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

గొలగముడిలో ఉచిత వైద్యశిబిరం


చిన్నారిని పరీక్షిస్తున్న వైద్య నిపుణుడు

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వెంకటాచలం మండలం గొలగముడి వెంకయ్య స్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం తిరుపతి బర్డ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆసుపత్రి సంచాలకుడుగా డాక్టర్ గుడారు జగదీష్ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిగా ఈ వైద్య శిబిరం నిర్వహించారు. వెంకయ్య స్వామి ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ అధికారి బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో కీళ్లనొప్పులు, వెన్నుముక వ్యాధులతో బాధపడుతున్న 300 మందికి పైగా రోగులకు వైద్య చికిత్సలు అందించారు. చిన్నారులకు సెరిబ్రల్ పాల్స్ వంటి నాడీ వ్యవస్థ వ్యాధులకు కూడా చికిత్స అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగదీష్ మాట్లాడుతతూ ఆయా రోగులకు ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా కూడా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యులు మునిశంకర్‌రెడ్డి, హర్ష, అవినాష్, గౌతం వర్మ, విక్రాంత్, కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ప్రత్యేక అధికారి సీఎం రాజ్ నర్సింగ్ పాల్గొన్నారు.

వేదగిరి చైర్మన్‌కి హరిప్రసాద్‌రెడ్డి అభినందన


చైర్మన్ అచ్యుత్‌రెడ్డిని అభినందిస్తున్న హరిప్రసాద్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేదగిరి క్షేత్రం చైర్మన్ ఇందుపూరు అచ్యుత్ శంకర్ రెడ్డికి గొల్లకందుకూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు పొణక హరిప్రసాద్‌రెడ్డి సోమవారం అభినందనలు తెలిపారు. అచ్యుత్‌రెడ్డి సారథ్యంలో ఏర్పడిన నూతన పాలకవర్గం సమర్థవంతంగా పని చేసి దేవస్థానం అభివృద్ధికి పాటుపడాలని ఆయన ఆకాంక్షించారు.

త్వరలో టిడ్కో ఇళ్ల కేటాయింపు : కమిషనర్


కార్పొరేషన్ పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న అధికారులు

నెల్లూరు(సిటీ), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగర పరిధిలోని టిడ్కో సముదాయాల్లో అసంపూర్తిగా ఉన్న టిడ్కో ఇళ్లను పూర్తి చేసి అర్హులైన లబ్ధిదారులకు త్వరలో అప్పగిస్తామని ఎస్ఎంసీ కమిషనర్ నందన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో పాల్గొన్న ఆయన నగరవాసుల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం మాట్లాడుతూ టిడ్కో ఇల్లు కావాల్సిన వారు స్థానిక సచివాలయాలు, ఎన్ఎంసీ కార్యాలయంలోని హౌసింగ్ విభాగంలో దరఖాస్తులు అందచేయాలని కోరారు. అంతకు ముందు ఆయన ఏసీనగర్, జీఎన్టీరోడ్డు, ఎన్టీఆర్ నగర్, సుబేదార్‌పేట ప్రాంతలలో పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేశారు.

● శివం హోటల్‌కు డ్రైనేజీ కనెక్షన్ కట్

నగరంలోని శివం హోటల్‌కు కార్పొరేషన్ అధికారులు డ్రైనేజీ కనెక్షన్ తొలగించారు. సదరు హోటల్ యాజామాన్యం రూ.3 లక్షల వరకు ఆస్తి పన్ను బకాయి ఉండటం, మొండి బకాయిగా మారినా సదరు యాజమాన్యం చెల్లించకపోవడంతో ఈ తరహా చర్యలు తీసుకున్నట్లు ఆర్ఐ కిరణ్ తెలిపారు. పన్నులు చెల్లించి నగర అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

● 42 మంది ప్లానింగ్ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

నగరంలో పలు సచివాలయాల్లో పని చేస్తున్న 42 మంది ప్లానింగ్ కార్యదర్శులకు కమిషనర్ నందన్ షోకాజు నోటీసులు జారీ చేశారు. కమాండ్ కంట్రోల్ కార్యాలయంలో ప్లానింగ్ విభాగంతో సమీక్ష నిర్వహించగా వీరంత గైర్హజరైనందున 24 గంటల్లో లిఖితపూర్వక వివరణ ఇవ్వాలని ఆయన తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రెండవ ఏఎన్‌ఎంల సమస్యలు పరిష్కరించాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాంట్రాక్టు సెకండ్ ఏఎన్ఎంల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు నరమాల సతీష్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో భాగంగా ఏపీ కాంట్రాక్టు సెకండ్ ఏఎన్ఎంలతో కలిసి కలెక్టర్ హిమాన్షు శుక్లాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సేవలు అందించారన్నారు. వారికి కనీస వేతనం రూ.27వేల ఇవ్వాలని కోరారు. గతంలో మాదిరిగా యూనిఫాంతో పాటు అలవెన్స్‌లు ఇవ్వాలన్నారు. కేంద్ర ప్రభుత్వ నిబంధన ప్రకారం హెచ్ఆర్‌పీ పాలసీ అమలు చేయాలన్నారు. ఎఫ్ఆర్ఎస్, టెక్నికల్ సమస్యల నేపథ్యంలో వేతనాల కోతలు విధించటాన్ని నిలుపుదల చేయాలన్నారు. రిటైర్మెంట్ వయస్సు 62 ఏళ్లకు పెంచాలని, 180 రోజులు చైల్డ్‌కేర్ సెలవులు ఇవ్వాలని, హెల్త్‌కేర్ ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆయా సమస్యలను వెంటనే ప్రభుత్వం పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సెకండ్ ఏఎన్ఎం యూనియన్ జిల్లా అధ్యక్షురాలు స్వాతి, ప్రధాన కార్యదర్శి రవీనాజ్యోతి, కోశాధికారి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో ఆందోళన చేస్తున్న సెకండ్ ఏఎన్ఎంలు

ఇండియన్ రెడ్‌క్రాస్ సేవలు అద్వితీయం

● సెయిల్ కంపెనీ చైర్మన్ తారెక్ మహమ్మద్ ● రక్త భాగాల విభజన యంత్రం అందజేత

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖ సేవలు అద్వితీయమని సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీ చైర్మన్ తారెక్ మహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రానికి రక్త భాగాల విభజన యంత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌లో అందిస్తున్న సేవలకు అనుగుణంగా రక్తభాగాల విభజన యంత్రం (రిఫ్రిజిరేటర్ సర్ఫిఫ్యూజ్ మిసన్‌ను) అందజేశామని వెల్లడించారు. భవిష్యత్తులో మరింత సహకారం అందచేస్తామని తెలిపారు. తలసీమియా ప్రాజెక్టు సభ్యులు డాక్టర్ సీత, బ్లడ్‌బ్యాంకు చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ యశోవర్ధన్‌లు రెడ్‌క్రాస్ ప్రాజెక్టుల గురించి కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెయిల్ కంపెనీ ప్రతినిధులు నదియా, ఆల్‌బటాషీ, ఎరచ్ కూపర్, షేర్ల కూపర్, మహాపాత్ర, పుష్ప మహాపాత్ర, రెడ్‌క్రాస్ చైర్మన్ వాకాటి విజయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ చమర్తి జనార్దన్‌రాజు, కోశాధికారి సురేష్‌కుమార్‌జైన్, కమిటీ సభ్యుడు బయ్యాప్రసాద్ పాల్గొన్నారు.


పరికరం అందజేస్తున్న సెయిల్ కంపెనీ ప్రతినిధులు, రెడ్‌క్రాస్ నిర్వాహకులు



ఢిల్లీ బాంబు పేలుళ్ల నేపథ్యంలో సోమవారం రాత్రి వేదాయపాలెంలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

ఆక్రమణలు తొలగించారు సరే.. విద్యుత్ స్తంభాల సంగతేమిటి?

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని పొదలకూరు రోడ్డులో తెలుగుగంగ కాలనీ నుంచి శ్రీలంక కాలనీ వరకు నగరపాలక సంస్థ అధికారులు రోడ్డు మార్జిన్ ఆక్రమణలు తొలగించారు. అయితే రోడ్డు పక్కనున్న విద్యుత్ స్తంభాలు వదిలేయడంతో అవి అస్తవ్యస్తంగా మారాయి. విద్యుత్ స్తంభాలు రోడ్డు వెంబడి ఉండడంతో నిత్యం ట్రాఫిక్ ఉండే పొదలకూరురోడ్డులో ప్రమాదాలకు నిలయాలుగా మారాయి. దీంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. పొదలకూరు రోడ్డులో ఆక్రమణలు తొలగింపును అధికారులు హేతుబద్ధంగా తొలగించలేదని ప్రజలు అభిప్రాయపడుతున్నారు. గతంలో డైకస్‌రోడ్డు నుంచి పోలీసు ఆఫీసు వరకు ఆక్రమణలు తొలగించారు. అయినా కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు మార్చలేదన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా ఆక్రమణలు తొలగించిన ప్రాంతంలో విద్యుత్ స్తంభాలు తొలగించాలని వారు కోరారు.


పొదలకూరురోడ్డులో తొలగించని విద్యుత్ స్తంభాలు

అమరవీరుల స్ఫూర్తితో విధులు



అమరవీరుల స్థూపం వద్ద నివాళులు అర్పిస్తున్న డీఎఫ్‌వో, అటవీశాఖ ఉద్యోగులు

నెల్లూరు (వెంకటేశ్వరపురం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ అమరవీరుల స్ఫూర్తితో ఉద్యోగులు విధులు నిర్వహించాలని డీఎఫ్‌వో మహబూబ్‌బాషా పేర్కొన్నారు. నరగంలోని నిప్పో వద్ద గల జిల్లా అటవీశాఖ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన రాష్ట్ర అటవీ అమరవీరుల సంస్మరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ముందుగా అమరవీరుల స్థూపానికి డీఎఫ్‌వో, ఉద్యోగులు,సిబ్బంది నివాళులు అర్పించారు. అనంతరం రక్తదాన శిబిరాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది రక్తదానం చేయడం ఎంతో అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో రేంజర్లు మాల్యాద్రి, రామిరెడ్డి,శేఖర్,కుమార్‌రాజా, తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ.. 'డ్రమ్ములే' ప్రమాద సూచికలు !



అల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): అరే.. నడి రోడ్డుపై ఈ డ్రమ్ములేంటి? అని ఆశ్చర్యపోతున్నారా? అవును.. అల్లూరు పట్టణ శివారులోని బార్ సమీపంలో రాజుపాలెం-ఇస్కపల్లి రోడ్డు దుస్థితి ఇది. రోడ్డు మధ్యలో మోకాలి లోతు గుంత ఏర్పడి ప్రమాదకరంగా మారింది. ఈ మార్గంలో వాహన చోదకులు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గుంత మరింత పెద్దదిగా మారింది. వాన నీటితో నిండిన ఈ గుంతను గమనించక పలువురు వాహన చోదకులు ఇక్కడ ప్రమాదాలకు గురయ్యారు. పంచాయతీ పాలకులు ఈ రోడ్డుకు మరమ్మతులు చేయించే నాథుడే కరువయ్యాడని ప్రయాణికులు వాపోతున్నారు. దీంతో విధి లేక స్థానికులు వాహనచోదకులను ప్రమాదాల బారినుండి కాపాడేందుకు ఇదిగో.. ఇలా రోడ్డు మధ్యలో డ్రమ్ములనే ప్రమాద సూచికలుగా ఏర్పాటు చేయడం గమనార్హం. పాలకులారా.. అధికారులారా.. పల్లె రోడ్లపై ఈ డ్రమ్ముల దుస్థితిని చూశాకైనా.. మీ 'బాధ్యత' గుర్తొస్తుందా?

నేడు మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి) : జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్‌లోని శంకరన్ హాలులో భారతరత్న మౌలానా అబుల్ కలాం అజాద్ జయంతి వేడుకలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రజా ప్రతినిధులు, అధికారులు, ముస్లిం మత పెద్దలు, ముస్లింలు హాజరుకావాలని ఆయన కోరారు.

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడిగా శ్రీరామ్



నెల్లూరు(హరనాథపురం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడుగా నెల్లూరు రూరల్ మండలం కోడూరుపాడుకు చెందిన బీ.శ్రీరామ్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ సోమవారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ జిల్లాలో బీఎస్పీ బలోపేతానికి అహర్నిశలు కృషి చేస్తానన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఎస్పీని ముందంజలో నిలబెట్టేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఉద్యమాలు చేపడతామన్నారు.

తిరుమల లడ్డూ కుట్ర పాపం పండుతుంది!



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుమల లడ్డూలో కల్తీ నెయ్యి వాడి ప్రసాదం పవిత్రతను భ్రష్టు పట్టించిన వారి పాపాలు పండుతున్నాయని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి వెల్లడించారు. సోమవారం నెల్లూరు నగరంలోని తన కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ హయాంలో లీటరుకు రూ.20 కమీషన్ తీసుకుని కల్తీ నెయ్యి సరఫరా చేయించింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఒక్క లీటరు పాలు కొనుగోలు చేయని బోలేబాబా డెయిరీ నుంచి నెయ్యి కొనుగోలు చెయ్యడం అవినీతిలో భాగమేనన్నారు. జగన్‌రెడ్డికి హిందూ దేవుళ్లంటే నమ్మకం లేదని, మాజీ చైర్మన్ సుబ్బారెడ్డిది అదే పరిస్థితి అన్నారు. సీబీఐ విచారణతో నిర్ఘాతపోయే విషయాలు బయటకు వస్తున్నాయని, వాస్తవాలు జీర్ణించుకోలేక సాక్షిలో అడ్డగోలు వార్తలు వండి వారుస్తున్నారని విమర్శించారు. బ్యాంకు లావాదేవీలు సిట్ అధికారులు కోరితే వైవీ సుబ్బారెడ్డి కోర్టుకు ఎందుకు వెళ్లారని ప్రశ్నించారు. ఏఆర్ డెయిరీకి అర్హత లేకపోయినా నెయ్యి సరఫరా ఆర్డర్లు ఇవ్వడం కుంభకోణంలో భాగమేనన్నారు. వైవీ సుబ్బారెడ్డి, రోజా, చెవిరెడ్డిలు ధర్మారెడ్డి సహకారంతో వేల దర్శన టిక్కెట్లు అడ్డగోలుగా పొంది సంతలా మార్చేశారని ఆరోపించారు. ప్రస్తుత తిరుమల చైర్మన్ బీఆర్ నాయుడు ఆధ్వర్యంలో అంతా నిజాతీగా నడుస్తుందని కోటాకు మించి ఒక్క లెటరు అనుమంతిచే పరిస్థితి లేదని తెలిపారు.

తండ్రి హత్య కేసులో తనయుడికి జీవితఖైదు

ఉలవపాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కన్న తండ్రిని తలపై రాడ్డుతో కొట్టి, ఆపై మెడను కత్తితో కోసిన కొడుక్కి ఒంగోలు ఫస్ట్ ఏడీజే న్యాయాధికారి టీ. రాజ్యలక్ష్మి జీవిత ఖైదుతోపాటు రూ.500 జరిమానా విధించారు. పోలీసుల కథనం మేరకు, మండలంలోని చాకిచర్లకి చెందిన ఒట్లూరు కృష్ణ(30) దురుసు ప్రవర్తనతో భార్య వదిలేసి వెళ్లింది. దీంతో ఆయన తల్లిదండ్రులపై ఆధారపడి బతుకుతున్నాడు. తల్లి అనారోగ్యంతో బాధపడుతుండగా తనను పట్టించుకోవడం లేదనే కోపంతో 2022 జనవరి 27న తండ్రి రమణయ్యను ఇనుప రాడ్డుతో తలపై కొట్టాడు. కిందపడిన తండ్రి మెడను కత్తితో కోసి చంపాడు. ఈ విషయమై కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు సాక్ష్యాధారాలతో చార్జిషీటు దాఖలు చేశారు. కేసు పూర్వాపరాలు విచారించిన న్యాయాధికారి నిందితుడికి సోమవారం పైవిధంగా తీర్పు చెప్పారు. ఈ కేసును వాదించడంలో ప్రతిభ కనపరిచిన స్పెషల్ పీపీ పద్మజ, కేసు విచారణలో సాక్ష్యాలను పొందుపరిచిన అప్పటి కందుకూరు సీఐ వీ శ్రీరామ్, ఏఎస్సై ఎం వెంకటేశ్వర్లు, ఉలవపాడు పోలీసులను ఎస్పీ అజిత వేజెండ్ల ప్రత్యేకంగా అభినందించారు.

చెరువులో పడి యువకుడి మృతి

లింగసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినపవని గ్రామానికి చెందిన ఓ యువకుడు మద్యం మత్తులో చెరువులో పడి మృతి చెందాడు.ఈ సంఘటన ఆదివారం రాత్రి జరిగింది.లింగసముద్రం ఎస్సై ఎం నారాయణ కథనం మేరకు, చినపవని గ్రామానికి చెందిన షేక్ అబ్దుల్ కరీం స్నేహితుడితో కలిసి రాత్రివేళ చెరువు కట్టపై కూర్చొని మద్యం సేవిస్తున్నాడు.అయితే ప్రమాదవశాత్తు అబ్దుల్ కరీం చెరువులో పడిపోయాడు. ఈ విషయం తెలిసిన ఆయన బంధువులు, గ్రామస్థులు చెరువులో గాలింపు చేపట్టారు.అయితే కొద్దిసేపటి తర్వాత అబ్దుల్ కరీంను బయటకు తీశారు.దీంతో ఆయన తల్లి, సోదరులు, బంధువులు ఆయన్ను హుటాహుటిన చికిత్స కోసం కావలిలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి, ఆయన చనిపోయినట్టు నిర్ధారించారు.దీంతో వారు గ్రామంలోని తమ స్వగృహానికి మృతదేహాన్ని తీసుకువచ్చారు. సోమవారం ఆయన తల్లి ఆసియా బేగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై నారాయణ తెలిపారు.

కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలి

వరికుంటపాడు(ఉదయగిరి రూరల్), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ పరిధిలో పక్కాగృహాల నిర్మాణంలో అవినీతికి పాల్పడిన కాంట్రాక్టర్‌పై చర్యలు చేపట్టాలని సర్పంచు దిలీప్‌కుమార్ కోరారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన మాట్లాడుతూ 2022-24లో 34 మంది లబ్ధిదారుల నివాసాలను ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ అగ్రిమెంటు చేయించుకోవడం జరిగిందన్నారు. అనంతరం బేస్‌మెంట్ వరకు నాశిరకంగా పనులు చేపట్టి సుమారు రూ. 90వేలు వరకు నిధులు స్వాహా చేసి పరారయ్యాడన్నారు. గతంలో పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఫలితం లేకుండా పోయిందని, ఇప్పటికైనా స్పందించి లబ్ధిదారులకు న్యాయం చేయాలని కోరుతూ ఎంపీడీవోకి వినతిపత్రం అందజేశారు.



ఎంపీడీవోకి వినతిపత్రం అందిస్తున్న సర్పంచు దిలీప్‌కుమార్

వరిలో జింకు లోపం.. దిగుబడులపై ప్రభావం

- భూసార పరీక్షలు తప్పనిసరి
- కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి

నెల్లూరు(వ్యవసాయం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వరి పైరులో జింకు లోపం కారణంగా మొక్కలు ఎదగకపోవడం.. తక్కువ దుబ్బు కట్టడం.. ఆకులు పసుపు రంగులోకి మారడం.. వంటి లక్షణాలు కనిపిస్తాయి. వీటివల్ల సుమారు 10శాతం వరకు దిగుబడులు తగ్గే అవకాశం ఉంది. జిల్లాలోని అన్నీ రకాల నేలల్లో జింకు లోపం తీవ్రంగా ఉందని, తద్వారా నత్రజని, భాస్వరం, పొటాష్ ఎరువులను మొక్కలు సమర్థవంతంగా ఉపయోగించుకోలే పోతున్నాయని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) సేద్య విజ్ఞాన విభాగం శాస్త్రవేత్త డాక్టర్ కే.కిరణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. దీనివల్ల ఎరువుల ఖర్చులు పెరుగుతాయే తప్ప, ఎలాంటి ప్రయోజనం ఉండదన్నారు. వరిపైరులో జింకు ధాతువు లోపం లక్షణాలు, నివారణ పద్ధతులను ఆయన ఆంధ్రజ్యోతి ద్వారా రైతులకు తెలియజేశారు.



జింకు లోపం ఉన్న వరిపైరు (ఫైల్)

● జింకు లోపానికి కారణాలు

లవణ సాంద్రత ఎక్కువగా ఉన్న నేలలు, క్షార, ఒండ్రు, సున్నపు నేలల్లో జింకు లోపం కనిపిస్తుంది. ఈ నేలల్లో సేంద్రీయ కర్బన శాతం తక్కువగా ఉండడం, కేవలం రసాయన ఎరువుల పైనే ఆధారపడి, సేంద్రీయ ఎరువులను విస్మరించడం, సమగ్ర ఎరువుల యాజమాన్యాన్ని పాటించకపోవడం వల్ల కూడా జింకు లోప లక్షణాలు కనిపిస్తాయి.

● లక్షణాలు

నారుమడిలోనూ, వరినాట్లు నాటాక ప్రధాన పొలంలోనూ జింకు లోపం కనిపిస్తోంది. చలి విపరీతంగా ఉండే రబీలోనూ, ఎడగారు వరిలోనూ ఎక్కువ జింకు లోపం వచ్చే అవకాశం ఉంది. దీనివల్ల ప్రధాన పోషకాలు తగినంత వేసినా కూడా పైరు సరిగా పెరగదు. సాధారణంగా వరి నాటిన రెండు నుంచి నాలుగు, ఆరు వారాల్లో దుబ్బు కట్టే దశలో జింకు లోపాలు స్పష్టంగా కనిపిస్తాయి. పై నుంచి మూడు లేదా నాలుగు ఆకుల్లో ఈనె పాలిపోతుంది. ముదురాకు చివర్లో మధ్య ఈనెల ఇరుపక్కల తుప్పు ఇటుకరంగు మచ్చలు కనిపిస్తాయి. ఆకులు చిన్నవిగా, పెళుసుగా ఉండి వంచగానే శబ్దం చేస్తూ విరిగిపోతాయి. మొక్కలు గిడసబారి దుబ్బు చేయవు. గుట్టగుట్టలుగా పైర్లు చనిపోయి ఖాళీగా పొలంలోనే నేల కనిపిస్తుంది నత్రజని ఎరువులు వేసినా పైరు పచ్చగా మారదు.

● నివారణ చర్యలు

వరిపైరు వేసే ముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించాలి. జింకు తగినంత ఉందో.. లేదో...? తెలుసుకోవాలి. జింకు లోపం ఉందని తేలితే తప్పనిసరిగా ఎకరాకు 20కిలోల జింకు సల్ఫేట్‌ను వేసుకోవాలి. నారుమడడిలో సెంటు స్థలానికి 500గ్రాముల జింకు సల్ఫేట్‌ను ఆఖరి దుక్కిలో వేసుకోవాలి. ఎకరాకు రెండు క్వింటాళ్ల పశువుల ఎరువు, లేకుంటే కంపోస్టు, లేదంటే కోళ్ల వ్యర్థాలు, లేకుంటే ఫిల్టర్ మడ్ లాంటి సేంద్రీయ ఎరువులతో కలిపి 15కిలోల జింకు సల్ఫేట్‌ను 20 నుంచి 30 రోజుల వరకు గోనెసంచిలో ఉంచి మాగబెట్టాలి. ఈ మిశ్రమాన్ని పైరు వేసే ముందు దుక్కిలో చల్లితే దిగుబడిలో మార్పు కనిపిస్తుంది. వరి మాత్రమే పండించే పొలాల్లో ప్రతి మూడు పైర్లకు ఒకసారి, రెండు పంటలు పండించే పొలంలో ప్రతి రబీ పంటకు ఆఖరి దమ్ములో ఎకరాకి 20కిలోల జింకు సల్ఫేట్ వేయాలి. క్షార, చౌడు, సున్నపు నేలలైతే జింకు సల్ఫేటును ఎకరాకి 40కిలోల చొప్పున వేసుకోవాలి. 1-2 కిలోల జింకు సొల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా అనే జీవన ఎరువును 50కిలోల మట్టి, లేదంటే వర్మికంపోస్టు, లేదంటే పశువుల ఎరువుతో కలుపుకుని రెండు నుంచి మూడు రోజుల తరువాత ఎకరానికి చల్లుకోవాలి. 5-10 గ్రాముల జింకు సొల్యుబిలైజింగ్ బ్యాక్టీరియా జీవన ఎరువును కిలో విత్తనానికి జిగురుతో లేదంటే బెల్లం ద్రావణంతో కలిపి నీడలో ఆరబెట్టి విత్తనాన్ని ఉపయోగించాలి. వరిపైరు జింకు లోపం కనిపించిన వెంటనే లీటరు నీటికి 2గ్రాముల చొప్పున జింకు సల్ఫేట్‌ను కలిపి 5రోజుల వ్యవధిలో 2-3 సార్లు పిచికారీ చేయాలి. భాస్వరం ఎరువుతో జింకు సల్ఫేటును కలిపి వేయకూడదు. రెండింటికి మధ్య కనీసం మూడు రోజుల వ్యవధి ఉండాలి. రెండూ కలిపి వేస్తే రసాయనిక చర్య వల్ల ఫలితం ఉండదు. జింకు సల్ఫేటు ద్రావణంలో పురుగు, తెగుళ్ల మందులు కలపరాదు.



డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి

అర్జీదారుల సమస్యలు పరిష్కరించాలి



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు (వైద్యం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రానికి వచ్చే అర్జీదారుల సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో పీజీఆర్ఎస్ నిర్వహించారు. ఈ సందర్భగా కలెక్టర్ మాట్లాడుతూ వచ్చిన విజ్ఞప్తులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించి, అర్జీదారులు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని చెప్పారు. భూ సమస్యలు, ఇతర రెవెన్యూ అంశాలపై అర్జీలు ఎక్కువగా వస్తున్నాయని, వాటిని పరిష్కరించే దిశగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. సమస్యలు ఎందుకు పరిష్కారం కాలేదో అర్జీదారులకు వివరించాలని పేర్కొన్నారు. అనంతరం ఆయన పలు అర్జీలను పరిష్కరించారు అనంతరం దివ్యాంగుల వద్దకు వెళ్లిన కలెక్టర్ సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జేసీ మొగిలి వెంకటేశ్వర్లు, డీఆర్‌వో విజయకుమార్, డీపీవో శ్రీధర్‌రెడ్డి, డ్వామా పీడీ గంగాభవాని తదితరులు పాల్గొన్నారు.

చట్ట పరిధిలో న్యాయం చేస్తాం : ఎస్పీ



అర్జీలు స్వీకరిస్తున్న ఎస్పీ అజిత

నెల్లూరు(క్రైం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రతీ సమస్యకు చట్టపరిధిలో న్యాయం చేస్తామని జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. 134 వినతులు రాగా వాటిని పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సౌజన్య, ఆత్మకూరు, ఎస్బీ డీఎస్పీలు వేణుగోపాల్, శ్రీనివాసరావు, లీగల్ అడ్వైజర్ శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా ప్రేమను నిరాకరించానని కావలికి చెందిన వేణు తన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పెడుతూ వేధిస్తున్నాడని అతనిపై చర్యలు తీసుకోవాలని ఓ మహిళ ఫిర్యాదు చేసింది. అదేవిధంగా మనుబోలుకు చెందిన రమణయ్య మానసికంగా వేధింపులకు గురిచేస్తున్నాడంటూ నెల్లూరు రూరల్‌కు చెందిన ఓ దివ్యాంగురాలు ఫిర్యాదు చేసి అతని నుంచి రక్షణ కల్పించాలని కోరింది. కొండాపురంకు చెందిన మాలకొండయ్య సబ్సిడీలోన్లు ఇప్పిస్తానని నమ్మించి రూ.35వేలు తీసుకుని మోసం చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని అదే గ్రామానికి చెందిన ఓమహిళ ఫిర్యాదు చేసింది. ఇంకా బ్యాంకు ఉద్యోగం ఇప్పిస్తామని నెల్లూరు నగరానికి చెదిన బెనర్జీ రూ.10లక్షలు తీసుకుని మోసం చేశాడని వేదాయపాళెంకు చెందిన ఓవ్యక్తి ఫిర్యాదు చేశారు.

'చంద్రన్న విద్యుత్ వెలుగు'తో ప్రయోజనం

త్రీ ఫేజ్ కరెంటు సరఫరా సందర్భంగా కలెక్టర్



రైతుతో కలిసి త్రీఫేజ్ విద్యుత్ సరఫరాను ప్రారంభిస్తున్న కలెక్టర్ శుక్లా, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): చంద్రన్న విద్యుత్ వెలుగుల పేరిట త్రీ ఫేజ్ కరెంట్‌ను 24 గంటల పాటు అందించడం వల్ల రైతులకు, పారిశ్రామికవేత్తలకు ప్రయోజనం చేకూరనున్నదని కలెక్టర్ హిమాన్షు శుక్లా, రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రూరల్ నియోజకవర్గంలో త్రీఫేజ్ పనులను సోమవారం వారు కోడూరుపాడు వద్ద రైతు రమణయ్య యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం నిర్వహించిన సభలో మాట్లాడుతూ నెల్లూరు రూరల్లో రూ. 50 కోట్లతో గ్రామాలు, మూడు డివిజన్లలో ఈ పనులు పూర్తయ్యాయని చెప్పారు. ఇందువల్ల రైతులకు సాగునీటి సరఫరా కష్టాలు పూర్తిగా తీరినట్టేనని తెలిపారు. అటు వ్యాపారులు, ఇటు చిన్న పరిశ్రమదారులకు ఊరట లభించిందన్నారు. కోడూరుపాడులోని ఎస్టీకాలనీని భగత్‌సింగ్ కాలనీ తరహాలో అభివృద్ధి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జేసీ వెంకటేశ్వర్లు, ఎస్ఈ రాఘవేంద్రన్, కార్పొరేటర్ నాగరాజు, టీడీపీ నేతలు గిరిధర్‌రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, భానుశ్రీ పాల్గొన్నారు.కాగా నియోజకవర్గంలో ఎక్కడిక్కడ రైతులతో విద్యుత్ పనులను ప్రారంభించారు.

ట్రాన్స్‌జెండర్లకు గుర్తింపు కార్డులు



ట్రాన్స్‌జెండర్‌లకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 70 మంది ట్రాన్స్‌జెండర్‌లకు కలెక్టర్ హిమాన్షు శుక్లా సోమవారం గుర్తింపు కార్డులు అందజేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ల ప్రతినిధి వనజ మాట్లాడుతూ తమకు గుర్తింపు కార్డులు ఇవ్వడం వల్ల ఎంతో ఉపయోగం ఉంటుందని తెలిపారు. పింఛన్ మంజూరుకు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు పొందేందుకు అధికారులు గుర్తింపు కార్డు అడుగుతున్న నేపథ్యంలో ఇది ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆఖరికి శబరమలకు వెళ్లాల్సి ఉన్నా కలెక్టర్ ఇచ్చిన గుర్తింపు కార్డు ఎంతో ఉపయోగ పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్లు పాల్గొన్నారు.

పట్టపగటి పూట.. సర్పాల సయ్యాట !

- విష పురుగులకు నిలయంగా ఇందిరమ్మకాలనీ

కావలి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇక్కడ రగిలేందుకు మొగలి పొద లేదు. వేయడానికి చెరుకు గడల మంచమూ లేదు. ఊదడానికి నాదస్వరమూ లేదు. అందుకే.. ఎక్కడ కలుసుకోవాలో తెలియక మునుసూరు ఇందిరమ్మ కాలనీలో.. ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో.. ఏపుగా పెరిగిన పచ్చగడ్డిలో ఓ నాగుపాము-జెర్రిపోతు ఇదిగో.. ఇలా.. విరహంతో పెన వేసుకున్నాయి. చిరంజీవి సినిమాలో అయితే.. ఇది.. సర్పాల సయ్యాటే. కానీ.. కావలి పట్టణంలోని ఇందిరమ్మకాలనీలో మాత్రం ఇది.. ప్రజల ప్రాణాలతో ఆడే ప్రమాదకరమైన ఆట! కాలనీలో వీధి దీపాలు లేవు. అర్ధంతరంగా ఆగిన నివాసాల మధ్య.. సాగే ఈ సర్పాల నృత్యాన్ని ఇక్కడి పాలకులు.. అధికారులు ఓ చోద్యంలా చూస్తున్నారు. మరోవైపు.. స్థానికులు మాత్రం నిత్యం విష పురుగుల గుప్పిట్లో భయాందోళనలకు గురవుతున్నారు. అట్టల ఫ్యాక్టరీ సమీపంలోని మాదాల వెంకటేశ్వర్లు ఇంటి ముందు సోమవారం పట్టపగలే సుమారు 10 అడుగుల పొడవు గల నాగుపాము, జెర్రిపోతులు పెనవేసుకుని తోకలపై లేచి నాట్యం చేయడంతో కాలనీవాసులు, పిల్లలు భయంతో వణికిపోయారు. ఇందిరమ్మకాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని, నివాసాల మధ్య అసంపూర్తి నిర్మాణాలతో నిరుపయోగంగా ఉన్న ఇంటి బేస్‌మెంట్లు విష సర్పాలకు నిలయాలుగా మారాయని స్థానికులు వాపోతున్నారు. పట్టపగలే పాములు కనిపిస్తుండడంతో ఇక.. రాత్రి సమయాల్లో అయితే ఇళ్ల నుండి బయటకు రాలేకపోతున్నామని కాలనీవాసులు చెబుతున్నారు. అధికారులు, పాలకులు వెంటనే స్పందించి, వీధి దీపాలు ఏర్పాటు చేసి, నివాసాల మధ్య బేస్‌మెంట్ల వద్ద రక్షణ చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.



నేడు చిరుధాన్యాల మేళా

వింజమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక గోనుగుంట కల్యాణ మండపంలో మంగళవారం చిరుధాన్యాల మేళా నిర్వహిస్తున్నట్లు వ్యవసాయ సహాయ సంచాలకుడు శేషగిరి సోమవారం తెలియజేశారు. ఈ కార్యక్రమానికి డివిజన్ పరిధిలోని వింజమూరు, కలిగిరి, కొండాపురం, జలదంకి, మండలాల నుంచి సుమారు 200 మంది రైతులు పాల్గొంటారని తెలిపారు. ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల, ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ హాజరవుతారని శేషగిరి తెలిపారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 11704
వెండి కిలో ధర	రూ. 155700
వెండి ఒక గ్రాము	రూ. 161.70

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవార పూజలు



ఉదయగిరి: సిద్ధేశ్వరాలయంలో పూజలు చేస్తున్నభక్తులు



ఆత్మకూరు: ప్రత్యేక అలంకరణలో శివుడు



సంగమేశ్వరాలయంలో కార్తీక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ఆత్మకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం మూడవ సోమవారం సందర్భంగా భక్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆత్మ కూరు పట్టణంలోని శివాలయం, వెంకటేశ్వర స్వామి ఆలయం, అభయాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి ఆలయం, అలఘనాథస్వామి ఆలయాలలో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. శివాలయంలో అయ్యప్ప భక్తులు భజన కార్యక్రమం నిర్వహించారు.

● **సంగం:** మండలంలో పలు ఆలయాల్లో కార్తీక సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సంగమేశ్వరాలయం, తిరుమనకొండలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, వంగల్లు లోని భీమేశ్వరాలయం, దువ్వూరులోని కోటేశ్వరాలయం, మక్తాపురంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో క్షీర, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు కార్తీక దీపాలు వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. దీంతో ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

● **ఉదయగిరి:** మండలంలోని గండిపాళెం జలాశయం ఆవరణలో ఉన్న సిద్ధేశ్వరస్వామి ఆల యంలో అర్చకులు స్వామివారికి సుగంధ ద్రవ్యా లతో పంచామృతాభిషేకం, భస్మాభిషేకం, సహస్ర దీపాలంకరణ, జ్వాలాతోరణం, ప్రత్యేక పూజలు, విశేష అలంకరణలు చేపట్టారు. అలాగే ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, మండలంలోని లింగాలదొనక్షేత్రం, యర్రబల్లిగడ్డ, ఆర్లపడి య, గుడినరవ, అప్పసముద్రం తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తుల శివనామస్మరణతో మార్మో గాయి. స్వామివారికి ప్రత్యేక పూజలు చేపట్టి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పలుచోట్ల భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

పరీక్షల్లో మెరుగైన ఫలితాలు సాధించాలి



పరీక్షలను తనిఖీ చేస్తున్న ఎంఈవో వెంకటేశ్వర్లు

ఉదయగిరి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమ్మేటివ్ అసెస్మెంట్-1 పరీక్షల్లో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించాలని ఎంఈవో-1 టీ వెంకటేశ్వర్లు సూచించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న పరీక్షలను ఆయన పరిశీలించారు. ప్రశ్నపత్రాలను విద్యార్థులకు ఇచ్చే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పరీక్షల అనంతరం వీలైనంత త్వరగా వారి వద్ద నుంచి అసెస్మెంట్ బుక్‌లెట్స్ తీసుకొని మార్కులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. అలాగే పట్టణంలోని బీసీ కాలనీ ఆదర్శ పాఠశాలను ఎంఈవో-2 టీ.శ్రీనివాసులు సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు జీ శ్రీనివాస్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

హౌసింగ్ లేఅవుట్ స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు



లేఅవుట్ చుట్టూ వేసిన కంచెను పరిశీలిస్తున్న వీఆర్వో జనార్దన్

కలువాయి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): హౌసింగ్ లేఅవుట్ స్థలం ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దారు డి వెంకటేశ్వర్లు హెచ్చరించారు. మండలంలోని కుల్లూరులో అక్రమార్కులు ఏకంగా హౌసింగ్ లేఅవుట్‌కు చుట్టూ కంచె వేసి ఆక్రమించారు. దీనిపై రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందడంతో సోమవారం కంచెను తొలగించారు. జగన్ హయాంలో కుల్లూరు- మాదన్నగారిపల్లె మధ్యలో కొండపై హౌసింగ్ లేఅవుట్ వేసి లబ్ధిదారులకు ప్లాట్లు కేటాయించారు. ఆప్షన్-3 కింద కాంట్రాక్టర్ ఈ లేఅవుట్‌లో కొన్ని ఇళ్లకు బేస్‌మెంట్ వేశారు. ఆ తరువాత ఇళ్ల నిర్మాణం నిలిచిపోయింది. దీంతో ఈ లేఅవుట్‌పై కొందరు అక్రమార్కుల కన్నుపడింది. చుట్టూ కంచె వేసి ఆక్రమిచారు. దీనిపై తహసీల్దారుకు ఫిర్యాదులు వెళ్లడంతో వీఆర్వో జనార్ధన్, రెవెన్యూ సిబ్బందితో కలసి కంచెను తొలగించారు.

వాహనాల రుసుం వసూలుకు వేలం పాట



వాహనాల రుసుము వసూలుకు వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

ఏఎస్ పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రం స్థానిక నాయబ్ రసూల్ దర్గాకు విచ్చేసే వాహనాల రుసుము వసూలుకు సోమవారం డిప్యూటీ ఎంపీడీవో మునిరత్నం ఆధ్వర్యంలో వేలం పాట నిర్వహించారు. గ్రామానికి చెందిన షేక్ కరీముల్లా 7లక్షల 21వేల రూపాయలకు పాటపాడి దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి షరీఫ్, టీడీపీ నాయకులు షేక్ జిలాని బాషా, తదితరులు పాల్గొన్నారు.

ఆ వైద్యశాలకు వెళ్లాలంటే హడల్

● రహదారిని కమ్మేసిన కంపచెట్లు



రహదారిని కమ్మేసిన కంప, పిచ్చిచెట్లు

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లాలంటే రోగులు బెంబేలెత్తుతున్నారు. గ్రామ శివారు ప్రాంతంలోని వైద్యశాల 24 గంటల వైద్యశాలగా మార్పు చేసినప్పటికీ అటుగా వెళ్లాలంటే భయంతో వెనకడుగు వేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దారి పొడవునా రహదారికి ఇరువైపులా ఏపుగా కంప, పిచ్చిచెట్లు పెరిగి విష పురుగుల పుణ్యమాని ఏ సమయంలో ఎలాంటి ప్రమాదం సంభవిస్తుందోనని హడలెత్తిపోతున్నారు. ఆరోగ్యం కోసం వైద్యశాలకు వెళ్లే సంగతి అటుంచితే ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందేమోనని ప్రాణాలు గుప్పెట్లో పెట్టుకొని ముందుకు సాగాల్సిన దుస్థితి నెలకొంది. పగలు ఎలాగోలా వెళ్లినప్పటికీ రాత్రి సమయాల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉంటోందని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆ మార్గంలో కంపచెట్లను తొలగించి రాకపోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలని రోగులు కోరుతున్నారు.

మేత పోరంబోకు భూములను ఎవరికీ కేటాయించొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

సీతారామపురం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పబ్బులేటిపల్లి రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 146, 147, 148లో గల పశువుల మేత పోరంబోకు భూములను రిటైర్డ్ ఆర్మీ సిబ్బందికి కేటాయించొద్దని కోరుతూ సోమవారం పబ్బులేటిపల్లి సర్పంచ్ ఆదినారాయణ ఆధ్వర్యంలో గోనువారిపల్లి, ఓగూరువాండ్లపల్లి, చింతోడు గ్రామాల ప్రజలు తహసీల్దార్ షేక్ ఫజిహాకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పశువుల మేత పోరంబోకు భూమిలో తమ ఆవులు, గేదెలు, మేకలు, గొర్రెలు మేపుకొంటూ జీవనం సాగిస్తున్నామని, ఆ భూమిని రిటైర్డ్ ఆర్మీ సిబ్బందికి కేటాయిస్తే తాము ఇబ్బందులకు గురికావల్సి వస్తుందన్నారు. అలాగే చింతోడు గ్రామ చెరువు తూము వద్ద సర్వే నెంబర్ 32, 33, 34లో గల భూములను అటవీశాఖ అధికారులకు కేటాయించడం తగదన్నారు. ఒకవైపు రిటైర్డ్ ఆర్మీ వారు, మరోవైపు అటవీ సిబ్బంది ఆయా భూముల్లో ప్రవేశించి జంగిల్ క్లియరెన్స్ పనులు చేపడుతున్నారని, అధికారులు స్పందించి ఆయా సర్వే నెంబర్లలోని భూములను వారికి కేటాయించకుండా చూడాలన్నారు. అందుకు స్పందించిన తహసీల్దార్ క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులకు న్యాయం చేస్తామన్నారు.

కనిపించని పాలకేంద్రం ఆనవాళ్లు



కంపచెట్లలో కనిపిస్తున్న ఇనుప చువ్వలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), నవం బరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోటల చెరువుపల్లిలో పాలకేంద్రం భవన నిర్మాణానికి గత వైసీపీ ప్రభుత్వం రూ. 16లక్షల నిధులను మంజూరు చేసింది. అయితే ఆ పనులను చేపట్టిన ఆపార్టీ నాయకులు తొలుత హడా విడిగా పనులు చేపట్టారు. అనంతరం జరిగిన పరిణామాలతో పనులు మొరాయించాయి. బిల్లులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా మం జూరు చేయడం జరుగుతుందని అధికారులు చెబుతున్నప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. దీంతో బేస్‌మెంట్ వరకు పూర్తిచేసిన పనులు కంపచెట్ల నడుమ చిక్కుకొని ఆనవాళ్లు లేకుండా పోతున్నాయి. పిల్లర్ల కోసం ఎత్తుగా ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలే ఆధారంగా కనిపిస్తున్నాయి. ప్రధాన రహదారికి ఆనుకొని ఉండడంతో అటువైపు చూసిన ప్రతి ఒక్కరూ అధికారుల నిర్లక్ష్య వైఖరి పుణ్యమా అని నిధులు దుర్వినియోగం అవుతున్నాయని అస హనం వ్యక్తం చేస్తున్నారు. ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ తుప్పుపట్టిన ఆ చువ్వలతో పనులు చేస్తే నాణ్యత దెబ్బతినే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులు వృథా కాకుండా భవన నిర్మాణ పనులు కొనసాగేలా చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నిరుపయోగంగా సోమశిల అతిథి గృహం



నిరుపయోగంగా ఉన్న అతిథి గృహం

అనంతసాగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం వద్ద పర్యాటకులు, భక్తుల కోసం నిర్మించిన అతిథిగృహం సిబ్బంది లేక నిరుపయోగంగా ఉంది. దీంతో కార్తీక మాసంలో సోమేశ్వరుని దర్శనం కోసం వచ్చే భక్తులు, అయ్యప్ప మాలధారులు అవస్థలు పడుతున్నారు. వసతిగృహం ఉన్నా బస చేయలేని పరిస్థితి నెలకొందని, ఇప్పటికైనా అధికారులు స్పందించి అతిథి గృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలని భక్తులు కోరుతున్నారు.

గిరిజన కాలనీల్లో కనీస వసతుల కరువు

అనంతసాగరం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సాగరం గిరిజన కాలనీల్లో కనీస వసతులు లేక పూరిగుడెసెల్లో జీవనం సాగిస్తున్నారు. ఇళ్ల స్థలాలు లేక ఇళ్లు మంజూరుకాక కాలం గడుపుతున్నారు. కాలనీలో సుమారు 100 కుటుంబాలు ఉండగా గతంలో కొందరికి ఇళ్లు మంజూరు చేసి గుత్తేదారులతో గృహాలు నిర్మించారు. అవి చిన్నపాటి వర్షం కురిసినా ఉరుస్తున్నాయి. దీంతో వర్షాకాలంలో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. ఇక చేపలవేట, వ్యవసాయ కూలీలుగా జీవనం సాగిస్తున్నారు. వసతులు లేని గుడిసెల్లో తలదాచుకొంటున్నారు. వీరి చిన్నారులు పోషకాహారలోపంతో బక్కచిక్కి ఉన్నారు. కాలనీ మధ్యలో చెక్‌డ్యాం ఉండడంతో వర్షం పడితే వరద పోటెత్తుతుంది. ఆ సమయంలో వాగు దాటాలంటే అవస్థలు పడుతున్నారు. ఈప్రాంతంలో బ్రిడ్జి నిర్మించి సమస్య పరిష్కరించాలని కాలనీ వాసులు కోరుతున్నారు. కాగా, కాలనీలో అంతర్గత రహదారులు అధ్వానంగా ఉండడంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సీసీ రహదారులు నిర్మించి సమస్య పరిష్కరించారు. అలాగే ఇళ్లు లేని వారిని గుర్తించి ఇళ్లు, స్థలాలు, తమకు జీవనోపాధి కోసం ఏర్పాట్లు చేయాలని గిరిజనులు కోరుతున్నారు.



గిరిజన కాలనీలో ఉన్న గుడిసె

న్యూస్ బాక్స్

దుకాణాల తనిఖీ



చిల్లర దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ షేక్ మొహసిన్

ఏఎస్ పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వ్యాపారస్తులు నిబంధనలు పాటించకపోతే చట్టరీత్యా చర్యలు తప్పవని తూనికల శాఖ ఇన్‌స్పెక్టర్ షేక్ మొహసిన్ హెచ్చరించారు. సోమవారం ఆయన ఏఎస్ పేటలోని పలు దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని రెండు దుకాణాల యజమానులకు జరిమానా విధించారు. ఈ విషయం తెలుసుకున్న పలువురు వ్యాపారస్తులు దుకాణాలు మూసివేశారు.

వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలి



కేజీబీవీ పాఠశాలను తనిఖీ చేస్తున్న వైద్యులు కేఎల్ఎన్ స్వామి

ఏఎస్ పేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యులు కెఎల్ఎన్ స్వామి సూచించారు. సోమవారం ఆయన కెజిబివి, ఆదర్శ పాఠశాల, బిసి బాలుర పాఠశాలలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా స్టోర్ రూములు, వంట గదులు, బాత్‌రూములను పరిశీలించారు. వ్యాధులు వ్యాపించకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రషీద్, ఎంపిహెచ్ఎ కిషోర్‌కుమార్, ఎఎన్ఎం సురేఖ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

భూమికి హద్దులు చూపించాలని వినతి



తహసీల్దారుకు వినతిపత్రం సమర్పిస్తున్న వెంకటసుబ్బయ్య

వింజమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తన జుట్టా భూమికి హద్దులు చూపించాలని మండలంలోని కాటేపల్లి పంచాయతీలో నివాసం ఉంటున్న కుండా వెంకటసుబ్బయ్య సోమవారం తహసీల్దారుకు వినతిపత్రం అందచేశారు. సర్వే నెంబరు 435-4లో 2ఎకరాల 76సెంట్లు పట్టాలో భూమి ఉంటే సాగులో తక్కువ ఉందని, దానికి సంబంధించి హద్దులు చూపమంటే చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా తన భూమికి హద్దులు చూపించి న్యాయం చేయాలని వినతిపత్రం సమర్పించారు.

అయ్యప్పస్వాముల భిక్షాటన

వింజమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా స్థానిక పోస్టాఫీసు వీధిలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో సోమవారం అయ్యప్ప భక్తులు భిక్షాటన చేశారు. స్వామివారి విగ్రహాన్ని ట్రాక్టర్‌పై ఉంచి చెన్నకేశవ స్వామి గుడి నుంచి బంగ్లా సెంటర్ వరకు భిక్షాటన చేశారు. ఈ కార్యక్రమంలో గురుస్వాములు వసంత్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

టిడ్కో ఇళ్ల నిర్మాణానికి 100 ఎకరాల స్థల సేకరణ

పొదలకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పేదల సొంతింటి కలను నిజం చేయాలనే ప్రభుత్వ లక్ష్యంలో భాగంగా ఏపీ టౌన్ షిప్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీ టిడ్కో) మండలంలోని మొగళ్లూరు గ్రామంలోని ఎల్‌పీఎం నెంబరు 945 (పాత సర్వే నెంబరు 268)లోని ప్రభుత్వ భూమిని 100 ఎకరాలను తీసుకోవడానికి మంత్రివర్గం ఆమోదించింది.

CRIME NEWS

నెల్లూరు రూరల్లో ముగ్గురి మృతి

● ఈతకెళ్లి ఒకరు, గడ్డి మందు తాగి మరొకరు,

● పవర్ ప్లాంటులో వృద్ధుడు..



నీట మునిగి మృతిచెందిన షాకీర్

నెల్లూరు రూరల్లో, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నెల్లూరు రూరల్లోని వివిధ ప్రాంతాల్లో ముగ్గురు మృతి చెందారు. రూరల్ సీఐ గుంజి వేణు తెలిపిన వివరాలు మేరకు.. షేక్ షాకీర్ (15) వైఎస్ఆర్ నగర్‌కు చెందిన నలుగురు స్నేహితులతో కలిసి ఆదివారం కొండ్లపూడి పంచాయతీ టిడ్కో గృహ సముదాయం వద్ద ఉన్న చెరువులో ఈతకు వెళ్లారు. ప్రమాదవ శాత్తు షాకీర్ నీట మునగడంతో మిగిలిన వారు ఒడ్డుకు వచ్చేయగా ఇతను మాత్రం రాలేదు. దీంతో అతని తల్లిదండ్రులు తొలత కనపడటం లేదని ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా సోమవారం ఆ బాలుడు చెరువులో శవమైన తేలాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **గడ్డి మందు తాగి..**

భార్యాభర్తల మధ్య నెలకొన్న మనస్పర్థల కారణంగా కోడూరుపాడులోని కల్తీ కాలనీకి చెందిన వానపల్లి అమర్‌బాబు(29) ఆదివారం సాయంత్రం సమీపంలోని లేఅవుట్ ప్లాట్లలో గడ్డి మందుతాగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. అక్కడ క్రికెట్ ఆడుతున్న కొందరు గమనించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. అతనిని వైద్యం కోసం నెల్లూరులోని ఓ ఆసుపత్రిలో చేర్పించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. అతని తండ్రి గోపి ఇచ్చిన ఫిర్యాదుతో ఓలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● **ఎస్ఎల్వీ పవర్ ప్లాంటులోకి దూకి...**

కోడూరుపాడు వద్దనున్న మూతపడిన ఎస్ఎల్వీ పవర్ ప్లాంటులో అనుమానాస్పద స్థితి అదే ప్రాంతం మార్కెండేయ కాలనీకి చెందిన పాకం వెంకటరమణయ్య(65) మృతి చెందాడు. ఈయన ఆదివారం సుబ్బారెడ్డి అనే వ్యక్తితో కలిసి ప్లాంటులోకి వెళ్లగా అక్కడ కుక్కలు మెరగడంతో సుబ్బారెడ్డి గోడ దూకి బయటకు వచ్చేయగా వెంకటరమణయ్య మాత్రం అక్కడే ఉండిపోయాడని సీఐ తెలిపారు. సోమవారం ఉదయం చూడగా ఆయన అక్కడ మరణించి ఉన్నాడని, ఇందుకు కారణం తెలియదని చెప్పారు. మృతుడి భార్య పద్మమ్మ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గండిపాళెంలో గుర్తుతెలియని యువకుడి హల్‌చల్

● గ్రామస్థుల బెంబేలు



బ్యాంకులో రికార్డులను చెల్లాచెదురు చేసిన గుర్తు తెలియని యువకుడు

ఉదయగిరి రూరల్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెంలో గుర్తు తెలియని యువకుడు సోమవారం హల్‌చల్ చేయడంతో గ్రామస్థులు బెంబేలెత్తిపోయారు. తొలుత బస్టాండ్ సెంటర్‌లోని సెల్ దుకాణంలో ఓ సెల్‌ఫోన్ తీసుకొని వెళుతుండడంతో గమనించిన యజమాని గట్టిగా మందలించడంతో తిరిగి ఇచ్చేశాడు. మరో దుకాణం ఎదుట మోటారు బైకులో ఉన్న మద్యంసీసా, వాటర్ ప్యాకెట్‌ను తీసుకొని పరారయ్యాడు. అక్కడి నుంచి జలాశయానికి వెళ్లే మార్గంలోని అంకాళమ్మ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన నగదును తీసుకొని సమీపంలో ఉన్న గేదెల ఫారంలో సామగ్రి ఉండే గదిలోకి వెళ్లి గాలిస్తుండగా గమనించిన రైతు కేకలు వేయడంతో ఎదురు దాడికి దిగాడు. దీంతో ఆ యువకుడిని బస్టాండ్ సెంటర్‌కు తీసుకొచ్చి వదిలి వెళ్లాడు. అనంతరం బ్యాంకులో ప్రజలు రద్దీగా ఉన్న సమయంలో వెళ్లి కేకలు వేయడంతో అక్కడ ఉన్న సిబ్బంది, ఖాతాదారులు భయాందోళనకు గురయ్యారు. ఎలాగోలా నానా తిప్పలు పడి బయటకు పంపివేశారు. అయినప్పటికీ వెనుకవైపు పాత రికార్డులు భద్రపరిచిన ప్రాంతానికి వెళ్లి వాటిని చించి చిందర వందరగా పడేయడంతో పాటు అక్కడే నేలపై కూర్చొని బీభత్సం సృష్టించాడు. పొంతన లేని సమాధానం చెబుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తుండడంతో ఎక్కడ నుంచి వచ్చాడో తెలుసుకోవడం ప్రజలకు కష్టంగా మారింది. ఇలాంటి తరుణంలో కొంతమంది 100కు సమాచారం అందించారు. దీంతో గ్రామానికి చేరుకొన్న పోలీసు సిబ్బంది ఆ యువకుడిని అదుపులోకి తీసుకొని వెళ్లిపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

వేధింపులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వివాహితను వేధిస్తున్న భర్త, అత్తింటివారిపై చిన్నబజారు పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు.. రాజీవ్‌గృహకల్ప సముదాయంలో వాణి కుటుంబం నివాసం ఉంటోంది. భర్త మల్లికార్జున, అత్తింటి వారు ఆమెను దుర్భాష లాడుతూ, వేధింపులకు గురిచేస్తూ రెండేళ్ల క్రితం ఇంటి నుంచి గెంటేశారు. అప్పటినుంచి ఆమె తన కుమారుడితో కలిపి ఉంటోంది. అయినా భర్త తరచూ ఆమెను అసభ్య పదజాలంతో దూషిస్తూ వేధింపులకు గురిచేస్తున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మందుబాబులకు అడ్డాగా ఆర్టీసీ బస్టాండు

● ప్రయాణికుల అవస్థలు



ఆర్టీసీ రోడ్డులోని బెల్ట్ షాపులు

వింజమూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ఆర్టీసీ రోడ్డు ఆర్టీసీ బస్టాండు మందు బాబులకు అడ్డాగా మారింది. ఈ రోడ్డులో బ్రాందీ షాపు, సినిమా హాలు, ఆర్టీసీ బస్టాండు ఉన్నందు వలన ప్రయాణికులు, సినీ ప్రేక్షకుల తాకిడి ఎక్కువగా ఉంటుంది. బ్రాందీ షాప్ పక్కన బెల్ట్‌షాప్ ఏర్పాటు చేసుకుని ఉదయం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు మద్యం అమ్మకాలు విచ్చలవిడిగా నిర్వహిస్తున్నారు. వారు రోడ్డు మీదే మద్యం సేవిస్తూ రోడ్డుపైనే మూత్ర విసర్జన చేస్తున్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్నపిల్లలు భయభ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం జన సంచారం ఉన్న ఈ రోడ్డుమీద మద్యం షాపును వెంటనే తొలగించాలని ఇతర షాపు యజమానులు కోరుతున్నారు. దీని వలన మద్యం బెల్టుషాపులు ఏర్పాటు చేసుకుని విచ్చలవిడిగా అమ్ముతూ ఇబ్బంది పెడుతున్నారని షాప్ యజమానులు తెలిపారు. ముఖ్యంగా అసాంఘిక శక్తులను అరికట్టేందుకు పోలీసు వారు కానీ ఎక్సైజ్ వారు కానీ చర్యలు తీసుకోవడంలేదని, ఇలా చేయడం వలన మా వ్యాపారాలకు కూడా ఇబ్బంది కలుగుతుందని షాపు యజమానులు తెలిపారు. వెంటనే ఈ బ్రాందీ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	120
స్కిన్ చికెన్	230
స్కిన్‌లెస్	254

కోడిగుడ్ల ధర (100): 585

రాయితీపై యూరియా పంపిణీ

కొండాపురం, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుఎర్రబల్లి రైతుసేవా కేంద్రంలో సోమవారం రాయితీపై యూరియాను రైతులకు పంపిణీ చేశారు. సచివాలయ పరిధిలోని రైతులకు 400 యూరియా బస్తాలను ప్రజాప్రతినిధులు, సచివాలయ అధికారులు అందజేశారు. టీడీపీ నాయకుడు వేముల బాలక్రిష్ణ మాట్లాడుతూ రైతుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఈ కార్యక్రమంలో గరిమెనపెంట సొసైటీ డైరెక్టర్ వెలుగోటి కొండయ్య, టీడీపీ నాయకులు చెన్నుబోయిన నరసింహారావు, నాగిరెడ్డి, చేబ్రోలు వినయ్‌కుమార్, మోదేపల్లి శ్రీకాంత్, మండవ హరీష్, నాయుడమ్మ తదితరులు పాల్గొన్నారు.


యూరియా అందచేస్తున్న టీడీపీ నాయకులు, సచివాలయ సిబ్బంది

13 నుంచి పచ్చదనం, పరిశుభ్రతపై శిక్షణ

వలేటివారిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 13 నుంచి 15 వరకు పచ్చదనం - పరిశుభ్రతపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శంకర్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 13న పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఉప సర్పంచులకు, 14న ఎంఆర్‌సిలు, గ్రీన్‌అబాసిడర్లు, గ్రీన్‌గార్డ్స్‌కు, 15న వీఓఏలకు, డ్వాక్రా సభ్యులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

విలేకరిపై దాడి అన్యాయం

బిట్రగుంట, (ఆంధ్రజ్యోతి): సీసీ రోడ్డు పనులు నాసిరకంగా ఉన్నాయని వార్త రాసిన విలేకరిపై దాడి చేయడం అన్యాయమని మండల సీనియర్ సీపీఎం నాయకుడు తుమ్మల వెంకయ్య, మండల సీఐటీయు అధ్యక్షులు చల్లా నరహరి, మండల ఉపాధ్యక్షుడు షేక్ బాదుల్లా, కార్యదర్శి అన్వర్ బాషా తదితరులు మాట్లాడుతూ అన్నారు.

హైలెవల్ వంతెన నిర్మించండి సారూ..

ఉప్పుటేరుపై బ్రిడ్జి లేక జనం ఇక్కట్లు

లింగసముద్రం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కందుకూరు, లింగసముద్రం, కావలి ప్రాంతాలకు అనుసంధానంగా ఉన్న మండలంలోని పెదపవని సమీపంలోని ఉప్పుటేరుపై హైలెవల్ వంతెన నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఈ ఉప్పుటేరుపై సుమారు 22 సంవత్సరాల క్రితం అధికారులు లోలెవల్ వంతెన నిర్మించారు. అయితే అప్పటి నుండి పలు గ్రామాల ప్రజలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తున్నారు. అయితే భారీ వరదలు వచ్చిన సమయంలో వరద నీరు ఈ వంతెనపై కనీసం నాలుగైదు అడుగుల ఎత్తున ప్రవహిస్తుంది. దీంతో ఈ వంతెనపై రాకపోకలు నిలిచిపోయేవి. ఈ వంతెనకు ఇరువైపులా బస్సులు, కార్లు, ఆటోలు, లారీలు, ద్విచక్ర వాహనాలు నిలిచిపోయేవి. దీంతో పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ వరద నీటి కారణంగా లింగసముద్రం నుండి పెదపవని మీదుగా కావలికి, కందుకూరు నుండి చినపవని మీదుగా కావలికి, అలాగే పెదపవని, ముత్యాలపాడు గ్రామాల నుండి కందుకూరుకు రాకపోకలు రోజుల తరబడి నిలిచి పోయేవి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. కాగా, 2022లో ఈ వంతెనపై వచ్చిన భారీ వరదలకు ఒక ఆటో ఉప్పుటేరులో కొట్టుకొని పోయి ఇద్దరు యువకులు చనిపోయారు. దీంతో వరదలు వచ్చిన సమయంలో ఈ వంతెనపై ఎవరూ రాకుండా పోలీసులు గస్తీ నిర్వహిస్తున్నారు. అయితే పలుమార్లు ప్రజలు ఈ లోలెవల్ వంతెనపై హైలెవల్ వంతెనను నిర్మించాలని ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి హై లెవల్ వంతెన నిర్మాణానికి తగిన చర్యలు తీసుకోవాలని వాహనదారులు, ప్రజలు కోరుతున్నారు.


పెదపవనిలో ఉప్పుటేరుపై నిర్మించిన లోలెవల్ వంతెన

గర్భిణులు, బాలింతలు

వైద్య పరీక్షలు చేయించుకోవాలి

కావలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ డాక్టర్ మహేష్ తెలిపారు. స్థానిక వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్లో సోమవారం డాక్టర్ రామ్‌సెంటర్ విశ్వోదయ, వెంగళరావునగర్ అర్బన్ హెల్త్‌సెంటర్ల ఆధ్వర్యంలో ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ పథకం కింద గర్భిణులు, బాలింతలకు ఉచిత వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ రామ్‌సెంటర్ సౌజన్యంతో ఐరన్, పోలిక్ సిరప్‌లు, క్యాల్షియం విటమిన్ డ్రాప్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో రామ్‌సెంటర్ చైర్మన్ దొడ్ల మనోహర్‌రెడ్డి, డైరెక్టర్ కూనం తాతిరెడ్డి, సామాజిక కార్యకర్త మాలకొండారెడ్డి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ప్రసాద్, హెల్త్ అసిస్టెంట్ రమణయ్య, ఏఎన్‌ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.


మందులు అందజేస్తున్న డాక్టర్ మహేష్, తాతిరెడ్డి తదితరులు

పారిశుధ్య కార్మికులకు వేతనాలు చెల్లించాలి

కావలి, నవంబర ు10 (ఆంధ్రజ్యోతి) కావలి మున్సిపాలిటీలో పని చేస్తున్న రోజువారీ పారిశుధ్య కార్మికులకు పెండింగ్ వేతనాలు చెల్లించాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కోరారు. సోమవారం కావలి ఆర్డీవో ఎం సన్నీ వంశీక్రిష్ణకు వినతిపత్రం అందజేశారు. 2016 నుంచి డైలీవేజస్ కార్మికులుగా పని చేస్తున్నవారికి ఇప్పటికీ వేతనాలు పెంచలేదన్నారు. కనీస వేతనం రోజుకు రూ.597 ఇవ్వాల్సి ఉండగా రూ.350 మాత్రమే ఇస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ కావలి శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎండ్లూరి ఆదినారాయణ, తన్నీరు వెంకటేష్, సీపీఐ నాయకులు ఎం. వెంకటేశ్వర్లు, దమ్ము దర్గాబాబు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం ఇస్తున్న మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు

మొక్కలు నాటితే ప్రాణులను రక్షించినట్లే..!

బిట్రగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటితే ప్రాణికోటిని రక్షించినట్లేనని కోవూరుపల్లి వైద్యుడు రామకృష్ణ, టీడీపీ మండల కన్వీనర్ ఎం నాగేశ్వరరావు పేర్కొన్నారు. బోగోలు మండలం కోవూరుపల్లి పంచాయతీ పోలేరమ్మ ఆలయ ప్రాంగణంలో కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు ఇందుపూరు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతు పర్యావరణ పరిరక్షణతో పాటు అమ్మవారి సన్నిధికి వచ్చే భక్తులు సేదతీరేందుకు అనువుగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టామన్నారు. గ్రామస్తుల సహకారంతో ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామని టీడీపీ సీనియర్ నాయకుడు నాటకరాణి శీనయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బత్తిన నిరంజన్‌రెడ్డి, ఎన్ భాస్కర్, ఇందుపూరు రామోహన్‌రెడ్డి, ఎన్ రంగయ్య తదితరులు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న డాక్టర్ రామకృష్ణ

రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన

గుడ్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాలిపేట ఆర్అండ్ఆర్ కాలనీలో రామాలయ నిర్మాణానికి సోమవారం శంకుస్థాపన జరిగింది. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రామాయపట్నం పోర్టు నిర్మాణం కోసం భూములు ఇచ్చిన ప్రజలకు పునరావాసం కోసం ప్రభుత్వం అన్ని సౌకర్యాలతో కూడిన ఆర్అండ్ఆర్ కాలనీలను నిర్మిస్తోందన్నారు. అందులో భాగంగా సాలిపేట ఎస్టీ కాలనీలో రామాలయ నిర్మాణానికి శంకుస్థాపన చేశామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జనిగర్ల నాగరాజు, నాయకులు చేపల రమణయ్య, అట్ల కోటయ్య, ఆవుల శ్రీను, పోలుగంగు కృష్ణ, గొల్లపోతు హరిప్రసాద్, సుబ్రమణ్యం, గద్దగుంట శ్రీను, రావూరి వేణు, తదితరులు పాల్గొన్నారు.


రామాలయం నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

కందుకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వర్కింగ్ జర్నలిస్టులుగా పనిచేస్తున్న ప్రతిఒక్కరికీ ఇళ్లస్థలాలు కేటాయించాలని కందుకూరు జర్నలిస్టు వెల్ఫేర్ అసోసియేషన్ (కేజేడబ్ల్యూఏ) యూనియన్ నాయకులు సోమవారం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావుకి వినతిప్రతం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. అనంతరం జర్నలిస్టు యూనియన్ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్లస్థలాలు కేటాయిస్తామని పలుమార్లు హామీలు ఇచ్చినప్పటికీ అమలుచేయలేదన్నారు. వినతిపత్రం అందించిన వారిలో కేజేడబ్ల్యూఏ అధ్యక్షుడు యర్రంశెట్టి ఆనంద మోహన్, వర్కింగ్ ప్రెసిడెంట్ గౌడపేరు రాము, ఆర్గనైజింగ్ సెక్రటరీ కృష్ణ, కోశాధికారి కేశవరావు, సభ్యులు ప్రభాకర్, కృష్ణమోహన్, శ్రీకాంత్, మాధవరావు తదితరులు ఉన్నారు.

రైతాంగానికి చేయూతనివ్వండి : కిసాన్ మోర్చా

కావలి (టౌన్) నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతాంగానికి చేయూతనందించాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల మురళీకృష్ణ నాయుడు కోరారు. జనతా వారధి కార్యక్రమంలో భాగంగా సోమవారం బీజేపీ నాయకులు ఆర్డీవో వంశీకృష్ణకు సమస్యలపై వినతిపత్రం అందించారు. రైతాంగానికి యూరియా, విత్తనాలు, పశువుల దాణా సరఫరా చేయాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు జాతీయ రహదారులు గ్రామీణ ప్రాంత రోడ్లపై ఏర్పడిన గుంతలను పూడ్చించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టెలికం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు కె బ్రహ్మానందం, నేతలు మంద కిరణ్, పరుసు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.


ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నేతలు

'తల్లికి వందనం' అందించండి !

బిట్రగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తల్లికి వందనం పథకం అర్హులైన తమ కుటుంబాలకు అందలేదని పిల్లల తండ్రులు ఆవేదన వ్యక్తం చేశారు. బోగోలు మండల ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు సోమవారం బొందునాగేంద్ర, రవికుమార్, టైలర్ మధు, శ్రీనివాసులు వినతి పత్రం అందజేశారు. దినకూలీ చేసుకుంటూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చదివించుకుంటున్నామని, ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలన్నారు.


ఎంపీడీవోకి వినతిపత్రం అందచేస్తున్న బాధితులు

ప్రమాదాలు జరగకుండా క్రాస్‌రోడ్డు మూసివేత

బిట్రగుంట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలం ముంగమూరు జాతీయ రహదారి కూడలి క్రాస్ రోడ్డును కావలి రూరల్ సీఐ పాపారావు, స్థానిక ఎస్ఐ ప్రభాకర్, ఎన్‌హెచ్ 5 సిబ్బంది సోమవారం మూసివేశారు. ఈ సందర్భంగా సీఐ పాపారావు మాట్లాడుతూ కొండబిట్రగుంట, ముంగమూరు, ఇతర ప్రాంతాలకు చెందిన పలువురు రోడ్డు క్రాస్ చేస్తుండగా మృతి చెందారన్నారు. సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మాల్యాద్రి అనే వ్యక్తి మృతి చెందడానికి కారణం రోడ్డు క్రాస్ చేయడమేనన్నారు. ప్రమాదాలను నివారించేందుకే క్రాస్ రోడ్డు మూసివేశామన్నారు. సమీపంలోని కడనూతల గ్రామంలో ఫ్లైఓవర్ బ్రిడ్జి ద్వారా సర్వీస్ రోడ్లు ఉన్నాయని, ఆ మార్గంలో వెళ్లాలని పోలీసులు సూచించారు.


రోడ్డును మూసేస్తున్న పోలీసులు

గిరిజన కాలనీకి నీరు సరఫరా చేయాలి

కావలి (టౌన్) నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గిరిజన కాలనీకి నీరు సరఫరా చేయాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పి పెంచలయ్య డిమాండ్ చేశారు. 17వ వార్డుకు చెందిన గిరిజన కాలనీ వాసులు సీపీఎం నాయకులతో కలిసి సోమవారం మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలని ధర్నా నిర్వహించారు. పదేళ్ళనుంచి 100 కుటుంబాలకు పైగా గిరిజనులు నివాసముంటున్నారని, నేటికీ నీటి సరఫరా లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ ఉపాధ్యక్షుడు మధుసూధన్‌రావు, ప్రజా సంఘాల నాయకులు ఎస్ మధు, చలంచర్ల లక్ష్మయ్య, సుశీల తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న గిరిజనులు

ఇండియన్ రెడ్‌క్రాస్ సేవలు అద్వితీయం

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఇండియన్ రెడ్‌క్రాస్ నెల్లూరు శాఖ సేవలు అద్వితీయమని సెయిల్ ఎనర్జీ ఇండియా లిమిటెడ్ కంపెనీ చైర్మన్ తారెక్ మహమ్మద్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని రెడ్‌క్రాస్ రక్తనిధి కేంద్రానికి రక్త భాగాల విభజన యంత్రాన్ని అందచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెడ్‌క్రాస్‌లో అందిస్తున్న సేవలకు అనుగుణంగా రక్తభాగాల విభజన యంత్రం (రిఫ్రిజిరేటర్ సర్ఫిప్యూజ్ మిషన్‌ను) అందజేశామని వెల్లడించారు. భవిష్యత్తులో మరింత సహకారం అందచేస్తామని తెలిపారు. తలసీమియా ప్రాజెక్టు సభ్యులు డాక్టర్ సీత, బ్లడ్‌బ్యాంకు చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ యశోవర్ధన్‌లు రెడ్‌క్రాస్ ప్రాజెక్టుల గురించి కంపెనీ ప్రతినిధులకు వివరించారు. ఈ కార్యక్రమంలో సెయిల్ కంపెనీ ప్రతినిధులు నదియా, అల్‌బటాషీ, ఎరచ్ కూపర్, షేర్ల కూపర్, మహాపాత్ర, రెడ్‌క్రాస్ చైర్మన్ విజయకుమార్‌రెడ్డి, వైస్ చైర్మన్ సీహెచ్. జనార్దన్‌రాజు పాల్గొన్నారు.


పరికరం అందజేస్తున్న సెయిల్ కంపెనీ ప్రతినిధులు, రెడ్‌క్రాస్ నిర్వాహకులు

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు

నెల్లూరు(విద్య), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఈనెల 14, 15వ తేదీల్లో జరిగే రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు జిల్లా క్రీడాకారులు ఎంపికయ్యారని జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి పీ.అఖిల్ తెలిపారు. నాయుడుపేటలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫంక్షన్ హాలులో జరిగిన జిల్లాస్థాయి తైక్వాండో పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి 20 బంగారు, 3 వెండి, 3 కాంస్య పతకాలతో రాష్ట్రస్థాయికి అర్హత సాధించారన్నారు. విజేతలకు నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ బహుమతులు అందచేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు మనీషా, ఉపాధ్యక్షుడు ముఖేష్, కోశాధికారి శ్రీకాంత్, తైక్వాండో క్లబ్ నిర్వాహకుడు పవన్‌కుమార్ పాల్గొన్నారు.

జామాయిల్ సాగుపై రైతుల మొగ్గు

వీవీ పాలెం మండలంలో గణనీయంగా పెరగనున్న తోటలు


వలేటివారిపాలెంలో సాగులో ఉన్న జామాయిల్

వలేటివారిపాలెం, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఈ ఏడాది రైతులు జామాయిల్ సాగుపై మొగ్గుచూపుతున్నారు. దీంతో మండలంలో జామాయిల్ గణనీయంగా పెరగనుంది. గత రెండేళ్ల నుండి జామాయిల్ ధర టన్ను రూ. 8 వేలకు పెరగడమే సాగుకు ప్రధాన కారణంగా చెబుతున్నారు. దీంతో జామాయిల్ నారుకు మంచి డిమాండ్ పెరిగింది. వాణిజ్య పంట మిర్చి సాగు ఈ ఏడాది పూర్తిగా తగ్గిపోయింది. గత రెండేళ్ల నుండి మిర్చి రైతులను తెగుళ్ల వెంటాడడం, వాతావరణం అనుకూలంగా లేకపోడంతో మిర్చి దిగుబడులు తగ్గిపోడం, దీనికి తోడు మిర్చి ధరలు లేకపోవడతో గత రెండేళ్లుగా మిర్చి సాగుచేసిన రైతులు తీవ్ర నష్టాల్లో కూరుకుపోయారు. దీంతో మిర్చి సాగు పూర్తిగా తగ్గిపోయింది. అంతేగాకుండా పొగాకు రైతులకు ఈ ఏడాది పెరిగిన ఖర్చులు, తగ్గిన నాణ్యమైన దిగుబడులు, ధరలు ఆశాజనకంగా లేకపోవడంతో పొగాకు రైతులు కూడా ఈ ఏడాది నష్టాలను మూటగట్టుకున్నారు. వాణిజ్య పంటల సాగుతో పెరిగిన పెట్టుబడులు, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోతున్న రైతులు ఈ ఏడాది జామాయిల్ సాగుపై దృష్టి సారించారు. వలేటివారిపాలెం మడలంలో ఈ ఏడాది సుమారుగా 10 వేల ఎకరాలలో జామాయిల్ సాగు చేపట్టినట్లు తెలుస్తోంది. శనగ, పొగాకు, మిర్చి పంటలు పండే నల్లరేగడి భూముల్లో సైతం జామాయిల్ సాగు చేస్తున్నారు. అంతేగాకుండా సాగునీటి చెరువుల కింద మాగాణి భూముల్లో కూడా జామాయిల్ సాగు చేస్తున్నారు. అంతేగాకుండా జామాయిల్ నాటిన మూడేళ్లకే జామాయిల్ కర్ర కొట్టుడుకు వస్తుంది. సారవంతమైన నల్లరేగడి భూములు కలిగి, నీటి వసతి ఉంటే రెండున్నరేళ్లకే జామాయిల్ కటింగ్‌కు వస్తుంది. దీంతో పెట్టుబడులతో పాటు లాభాలు కూడా బాగానే వస్తాయి. జామాయిల్ మొక్క నాటిన మొదటి ఏడాది పెట్టుబడి ఎక్కువ పెట్టాల్సి వస్తుంది. రెండు, మూడు విడతలలో అంతగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం లేదు.

● కొద్దిపాటి వర్షం కురిసినా...

వర్షాకాలంలో జామాయిల్ మొక్కలు నాటుతారు. ఓ మోస్తరు వర్షం కురిస్తే మొక్క బతుకుతుంది. మూడు నాలుగు నెలల్లో ఆ మొక్కలు ఐదారు అడుగుల ఎత్తు పెరుగుతాయి. జామాయిల్ సాగుకు అడవి జంతువుల బెడద ఉండదు. ఒక్కసారి జామాయిల్ సాగు చేసి వదిలేస్తే పదేళ్ల వరకూ పంట వస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులు జామాయిల్ సాగుకు ఆసక్తి చూపుతున్నారు.

ఇళ్ల పట్టాలు ఇవ్వాలి

నెల్లూరు(వైద్యం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): నగరంలోని డ్రైవర్స్ కాలనీ వాసులకు ఇళ స్థలం పట్టాలు ఇవ్వాలని డిప్యూటీ మేయర్, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు మాదాల వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన చేపట్టారు. అనంతరం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ హిమాన్షు శుక్లాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాదాలతోపాటు సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్ మాట్లాడారు.

రబీ సాగుకు రైతుల సన్నద్ధం

● సన్నాలపై ఆసక్తి ● పెరుగుతున్న వ్యయం ● అయినా రైతుల్లో తగ్గని ఆశలు

అల్లూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రబీ సీజన్ సాగుకు రైతన్నలు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే విత్తనాలను సేకరించుకొని నారుమళ్లు పోశారు. మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు ఐఏబీ సమావేశం నిర్వహించాక, రైతుల్లో ఉత్సాహం మరింత పెరిగింది. పెన్నార్ డెల్టా ఆయకట్టు పరిధిలో 7.30 లక్షల ఎకరాల్లో వరిసాగు చేపట్టేలా సాగునీటిని విడుదల చేస్తామని ప్రకటించారు.

● సన్నాలపై ఆసక్తి

కొన్నేళ్లుగా రైతులు సన్నాల రకాలపైనే ఎక్కువ ఆధారపడి సాగు చేపడుతున్నారు. వీటిలో అధికంగా బీపీటీలు, కెఎన్ఎం, ఎన్ఎల్ఆర్ రకాలపై రైతులు ఆసక్తి కనపరుస్తున్నారు. మార్కెట్లో విక్రయించేందుకు వెసులుబాటుగా ఈ రకాలను ఎంపిక చేసుకొని సాగు చేపట్టేందుకు ముందుకు వచ్చారు. సాగు చేపట్టేందుకు కూడా అనుకూల వాతావరణం కావడంతో వీటిపై రైతులు దృష్టి సారించారు.

● సాగు వ్యయం అధికం : వరి సాగు చేపట్టాలంటే ఎకరానికి రైతు రూ.40 వేల వరకు వ్యయం అవుతోంది. కష్టపడి పనిచేసే రైతుకు రూ.5 వేలు తగ్గుతాయే తప్ప మిగతా ఖర్చు మొత్తం ఒకేలా ఉంటుంది. దుక్కి దున్నాలంటే ఎకరానికి దాదాపుగా రూ.4 వేలు, నారుమడికి రూ.2500, మరమ్మతులకు రూ.1000, నాట్లుకు రూ.6 వేలు, ఎరువుల యాజమాన్యానికి రూ.8 వేలు, కలుపులకు రూ.3500, పురుగు మందులకు రూ.8 వేలు, కూలీలు రూ. 8 వేలు, వరికోత యంత్రానికి రూ. 2500 వ్యయం అవుతోంది. వీటిల్లో స్వయంగా వ్యవసాయం చేసుకునే రైతుకు రూ.8 వేలు కూలీలు మినహాయిస్తే మిగిలినవన్నీ వ్యయంగా భరించాల్సిందే.


నాట్లకు సిద్ధంగా ఉన్న నారుమడి

● రైతుకు మిగిలేదేంటి..?

ఇలా ఎకరానికి రూ.40 వేల పైచిలుకు వ్యయం అవుతుంటే ఎకరానికి 4 పుట్లు ధాన్యం దిగుబడి అయితే కొంతమేర మిగులుతుంది. పుట్టి ధర డిమాండ్‌ను బట్టి రూ.17 వేలు ఉంటే ఎకరానికి రూ.68 వేలు రాబడి ఉంటుంది. ఇందులో రూ.40 వేలు నుంచి రూ.45 వేలు వ్యయం పోను రైతుకు మిగిలేది రూ.20 నుంచి రూ.25 వేలు మాత్రమే. ధాన్యం ధర బాగా ఉంటే రైతులకు తమ కష్టం పోను కొంత వరకు లాభాలు వస్తాయి.

వ్యయమైనా.. సాగు తప్ప మరేమీ చేయలేం !



ఏటేటా వ్యయం పెరిగిపోతున్నా వరి సాగుపై ఆధారపడి జీవించడం తప్ప ఇతర పనులేమీ చేయలేం. వ్యవసాయం ఖర్చుతో కూడుకున్నది అయిపోతున్నా, ఏదోక రోజు మా రాతలు మారుతాయని ఆశపడుతున్నాం.

- పప్పు సుధాకర్, రైతు, అల్లూరు

పూర్తిస్థాయిలో సహకారం అందిస్తేనే..



చిన్నతనం నుంచి వ్యవసాయం పైనే ఆధారపడి జీవిస్తున్నాం. ఇప్పటివరకు ఎలాంటి ఎదుగుదల లేదు. రైతులకు పూర్తిస్థాయి సహకారం అందించి ఎరువులు, పురుగు మందుల ధరలు తగ్గి, ధాన్యం ధరలు పెరిగితే కానీ రైతులు బాగుపడే మార్గం కనపడడంలేదు.

- దానం రజిని, రైతు, ఇస్కపల్లి, అల్లూరు

మెలకువలు పాటిస్తేనే ఆదాయం



రైతులు అవగాహన లేక అధిక వ్యయాన్ని భరిస్తున్నారు. అవసరం లేకున్నా వినియోగించే ఎరువులు, పురుగు మందుల కారణంగానే నష్టపోతున్నారు. విచ్చలవిడిగా వినియోగించే వీటి వల్ల దుష్ప్రభావాలు అధికమవుతున్నాయి. మెలకువలు పాటించి అవసరమైన మేరకు ఎరువులు వినియోగిస్తేనే రైతులకు ఆదాయం చేకూరుతుంది.

- వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి, అల్లూరు

ఒడిశా టూ శివకాశి

- తిరుపతిమీదుగా గంజాయి అక్రమ రవాణా
- ఒకరి అరెస్టు, 32 కిలోలు స్వాధీనం



సీజ్ చేసిన గంజాయిని పరిశీలిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఒడిశా నుంచి తిరుపతి మీదుగా తమిళనాడుకు తరలిస్తున్న 32 కిలోల గంజాయిని చంద్రగిరి పోలీసులు పట్టుకున్నారు. నిందితుడు పొన్నుస్వామి సెల్వరాజ్‌ను అరెస్టు చేశారు. ఈ వివరాలను సోమవారం ఎస్పీ సుబ్బరాయుడు మీడియాకు వివరించారు. ఆయన తెలిపిన ప్రకారం.. తమిళనాడు రాష్ట్రం శివగంగై జిల్లా కలనివాసల్‌కు చెందిన పొన్నుస్వామి శెల్వరాజ్ ఒడిశాలో కొంతకాలం చదువుకున్నాడు. ఆ సమయంలో అతడికి గంజాయి స్మగ్లర్లతో సంబంధాలు ఏర్పడ్డాయి. సులభ సంపాదన కోసం ఇతరుల ప్రోద్బలంతో వాహనం తీసుకుని ఒడిశా వెళ్లాడు. తనకు సంబంధాలున్న స్మగ్లర్లను కలిశాడు. పోలీసులకు కనిపించకుండా ఉండేలా వాహనంలోని డాష్ బోర్డు, గేర్ బాక్సు, టైర్ స్టెప్ భాగంలో గంజాయి ఉంచుకుని బయలుదేరాడు. ఎస్పీకి అందిన సమాచారం మేరకు తిరుపతి- నాయుడుపేట జాతీయ రహదారి తువ్వచేనుపల్లి వద్ద చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, సీఐ సురేష్‌కుమార్, పాకాల సీఐ సుదర్శన్‌కుమార్, ఆర్‌సీపురం ఎస్ఐ భక్తవత్సలం, చంద్రగిరి ఎస్ఐ అనిత, సిబ్బంది కలసి వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో వీరి వాహనంలో దాచి వుంచిన దాదాపు రూ.6 లక్షల విలువైన 32.730 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. గంజాయి తీసుకెళుతున్న తమిళనాడుకు చెందిన పొన్నుస్వామి శెల్వరాజ్‌ను అరెస్టు చేశారు. అతడి నుంచి రెండు మొబైల్ ఫోన్లు సీజ్ చేసినట్లు ఎస్పీ సుబ్బరాయుడు తెలిపారు. ఎక్కడైనా మత్తు పదార్థాలు రవాణా చేసినా, వినియోగిస్తున్న వారి వివరాలు అందించాలని, వారి పేర్లు గోప్యంగా వుంచుతామని ఎస్పీ చెప్పారు. ఎర్రచందనం కేసుల్లో ఇటీవల నిందితులకు 80 శాతం వరకు కఠినంగా శిక్షలు పడుతుండడం అభినందనీయమన్నారు.

4 పరిశ్రమలు.. రూ.3,972 కోట్లు

శ్రీసిటీ, నాయుడుపేటలో ఏర్పాటుకు అనుమతి

మరిన్ని ప్రతిపాదనలనూ ఆమోదించిన మంత్రిమండలి

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలో రూ.1,629 కోట్లు, నాయుడుపేటలో రూ.2,343 కోట్ల చెప్పున రూ.3,972 కోట్లతో నాలుగు పరిశ్రమల ఏర్పాటుకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఈ మేరకు సోమవారం వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో జిల్లాకు సంబంధించి పలు ప్రతిపాదనలను ఆమోదించారు. శ్రీసిటీలో రూ.550 కోట్ల పెట్టుబడితో 1130 ఉద్యోగాలు కల్పించేందుకు మెస్సర్స్ ఎస్‌సీఐసీ వెంచర్స్ ఎల్ఎల్‌పీ సంస్థ ముందుకొచ్చింది. పీసీడీఏ మానుఫ్యాక్చరింగ్, బీఎల్‌డీసీ మోటార్స్, కాపర్ ట్యూబ్స్ మాన్యుఫ్యాకరింగ్ ఫెసిలిటీ ఏర్పాటుకు ఈ సంస్థ చేసిన ప్రతిపాదనలను మంత్రి మండలి ఆమోదించింది. పారిశ్రామిక విధానంకింద అవసరమైన రాయితీలు, మినహాయింపులు ఇవ్వడానికి అంగీకరించింది. అలాగే రూ.1079 కోట్లతో 1500మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామంటూ మెస్సర్స్ క్రియాన్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆసక్తి చూపింది. ఐటీ ఎన్‌క్లోజర్స్, పీసీబీ బేర్ బోర్డ్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ఏర్పాటుకు ప్రతిపాదించగా మంత్రిమండలి ఆమోదించింది.

నాయుడుపేటలో రూ.2343 కోట్లతో..

నాయుడుపేటలో సోలార్ పవర్ కేటగిరీలో మెస్సర్స్ వోల్టసన్ ల్యాబ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ. 1748 కోట్ల పెట్టుబడితో 4 గిగావాట్స్ సోలార్ సెల్ అండ్ మాడ్యూల్ తయారీ ప్లాంట్ ఏర్పాటుకు ముందుకు వచ్చింది. 415 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ప్రతిపాదించింది. ఈ సంస్థకు 40 ఎకరాలు కేటాయించేందుకు మంత్రి మండలి అంగీకరించింది. నాయుడుపేట ఇండస్ట్రియల్ పార్కులో మెస్సర్స్ గ్రీన్ లామ్ సౌత్ లిమిటెడ్ రూ. 595 కోట్ల పెట్టుబడితో పార్టికల్ బోర్డ్ అండ్ లామినేట్ యూనిట్ నెలకొల్పేందుకు ప్రతిపాదించింది. రోజుకు 650 సీబీఎంసామర్థ్యంతో ఉత్పత్తిచేస్తామని, తద్వారా 850మందికి ఉద్యోగావకాశాలుకల్పిస్తామని ప్రతిపాదించగా మంత్రిమండలి అనుమతిచ్చింది.

ఎపిటోమ్ సంస్థకు 19 ఎకరాలు

నాయుడుపేట ఎంపీఎస్ఈజెడ్‌లో మెస్సర్స్ ఎపిటోమ్ కాంపొనెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ పీసీడీలు, అనుబంధ ఎలక్ట్రానిక్ కాంపొనెంట్స్ మాన్యుఫాక్చరింగ్ ఫెలిసిటీ ఏర్పాటు చేసేందుకు ముందుకొచ్చింది. ఈ సంస్థకు 19.06 ఎకరాల భూమి కేటాయించేందుకు మంత్రి మండలి ఆమోదించింది.

కోవనూరులో టిడ్కోకు 32.21 ఎకరాలు

కేవీబీపురం మండలం కోవనూరులో పీఎం ఏవై 2.0 పథకం కింద ఎన్టీఆర్ నగర్ పేరిట పేదలకు ఇళ్ళు నిర్మించివ్వడం కోసం టిడ్కోకు 32.21 ఎకరాలను కేటాయించేందుకు మంత్రి మండలి అంగీకరించింది. కోవనూరు గ్రామం సర్వే నంబరు 363-1లో 19.27 ఎకరాలు, సర్వే నంబరు 365లో 12.94 ఎకరాలు చొప్పున కేటాయించనున్నారు. ఎకరా రూ.18.55 లక్షల చొప్పున రూ.5.97 కోట్లకు భూములు కేటాయించేలా నిర్ణయించింది. ఆ మొత్తాన్ని టిడ్కో 2025-26 నుంచీ 2029-30 నడుమ ఐదు వాయిదాలలో చెల్లించే వెసులుబాటు కల్పించారు.

తిరుపతిలో టీడీపీ ఆఫీసుకు భూమి కేటాయింపు

తిరుపతిలో టీడీపీ పార్లమెంటు కమిటీ కార్యాలయ భవనం కోసం రెండెకరాల ప్రభుత్వ భూమిని లీజు ప్రాతిపదికన కేటాయించేందుకు మంత్రి మండలి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామం సర్వే నంబరు 495-5లో 1.85 ఎకరాలు, సర్వే నంబరు 495-11లో 15 సెంట్లు చొప్పున మొత్తం రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని తిరుపతి పార్లమెంటు టీడీపీ కమిటీ అధ్యక్షుడి పేరిట 33 ఏళ్ళ పాటు లీజుపై కేటాయించనున్నారు. ఎకరాకు ఏడాదికి రూ.వెయ్యి చొప్పున లీజు చెల్లించే ప్రాతిపదికన భూమి కేటాయించనున్నారు.




శిరసనంబేడులో ఎంఎస్ఎంఈ పార్కు శంకుస్థాపనకు ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

పెళ్లకూరులో ఎంఎస్ఎంఈ పార్కు

- నేడు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న సీఎం
- ప్రత్యక్షంగా పాల్గొననున్న మంత్రి నిమ్మల

పెళ్లకూరు, నవంబరు, 9(ఆంధ్రజ్యోతి): పెళ్లకూరు మండలం శిరసనంబేడు, పాలచ్చూరు పరిధిలో రూ.447 కోట్ల పెట్టుబడులతో మూడు పరిశ్రమలకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం ఉదయం వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ నేరుగా పాల్గొననున్నారు. పరిశ్రమల ఏర్పాటు కోసం 2009లో శిరసనంబేడులో 58.33 ఎకరాలు సేకరించారు. 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం చెన్నప్పనాయుడుపేట, నందిమాల, ఎర్రగుంట గ్రామాల్లో పరిశ్రమల ఏర్పాటుకు భూపరిశీలన చేసింది. స్థానిక రైతులు సహకరించకపోవడంతో పూర్తిస్థాయిలో భూసేకరణ జరగలేదు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక పారిశ్రామికవాడ అభివృద్ధి మరుగున పడింది. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం రావడంతో శిరసనంబేడులో సేకరించిన 58.33 ఎకరాల్లో మొదటి విడతలో 22.42 ఎకరాలు, రెండో విడతలో 35.91 ఎకరాలు అభివృద్ధి చేయనున్నారు. పాలచ్చూరులో రూ.137 కోట్లతో 3ఎక్స్‌పెర్ ఇనోవెంచర్ పరిశ్రమ ప్రారంభోత్సవంతో పాటు రూ.245 కోట్లు దమ్ము బయోఫ్యూయల్ పరిశ్రమకు వర్చువల్ విధానంలో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయనున్నారు.





లక్ష దీపోత్సవం

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న భరద్వాజతీర్థంలో సోమవారం సాయంత్రం లక్ష దీపోత్సవం నిర్వహించారు. భరద్వాజతీర్థం చుట్టూ క్రమపద్ధతితో నేతిదీపాలను సిద్ధం చేశారు. భక్తులు దీపాలు వెలగించారు. నేతి దీపకాంతులతో పుష్కరణి వెలుగులీనింది.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి



కోటి దీపోత్సవం

తిరుపతిలోని రామచంద్ర పుష్కరిణి వద్ద ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం కార్తీక కోటి దీపోత్సవం జరిగింది. కంచి కామకోటి పీఠాధిపతి విజయేంద్ర సరస్వతి హాజరై భక్తులకు ఆశీర్వచనాలు అందించారు. మహిళా భక్తులు దీపాలు వెలిగించారు.

- తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆంధ్రజ్యోతి

కపిలతీర్థం వద్ద..

కార్తీక సోమవారం సందర్భంగా తిరుపతి నగరం కపిలేశ్వరాలయం పక్కనున్న ఉద్యానవనంలో సాయంత్రం భక్తులు దీపాలు వెలిగించారు. కపిలేశ్వరస్వామి దర్శనానికి భక్తులు తరలివచ్చారు.

- తిరుపతి, ఆంధ్రజ్యోతి



శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము
శ్రీకాళహస్తి : తిరుపతి జిల్లా - 517 644

ఈ - ప్రొక్యూర్‌మెంట్ మరియు సీల్డ్ టెండర్ ప్రకటన

ఆర్.సి.నెం. A2/5742/2025 తేది :08-11-2025

శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానము నందు **తేది: 10-02-2026** నుండి **తేది: 23-02-2026** వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవములు-2026 సందర్భముగా అవసరమైన ఏర్పాట్ల నిమిత్తం క్రింద తెలిపిన వివరముల ప్రకారం టెండర్లు ఆహ్వానించడమైనది.

	ఈ - ప్రొక్యూర్‌మెంటు టెండర్లు	EMD	టెండరు తేది
01.	ప్రత్యేక పూల అలంకరణ (తేది:10-02-2026) నుండి తేది: 23-06-2026వరకు 14రోజులు)	రూ.3,00,000/-	Bid downloading start:12-11-2025, End:26-11-2025 Price bid open: 28-11-2025
02.	ఫోటోలు, వీడియోలు కవరేజ్ (తేది:10-02-2026) నుండి తేది: 23-06-2026వరకు 14రోజులు)	రూ.2,00,000/-	-do-
	సీల్డు టెండర్లు	EMD	టెండరు తేది
03.	ఆటో రిక్షా ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్	రూ.5,000/-	షెడ్యూలు దరఖాస్తు చివరి తేది:24-11-2025 షెడ్యూలు జారీ చేయు తేది:27-11-2025, షెడ్యూలు టెండరు బాక్స్‌నందు సమర్పించు తేది: 28-11-2025 ఉ॥10-30 నుంచి మ॥1-00లోపు
04.	కొబ్బరి ఆకు తోరణముల అలంకరణ	రూ.10,000/-	-do-
05.	గొడుగులు, సురిటీలు, కర్టెన్లు మరియు ఇతర అలంకరణ సామాగ్రి సరఫరా	రూ.20,000/-	-do-
06.	మెమెంటోలు సరఫరా	రూ.20,000/-	-do-

ఆసక్తి గల వారు పైతెలిపిన టెండర్లకు సంబంధించి **www.eprocurement.gov.in** వెబ్‌సైట్‌నందు మరియు కార్యాలయపు పని వేళలయందు 96185 15658, 98664 56141, 99894 14040 సంప్రదించవచ్చును.

శ్రీకాళహస్తీశ్వరస్వామి వారి సేవలో.. సం/- **తిప్పారెడ్డి బాపిరెడ్డి,** కార్యనిర్వహణాధికారి



ఎట్టా బతికేదీ?

'నా భర్త చనిపోయి ఒకటిన్నర ఏడాదైంది. పిల్లలు పట్టించుకోవడం లేదు. పింఛను రాలేదు. ఎలా బతికేది' అంటూ సోమవారం పీజీఆర్ఎస్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఎదుట తిరుపతికి చెందిన అంజమ్మ విలపించారు. ఆమెకు వచ్చే నెల నుంచి పింఛను ఇవ్వాలని, రెండు నెలలకు సరిపడే రేషన్ అందించాలని ఆదేశించారు. తన వద్ద ఉన్న రూ.4వేలు అంజమ్మకు ఇచ్చి ఇంటి వద్ద వదిలి రావాలని సిబ్బందిని పంపారు. ఇలా కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌లో పలువురు తమ బాధలు చెప్పుకొంటూ 266 అర్జీలిచ్చారు.

వేదం.. వివాదం

- ప్రారంభమైన వేద పారాయణ ఇంటర్వ్యూలు
- ఆ అబ్జర్వర్‌ను తొలగించాలని టీటీడీకి ఫిర్యాదు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): టీటీడీ చేపట్టిన వేద పారాయణ పోస్టుల ఇంటర్వ్యూల్లో తొలిరోజే వివాదం మొదలైంది. 700 పోస్టులకుగాను తిరుపతిలోని శ్వేతలో సోమవారం మొదలైన ఇంటర్వ్యూలు 16వ తేదీ వరకు జరగనున్నాయి. తొలిరోజునే ఇంటర్వ్యూలలో అకడమిక్ ఎక్స్‌టర్నల్ అబ్జర్వర్‌గా నియమితులైన ప్రొఫెసర్ సుదర్శన్ శర్మపై టీటీడీ చైర్మన్, ఈవో, జేఈవోలతో పాటు పాలకమండలి సభ్యులకు ఫిర్యాదులు వెళ్లాయి. ఆయన ఓవిశ్వవిద్యాలయంలో వైస్‌చాన్సలర్‌గా పనిచేసిన సమయంలో ఆర్థిక అక్రమాలు, పరిపాలనా లోపాలు, అవినీతికి సంబంధించిన అంశాలపై టీటీడీ విజిలెన్స్ నిగ్గుతేల్చిన నివేదికలను, ఆయనపై వచ్చిన ఆరోపణలను ఆధారాలతో సహా పాలక మండలికి పంపారు. ఇలాంటి నేపథ్యం కలిగిన వ్యక్తిని అబ్జర్వర్‌గా నియమించడం అనుచితమని భావిస్తున్నారు. ఉజ్జయిని వేద విద్యా ప్రతిష్ఠ వైస్ చైర్మన్‌గా ఉన్న సమయంలో కూడా పలు అక్రమాల ఆరోపణలను ఆయన ఎదుర్కొన్నారు. ప్రస్తుత ఇంటర్వ్యూలలో కూడా తమిళ - తెలుగు అనే భేదాన్ని ప్రోత్సహిస్తూ, వేదానికి భాషాపరమైన విభేదం ఉన్నట్టుగా చూపించి, బ్రాహ్మణుల్లో ఆందోళన సృష్టించడానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. సుదర్శన్ శర్మను అబ్జర్వర్‌గా తప్పించి, వేద జ్ఞాన ఆధారంగానే ఇంటర్వ్యూలు నిర్వహించాలని కోరుతున్నారు.

అలిపిరి నడకదారిలో అపచారం

- ఉప్పుచేపలు తిన్న పారిశుధ్య కార్మికులు
- విధుల నుంచి తొలగించిన టీటీడీ

తిరుమల, నవంబరు10 (ఆంధ్రజ్యోతి): తిరుమల కాలినడక మార్గంలో పారిశుధ్య కార్మికులు భోజనంలో ఉప్పుచేపలను తింటున్న వీడియో వైరల్ కావడంతో, వారిని టీటీడీ విధుల నుంచి తొలగించింది. ఆదివారం మధ్యాహ్నం అలిపిరి మెట్ల మార్గంలో పారిశుధ్యకార్మికులు కొందరు భోజనాలు చేస్తున్నారు. వారు ఉప్పుచేపలు తింటున్నారని గుర్తించిన కొందరు భక్తులు పవిత్రమైన తిరుమల నడకమార్గంలో ఎలా తింటారంటూ ప్రశ్నిస్తూ దానిని వీడియో తీశారు. ఆ వీడియోను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతో అది వైరల్ అయ్యింది. దీంతో టీటీడీ హెల్త్ విభాగం తిరుపతికి చెందిన రామస్వామి, సరసమ్మ అనే ఔట్‌సోర్సింగ్ పారిశుధ్య ఉద్యోగులను విధులనుంచి తొలగించడంతోపాటూ, తిరుమల 2 టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ సంఘటనపై ఫిర్యాదు చేసింది.

ఢిల్లీలో పేలుడుతో తిరుపతిలో హై అలర్ట్

- జిల్లా అంతటా ముమ్మర తనిఖీలు



తిరుపతి రైల్వే స్టేషన్‌లో తనిఖీలు

తిరుపతి(నేరవిభాగం)/తిరుమల/సూళ్లూరుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): ఢిల్లీలో సోమవారం సాయంత్రం జరిగిన బాంబు పేలుడు ఘటనతో తిరుపతిలో హై అలర్ట్ ప్రకటించారు. దేశ విదేశాల నుంచి తిరుపతి, తిరుమలకు యాత్రికులు వస్తుండడంతో మరింత అప్రమత్తంగా ఉండాలంటూ సెల్ కాన్ఫరెన్సు ద్వారా పోలీసు యంత్రాంగాన్ని ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. తిరుపతిలో డీఎస్పీ భక్తవత్సలం ఆధ్వర్యంలో సీఐలు శ్రీనివాసులు, మురళీమోహన్, రామయ్య, రాంకిషోర్‌లు, ఎస్ఐలు, సిబ్బంది వాహనాల తనిఖీలు చేశారు. ఈస్ట్ పరిధిలోని దాదాపు 30 మంది, అలిపిరి పరిధిలో మరో 18 మందిని విచారించి ఫింగర్ ప్రింట్‌లు తీసుకున్నారు. అలిపిరి తనిఖీ కేంద్రం వద్ద భద్రతను మరింత కట్టుదిట్టం చేశారు. తిరుమలకు చేరుకున్న ప్రతి వాహనాన్ని నిలిపి లోపల తనిఖీలు చేస్తున్నారు. అనుమానితులను విచారిస్తున్నారు. ఇక, షార్‌లో సీఐఎస్ఎఫ్ సిబ్బంది, మెరైన పోలీసులు, కోస్టల్ గార్డ్‌చే శ్రీహరికోట చుట్టుప్రక్కల ఉన్న అటవీప్రాంతంలో పాటు జలమార్గంలో భద్రతను కట్టుదిట్టం చేశారు సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎస్ఐ బ్రహ్మానాయుడు ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో తనిఖీ చేస్తున్నారు.

ఓఆర్‌ఐకి చేరిన రెండు తాళపత్ర గ్రంథాలు



ఓఆర్‌ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు తాళపత్రాలను అందజేస్తున్న రాఘవేంద్రరావు

తిరుపతి(విశ్వవిద్యాలయాలు), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ ఉద్యోగి రాఘవేంద్రరావు రెండు తాళపత్ర గ్రంథాలను రూపొందించారు. వీటిని ఓఆర్‌ఐ డైరెక్టర్ పీసీ వెంకటేశ్వర్లుకు సోమవారం అందజేశారు. గౌతమి సంహిత అనే జైమిని మహర్షి జ్యోతిష్యానికి వేలూరి సుబ్రమణ్యశాస్త్రి రాసిన వ్యాఖ్యను తాళపత్ర గ్రంథ రూపంలో తెచ్చారు. సింగారాచార్య రాసిన జాతకరాజీయము గ్రంథానికి కొంపెల్ల నరసింహశాస్త్రి చేసిన తెలుగు వ్యాఖ్యానానికి తాళపత్ర గ్రంథ రూపమిచ్చారు. ఈ గ్రంథాన్ని రామవేంద్రరావు ఆంగ్లంలోకి అనువదించి ఓఆర్‌ఐకి అందజేశారు.

కాశింఖాన్‌కండ్రిగ పాఠశాలకు కేంద్ర నిధులు

తడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తడ మండలంలోని కాశీంఖాన్‌కండ్రిగ ప్రాథమిక పాఠశాలకు కేంద్రం నిధులు కేటాయించింది. ప్రధానమంత్రి ఆదర్శ గ్రామయోజన (పీఎంఎజీవై) పథకం ద్వారా రూ.3 లక్షలు ఆ పాఠశాలకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేసింది. పాఠశాలలో మరుగుదొడ్లు, నీటి వసతి, తలుపులు, కిటికీలు, విద్యుత్ సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఖర్చు చేయనున్నట్లు ఎంపీడీవో శేఖర్‌నాయక్, ఎంఈవో మల్లికార్జునరావు పేర్కొన్నారు. ప్రస్తుతం పాఠశాలలో సుమారు 18మంది విద్యార్థులు ఉన్నారని, పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించి విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు చర్యలు చేపడుతామని చెప్పారు.

సర్వ దర్శనానికి 10 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 24 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 5 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.4.75 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 78,217

తలనీలాలు సమర్పించినవారు: 25 వేలు





స్పిరిచ్యువల్ స్ట్రీట్ నమూనా డిజైన్స్

ఇస్కాన్ సమీపంలోనే
స్పిరిచ్యువల్ స్ట్రీట్

స్థల పరిశీలన

త్వరలోనే డిజైన్‌కు తుదిరూపు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో ఆధ్యాత్మిక వీధి (స్పిరిచ్యువల్ స్ట్రీట్) ఏర్పాటు దిశగా మరో అడుగు పడింది. అడుగులు పడుతున్నాయి. ఆర్కిటెక్చర్ డిజైన్ సంస్థ 'పీఎక్స్ మేక్స్' ప్రతినిధులు నగరపాలక సంస్థ కమినర్ మౌర్యకు అధికారులకు దీనిపై మూడు రోజుల కిందట పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. తొలుత ఇస్కాన్ ఎదురు (కంచిమఠం)గా ఉన్న రోడ్డును స్పిరిచ్యువల్ స్ట్రీట్‌గా డిజైన్ చేసి చూపించారు. అక్కడ నివాసాలకు ఇబ్బంది వస్తుందని భావించి మరో రోడ్డును ఎంపిక చేయాలని పీఎక్స్ మేక్స్ ప్రతినిధులకు అధికారులు సూచించడంతో మున్సిపల్ ఇంజనీరింగ్, రెవెన్యూ, టౌన్ ప్లానింగ్ అధికారుల బృందం అనేక రోడ్లను పరిశీలించింది. ఇస్కాన్ రోడ్డులోని కేంద్రీయ విద్యాభవన్ పక్కన మాస్టర్ ప్లాన్ రోడ్డు అన్ని విధాలుగా ఆమోదయోగ్యంగా ఉంటుందని బృందం అభిప్రాయపడింది. అలిపిరి లింక్ బస్టాండుకు ఎదురుగా, ఇస్కాన్ మందిరానికి పక్కనగల రోడ్డులో స్పిరిచ్యువల్ స్ట్రీట్ ఏర్పాటు చేయడం వలన భక్తుల సందర్శనకు అనువుగా ఉంటుందనే అభిప్రాయానికి వచ్చారు. ఆ మేరకు డిజైన్స్ మార్చాలని పీఎక్స్ మేక్స్ ప్రతినిధులకు కమిషనర్ సూచించారు.

వంద షాపులు

ఆధ్యాత్మిక వీధి ప్రారంభంలో ఆర్చిని ఏర్పాటు చేయనున్నారు. భజనలు, వేదమంత్రాలు, నాదస్వర ధ్వనులు, భక్తిపాటలను వినిపించేలా ప్లాన్ రూపొందిస్తున్నారు. తులసి మాలలు మొదలుకుని ధూపదీపాలు, పుస్తకాలు, ఆధ్యాత్మిక కళాఖండాలు అమ్మే షాపులతో పాటు భక్తులకు ప్రసాదాలు, ఆయుర్వేద వస్తువులు, దేవతామూర్తుల చిత్రపటాలు, హస్తకళా వస్తువులు పూజా సామగ్రి.. ఇక్కడ లభిస్తాయి. దాదాపు 100కి పైగా దుకాణాలు ఉండేలా డిజైన్ చేస్తున్నారు.

సమస్యలుంటే అధికారుల దృష్టికి తెండి

ఆత్మహత్య పేరుతో బెదిరిస్తే మంచి పద్ధతికాదు ● అర్జీదారులకు క్లాస్ తీసుకున్న కలెక్టర్ ● పీజీఆర్ఎస్‌కు 266 అర్జీలు

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): 'సమస్యలుంటే అధికారుల దృష్టికి తీసుకురండి. అంతే తప్ప పెట్రోల్‌క్యాన్ తీసుకొచ్చి ఆత్మహత్య చేసుకుంటామంటూ బెదిరింపులకు దిగడ మంచిపద్ధతి కాదు' అంటూ కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. ఇటీవల కొందరు తమ సమస్యలు పరిష్కరించాలంటూ పెట్రోల్, డీజిల్‌వెంట తీసుకొచ్చి కలెక్టరేట్ వద్ద ఆత్మహత్యకు యత్నిస్తామని బెదిరించడం పరిపాటిగా మారింది. ఈ క్రమంలో సోమవారం కూడా ఓకుటుంబం కలెక్టరేట్ వద్ద హల్‌చల్ చేసింది. తొట్టంబేడు మండలం శ్రీకృష్ణాపురానికి చెందిన వీరాస్వామి దంపతులు, అతడి కుమారుడు క్యాన్ నిండా పెట్రోల్ తీసుకువచ్చారు. 'శ్రీకృష్ణాపురంలో మేము 40 ఏళ్లుగా ఐదు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. డీకేటీ పట్టా కూడా ఉంది. బంధువులు వచ్చి మా పేరుతో ఉన్నాయని దౌర్జన్యంగా పొలం దున్నుతున్నారు. దీనిపై మేము కోర్టుకు వెళ్లాం. కోర్టులో కేసు ఉండగా వారు పొలంలోకి వస్తున్నారు' అంటూ తన భార్య అమరావతితో కలిసి వీరాస్వామి నిరసన తెలిపారు. పెట్రోల్ క్యాన్‌తో వీరు రావడాన్ని గుర్తించిన పోలీసులు కలెక్టర్ వద్దకు తీసుకువచ్చారు. దీంతో కలెక్టర్ వెంకటేశ్వర్ అర్జీదారులను సున్నితంగా మందలించారు. 'మీ సమస్య కోర్టు పరిధిలో ఉంది. అయినా మీరు అర్జీ ఇచ్చినపుడు రెండుమూడుసార్లు రెవెన్యూ అధికారులు వచ్చారు. అయితే మీరు మొండిగా పెట్రోల్‌పోసుకుని ఆత్మహత్య చేసుకుంటామని బెదిరించడం సరికాదు. ప్రతి ఒక్కరూ ఇలా బెదిరింపులకు దిగితే ఎలా? ఇలాంటి సంస్కృతిని సహించేది లేదు' అంటూ మందలించారు. తిరుచానూరు ఎస్ఐ అరుణ వారిని స్టేషన్‌కు తీసుకెళ్లి కౌన్సెలింగ్ ఇచ్చారు. పీజీఆర్ఎస్‌కు 266 అర్జీలు అందాయి. అందులో భూసమస్యలపైనే 169 ఉన్నాయి.




అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ - కుటుంబ సభ్యులతో వీరాస్వామి

సమస్యకు పరిష్కారం దొరికింది



నేను గతంలో ఎస్‌జీఎస్ ఆర్ట్స్ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్‌గా పనిచేశా. ఇప్పటి సీఎం చంద్రబాబుకు పాఠాలు ఆనాడు పాఠాలు చెప్పా. ఇటీవల నారావారిపల్లెకు వచ్చినపుడు నా సమస్యను సీఎం దృష్టికి తీసుకెళ్లా. దీనిపై కలెక్టర్‌ను కలవడానికి వచ్చాను. చాలా చక్కగా పలకరించారు. మరో వారం రోజుల్లో సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి సహాయం అందుతుందని తెలిపారు.

- కృష్ణమూర్తి, బైరాగిపట్టెడ

పింఛను ఇచ్చి ఆదుకోండి



ప్రసూతి సమయంలో అనారోగ్య సమస్యలు తలెత్తాయి. నడవలేని స్థితికి చేరుకున్నాను. వీల్‌ఛైర్ ఉంటే తప్ప బయట ప్రపంచాన్ని చూడలేను. మూడేళ్లుగా ఇబ్బంది పడుతున్నా. పింఛను ఇచ్చి ఆదుకోండి.

- సాలమ్మ, కోటమంగాపురం, కేవీబీపురం మండలం

మూడుచక్రాల స్కూటర్ ఇవ్వండి



వంటమాస్టర్‌గా పనిచేస్తున్న కుటుంబాన్ని పోషించేవాడిని రోడ్డు ప్రమాదంలో కాలు కోల్పోయాను. దీంతో నడిచే పరిస్థితి లేదు. ప్రభుత్వంపింఛను ఇస్తోంది. కుటుంబ ఆర్థిక అవసరాలకు సరిపోవడం లేదు. దివ్యాంగులకు ఇచ్చే మూడు చక్రాల స్కూటర్‌ను ప్రభుత్వం అందజేస్తే యధావిధిగా వంట మాస్టర్ పనికి వెళతాను. దీంతో కుటుంబాన్ని పోషించుకుంటా.

- జయశంకర్, మదనంబేడు, సత్యవేడు

పీజీఆర్ఎస్ ఫిర్యాదులు
పరిష్కరించకుంటే చర్యలు

● అర్జీదారులు మళ్లీ మళ్లీ వస్తే అధికారులను ఉపేక్షించనన్న ఎస్పీ


ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదుదారుల్లేక బోసిపోతున్న కౌంటర్లు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పోలీసు పీజీఆర్ఎ్‌ఎలో వచ్చిన ఫిర్యాదులను తక్షణం పరిష్కరించకుంటే చర్యలు తప్పవని ఎస్పీ సుబ్బరాయుడు హెచ్చరించారు. తిరుపతిలోని జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం జరిగిన పీజీఆర్ఎస్‌కు జిల్లా నలుమూలల నుంచి 70 మంది హాజరై తమ బాధలను అధికారుల ఎదుట మొర పెట్టుకున్నారు. వీటిలో దాదాపు 40 శాతం ఫిర్యాదులను ఇక్కడే పరిష్కరించారు. గతంతో పోలిస్తే ఈసారి అర్జీదారుల సంఖ్య తగ్గింది. దీతో అదనపు ఎస్పీలు, సీఐల కోసం ఏర్పాటు చేసిన కౌంటర్లు బోసిపోయాయి. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ఫిర్యాదు దారులే మళ్లీ మళ్లీ వచ్చి ఇబ్బంది పడుతుంటే.. సంబంధిత అధికారులను ఉపేక్షించేది లేదని ఇటీవల ఎస్పీ హెచ్చరించారు. దీంతో రెండు, మూడు వారాలుగా ఫిర్యాదుల పరిష్కారంలో అధికారులు చొరవ చూపడంతో.. అర్జీదారులు తగ్గారని పోలీసు వర్గాలు చెప్పాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, సీఐలు పాల్గొన్నారు.


మురళీమోహన్ అలియాస్ చిన్నబాబు.. శ్రీపతిబాబు .. ఎస్వీఎం శ్రీధర్.. పెరుమాళ్ మధు.. తోట వాసు.. బీడీ బాలాజీ

6 కార్పొరేషన్లకు 12 మంది డైరెక్టర్లు

తిరుపతి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మరో 10 కార్పొరేషన్లకు సంబంధించి బోర్డు డైరెక్టర్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. వీటిలో తిరుపతి జిల్లాకు సంబంధించి వివిధ కార్పొరేషన్లకుగాను 12మంది కూటమి నాయకులకు అవకాశం కల్పించింది. వీరిలో సూక్ష్మ, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధి బోర్డు డైరెక్టర్‌గా మురళీమోహన్ అలియాస్ చినబాబు (చంద్రగిరి-టీడీపీ), లేబర్ వెల్ఫేర్ బోర్డు డెరెక్టర్‌గా ఆర్.మహేశ్వరి (చంద్రగిరి-టీడీపీ), కాపు వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా టీడీ వరప్రసాద్ (తిరుపతి-బీజేపీ), తోట వాసుదేవ (తిరుపతి-టీడీపీ), ఎస్సీ కమిషన్ సభ్యుడిగా శ్రీపతి బాబు (సూళ్లూరుపేట-టీడీపీ), దాసరి వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా కోల లోకయ్య (సత్యవేడు-టీడీపీ), ప్రేమ్ కుమార్ (తిరుపతి-బీజేపీ), మొదలియార్ కార్పొరేషన్ డైరెక్టర్లుగా ఎస్వీఎం శ్రీధర్ (తిరుపతి-టీడీపీ), పెరుమాళ్ మధు (తిరుపతి-టీడీపీ), బీ.డి బాలాజీ (సత్యవేడు-బీజేపీ), కె.నమశివాయం (సత్యవేడు-టీడీపీ), ఎస్.శరవణ (చంద్రగిరి- టీడీపీ) ఉన్నారు.


ఎన్.ఎన్.ధనపాల్ .. ఎస్.శరవణ.. ఎన్.భాస్కరన్.. కే.నమశ్శివాయం.. కోలా లోకయ్య.. టి.డి.వరప్రసాద్

ఘనంగా ముక్కంటి మహాశివరాత్రి ఉత్సవాలు

ధర్మకర్తలమండలి సమావేశంలో పలు అంశాలపై చర్చ

శ్రీకాళహస్తి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది ఫిబ్రవరిలో జరగనున్న మహాశివరాత్రి ఉత్సవాలను గతం కన్నా మరింత వైభవోపేతంగా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నామని ఎమ్మెల్యే సుధీర్ చెప్పారు. ఇటీవల ఆలయ నూతన ధర్మకర్తలమండలి కొలువుదీరిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో సోమవారం జరిగిన తొలి మండలి సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ... వచ్చే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు జాతీయస్థాయిలో కీలక నేతలు, అధికారులతో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఆహ్వానిస్తామన్నారు. మాస్టర్‌ప్లాన్ అభివృద్ధి, ఆలయం నుంచి లోబావి వరకు రోడ్డు, ఇక భక్తులకు నగదు రహిత ఆన్‌లైన్ సేవలు అందుబాటులోకి తీసుకురావడంపై కసరత్తు చేశామన్నారు. ఇక ముక్కంటి ఆలయ పారిశుధ్య నిర్వహణ రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఆలయంలో సెంట్రల్ ఏసీ సిస్టమ్ ఏర్పాటు చేస్తామన్నారు. పిల్లలకు పాలు పంపిణీ చేయడం, భక్తులకు స్వామివారి సన్నిధిలో విబూధి, అమ్మవారిసన్నిధిలో కుంకుమను ప్రసాదంగా ఇచ్చే అంశంపై దాతలతో చర్చిస్తామన్నారు. అనంతరం చైర్మన్ సాయిప్రసాద్ మాట్లాడుతూ... తొలి ధర్మకర్తలమండలి సమావేశంలో ఎమ్మెల్యే సుధీర్ మంచి సూచనలు చేశారన్నారు. అలాగే ఈవోతో మండలి సమన్వయం చేసుకుని సామాన్య భక్తులకు మెరుగైన సేవలు అందించడమే ధ్యేయంగా అభివృద్ధిపథంలో నడుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో బాపిరెడ్డి, సభ్యులు వాకిచర్ల గుర్రప్పశెట్టి తదితరులు పాల్గొన్నారు.



ప్రమేయం లేని చోరీ కేసుల్లో తన పేరు ప్రస్తావిస్తున్నాడనే హత్య


నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రేణిగుంట నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తన ప్రమేయం లేని చోరీ కేసుల్లో పోలీసులు వద్ద తన పేరు ప్రస్తావిస్తున్నాడనే కోపంతో మనోజ్‌ను హత్య చేశానని హరిప్రసాద్ విచారణలో చెప్పినట్టు అదనపు ఎస్పీ రవిమనోహరాచారి తెలిపారు. సోమవారం గాజులమండ్యం పోలీస్ స్టేషన్‌లో జరిగిన మీడియా సమావేశంలో డీఎస్పీ వివవరాలు వెల్లడించారు. ఈనెల 2న ఆదివారం మద్యం దుకాణం సమీపంలో జరిగిన హత్య కేసులో వేలిముద్రలఆధారంగా మృతుడిని మనోజ్‌గా గుర్తించామన్నారు. డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దర్యాప్తు చేపట్టామన్నారు. రేణిగుంటలో నివాసం ఉంటున్న మనోజ్, హరిప్రసాద్ కలసి చోరీలు చేసేవారని, ఈ క్రమంలో వారు జైలు శిక్షకు అనుభవించారన్నారు. ఆ తర్వాత హరిప్రసాద్ పెయింటింగ్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడని తెలిపారు. అయితే కొన్ని చోరీ కేసుల్లో ప్రమేయం లేకున్నా మనోజ్ పోలీసులు వద్ద తన పేరు చెబుతుండడంతో హరిప్రసాద్ పగ పెంచుకున్నాడన్నారు. అలాగే ఇటీవల హరిప్రసాద్ కాళ్లకు గాయమై నడవలేని స్థితికి చేరుకున్నాడన్నారు. దీనిపై హరిప్రసాద్‌సహా అతని భార్యపై మనోజ్ తప్పుడువ్యాఖ్యలు చేశాడన్నారు. దీంతో మరింత పగ పెంచుకున్న హరిప్రసాద్ ఎలాగైనా మనోజ్‌ను అంతమొందించాలనుకున్నాడని చెప్పారు. తన తమ్ముడు, నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెంకు చెందిన సుధాకర్, రేణిగుంట పాంచాలినగర్‌కు చెందిన మిత్రుడు శ్యాంసన్‌తో కలిసి పథకం ప్రకారం ప్లాస్టిక్ పట్టలు, తాళ్లు, టేప్ కొనుగోలు చేశారన్నారు. పెయింటింగ్ కాంట్రాక్ట్ కుదిరిందంటూ నవంబర్ 2వ తేదీ ఆదివారం ఉదయం లక్ష్మీనగర్ వద్ద ఉన్న తన ఇంటికి రావాలని మనోజ్‌ను పిలిచాడన్నారు. ఇంట్లోకి వచ్చిన మనోజ్ కాళ్లుచేతులు కట్టి నోటికి, ముక్కుకు స్టిక్కర్ అంటించి ఊపిరి ఆడనీయకుండా చంపి వేశారన్నారు. అనంతరం మనోజ్ మృతదేహాన్ని అసంపూర్ణ భవనంలోని సంపులో వేసి వెళ్లిపోయారన్నారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సోమవారం కట్ట పుట్టాలమ్మ ఆలయం వద్ద ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించగా నిందితులు విషయాలను వెల్లడించారన్నారు. కేసు దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన సీఐలు మంజునాథ్, జయచంద్ర, ఎస్ఐ సుధాకర్, ట్రైనీ ఎస్ఐ ప్రవల్లిక, కానిస్టేబుళ్లకు ఎస్పీ రివార్డులను అందించారు.

'తోతాపురి'కి మద్దతు ధర చెల్లించండి

● మామిడి గుజ్జు పరిశ్రమ ఎదుట రైతుల ధర్నా



పాకాల, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): తోతాపురి మామిడి కాయలకు గుజ్జు పరిశ్రమ యజమానులు ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకంటే తక్కువ చెల్లిస్తున్నారంటూ రైతులు ఆందోళనకు దిగారు. పాకాల మండలం రామిరెడ్డిగారిఇండ్లు సమీపంలోని సుప్రీం క్వాలిటీ ఫుడ్ ప్రొడెక్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ గుజ్జుపరిశ్రమ ఎదుట సోమవారం మామిడి రైతుల సంక్షేమ సంఘం నాయకులతో కలిసి రైతులు ధర్నా చేపట్టారు. ఫ్యాక్టరీ యాజమాన్యం కిలోకు రూ.8 చెల్లించకుండా రూ.3.70, రూ.3.90 చొప్పున ఇవ్వడం దారుణమన్నారు. కనీసం కోతకూలీ, రవాణా ఖర్చులు కూడా రావని ఆవేదన వ్యక్తం చేశారు. సకాలంలో మద్దతు ధర చెల్లించకుండా ఇప్పుడు కిలోకు రూ.4లోపు చెల్లించడం తగదన్నారు. నన్నూరివారిపల్లె నుంచి గుజ్జు పరిశ్రమవరకు ర్యాలీ నిర్వహించి ఫ్యాక్టరీ మేనేజర్ బాలాజీ నాయుడికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కిలోకు రూ.4 చొప్పున రాయితీ నగదు చెల్లించడంపై ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మామిడి రైతుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరిబాబు నాయుడు, ప్రధాన కార్యదర్శి ఆనందనాయుడు, ఉపాధ్యక్షుడు లవకుమార్ రెడ్డి, కోశాధికారి చంద్రమౌళి, రైతులు పాల్గొన్నారు.

పేద కుటుంబాలను దత్తత తీసుకుంటా



తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4లో భాగంగా బంగారు కుటుంబాలను దత్తత తీసుకుంటానని ఎన్నారై సుబ్రహ్మణ్యంరాజు తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను కలిసి తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గతంలో తన స్నేహితుడు మహ్మద్ ఆరీఫ్ కడపలో ఓ బంగారు కుటుంబానికి మార్గదర్శిగా మారారని, ఈ విషయం తెలిసి తానూ దత్తత తీసుకోవడానికి ముందుకొచ్చినట్లు చెప్పారు. ఈయన నిర్ణయాన్ని కలెక్టర్ అభినందించారు.

మానసిక రోగులకోసం 'మనోబంధు'

తిరుపతి(కలెక్టరేట్), నవంబరు 10(ఆంధ్రజ్యోతి): మానసిక రోగులను ఆదుకునేలా ప్రభుత్వం 'మనోబంధు' కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. దీనికి సంబంధించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. రోడ్లపై తిరుగుతున్న మానసిక రోగులను గుర్తించి కడపలో పునరావాస కేంద్రానికి తరలించి చికిత్సలు అందించి తిరిగి వారిని సమాజంలోకి చేర్చడమే ఈ కార్యక్రమ లక్ష్యమన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు, జిల్లా కార్యదర్శి డాక్టర్ ప్రదీత్ తదితరులు పాల్గొన్నారు.

17 నుంచి కుష్ఠు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

జిల్లాలో కుష్ఠువ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు ఈనెల 17 నుంచి 30వ తేదీ వరకు లెప్రసీ క్రాస్ డిటెక్షన్ క్యాంపెయిన్ ద్వారా వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి కుష్ఠు లక్షణాలున్న వారిని గుర్తిస్తారు. వైద్య చికిత్స అందిస్తారు. దీనికి సంబంధించి పోస్టర్లను సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి కలెక్టర్ వెంకటేశ్వర్ ఆవిష్కరించారు. ప్రాథమిక దశలోనే కుష్ఠు లక్షణాలను గుర్తిస్తే నివారించవచ్చని, దీనిపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా కుష్ఠు, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ శైలజ, డీఐవో శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

నిమోనియా నివారణకు అవగాహన అవసరం

నిమోనియా నివారణకు సామాజిక అవగాహన అవసరమని జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం సోషల్ అండ్ యాక్షన్ న్యూట్రలైజ్ నిమోనియా సక్సెస్‌ఫులీ(ఎస్ఏఏఎన్ఎస్) బ్యానర్లు, పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. బుధవారం నుంచి ఫిబ్రవరి 28వ తేదీ వరకు ఎస్ఏఎన్ఎస్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. ట్రైనీ కలెక్టర్ సందీప్ రఘువాన్షి, డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్, జిల్లా ఇమ్యునిజేషన్ అధికారి శాంతకుమారి, అధికారులు పాల్గొన్నారు.

పరిహారం అందించేలా చర్యలు తీసుకోండి



సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీషాకి వినతిపత్రం ఇస్తున్న బాధితులు

గూడూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు - తిరుపతి మధ్య జరుగుతున్న మూడో రైల్వే లైన్ పనుల కోసం సేకరించిన భూములకు పరిహారం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని బాధితులు కోరారు. సోమవారం బాలాయపల్లి మండలం జయంపు గ్రామస్తులు సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శిరీషాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైల్వేలైన్ విస్తరణలో భాగంగా 15మంది నివాసాలను కోల్పోవాల్సివస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు నోటీసులు అందజేసి ఇళ్లు ఖాళీ చేయాలని ఆదేశించారని, పరిహారం అందించకుండా ఖాళీ చేయమనడం దారుణమని, తమకు న్యాయం చేయాలని కోరారు.

గిరిజన కాలనీలో మౌలిక వసతులు కల్పించండి



మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలియజేస్తున్న మహాలక్ష్మినగర్ గిరిజనులు

నాయుడుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సిపాలిటీ పరిధిలోని మహాలక్ష్మినగర్ గిరిజన కాలనీలో మౌళిక సదుపాయాలు కరువయ్యాయని సీఐటీయూ నాయకుడు ముకుంద అన్నారు. కాలనీలో మౌలిక వసతులు కల్పించాలంటూ సోమవారం గిరిజనులు మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కాలనీలో రెండు నెలలుగా వీధిదీపాలు వెలగడం లేదని, ఇళ్ల నడుమ చెట్లు పెరిగిపోవడంతో విషపురుగులు వస్తున్నాయని భయాందోళన వ్యక్తం చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఫజులుల్లాకు, డిప్యూటీ తహసీల్దారుకు వినతిపత్రాలు అందజేశారు.

స్వామిత్వతో నివేశ స్థలాలపై హక్కు

బాలాయపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు వారి నివేశ స్థలాలకు హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వామిత్వ కార్యక్రమాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందని డీఎల్‌డీవో వాణిరెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని హస్తకావేరి, అరిగేపల్లి గ్రామాల్లో ఎంపీడీవో నారాయణ ఆధ్వర్యంలో, వెంగమాంబపురం, అక్కసముద్రం గ్రామాల్లో డిప్యూటీ ఎంపీడీవో రామకృష్ణ ఆధ్వర్యంలో స్వమిత్వ గ్రామసభలు నిర్వహించారు. వెంగమాంబపురంలో జరిగిన గ్రామసభలో వాణిరెడ్డి మాటాడుతూ గ్రామాల్లో సర్వే నిర్వహించి గ్రామకంఠం స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు హక్కు పత్రాలు కల్పించేందుకు, వారి అభ్యంతరాలు తెలుసుకునేందుకు నోటీసు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం డప్పు కళాకారులను ప్రోత్సహించాలి

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): డప్పు కళాకారులను రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహించే దిశగా చర్యలు తీసుకోవాలని ఆ సంఘం నేత వెంకటయ్య అన్నారు. సోమవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో డప్పు కళాకారుల సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డప్పుకళ ద్వారా గ్రామాల్లో ప్రజలను చైతన్యం చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం ప్రభుత్వాలు సినిమాల ద్వారా ఆధునిక వాయిద్యాలను ప్రోత్సహిస్తున్నాయని, దీంతో భవిష్యత్తులో డప్పుకళ పూర్తిగా అంతరించిపోతుందన్నారు. ప్రభుత్వం డప్పు కళాకారులను ప్రోత్సహించి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలను అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రసాద్, పుల్లయ్య, చంద్రయ్య, రఘు, నారాయణ, క్రాంతి, గంగిరెడ్డి, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు నిత్యావసర సరుకులు



చేనేత కార్మికుల నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మాజీ జడ్పీటీసీ రామచంద్రయ్య నాయుడు, తహసీల్దారు శ్రీనివాసులు

డక్కిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల నష్టపోయిన చేనేత కార్మికులను ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకుంటుందని మాజీ జడ్పీటీసీ సభ్యులు ఏలేశ్వరం రామచంద్రయ్య నాయుడు, డక్కిలి పట్టణ టీడీపీ అధ్యక్షుడు డక్కిలి చంద్రారెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ శ్రీనివాసులుతో కలిసి మార్లగుంట, మోపూరు క్రాస్‌రోడ్డు ప్రాంతాల్లోని చేనేత కార్మికుల కుటుంబాలకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తుఫాన్ వల్ల మగ్గం గుంటల్లోకి నీరు చేరి నష్టపోయిన కార్మిక కుటుంబాలకు 50 కిలోలు బియ్యం, కిలో కందిపప్పు, చక్కెర, బంగాళ దుంపలు, పామాయిల్ ప్యాకెట్లు అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రసాద్, టీడీపీ నాయకులు కొండయ్య, పోకూరు రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు కోటపోలూరు విద్యార్థులు



మహేంద్ర వర్మ, సంజిత్

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోటపోలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎస్.మహేంద్ర వర్మ, 9వ తరగతి విద్యార్థి ఆర్.సంజిత్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు చంద్రమౌళి తెలిపారు. ఈనెల 8న నెల్లూరులో జిల్లాస్థాయిలో జరిగిన వాలీబాల్ పోటీల్లో అండర్-14 విభాగంలో మహేంద్ర వర్మ, సంజిత్ ప్రతిభ చూపారు.

యూరియా కోసం ఆందోళన వద్దు

బాలాయపల్లి, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): రైతులు యూరియా కోసం ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖ ఏడీఏ అనసూయ అన్నారు. సోమవారం మండలంలోని నిడిగల్లు సొసైటీ అధ్యక్షుడు ఆది వెంకటకృష్ణారెడ్డితో కలిసి యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడకుండా చూస్తామన్నారు. వెంకటకృష్ణారెడ్డి మాట్లాడుతూ యూరియా కార్డు కలిగిన ప్రతి రైతుకూ అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి విజయలక్ష్మి, సొసైటీ డైరెక్టర్లు రామ్మోహన్ నాయుడు, రాంబాబు, గాజులపట్టి నీటి సంఘం అధ్యక్షుడు దాసరి కోటేశ్వరావు, కాలగంద నీటి సంఘం అధ్యక్షుడు వయ్యావూరు పెంచలయ్య, మారెళ్ల వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

రేపు రాచపాళెంలో ఉచిత వైద్య శిబిరం

ఓజిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం రాచపాళెంలో ఈనెల 12న నారాయణ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు టీడీపీ మైనారిటీ సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్‌కే ఖలీల్ తెలిపారు. గ్రామంలోని పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించనున్న వైద్య శిబిరంలో కంటి, ఎముకలు, కీళ్లు, చెవి, ముక్కు, గొంతు వ్యాధి నిపుణులు పాల్గొంటారని తెలిపారు.

వైభవంగా లక్ష దీపోత్సవం



సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని కన్యకాపరమేశ్వరి ఆలయ ప్రాంగణంలో కార్తీక సోమవారం పురస్కరించుకుని లక్ష దీపోత్సవం వైభవంగా జరిగింది. కన్యకాపరమేశ్వరి వలంటరీ సంఘం ఆధ్వర్యంలో జరిగిన లక్ష దీపోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా గణపతి హోమం, జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజ చేశారు. శివ, పార్వతుల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చి కల్యాణం నిర్వహించారు. భక్తులు దీపాలు వెలిగించి పూజలు చేశారు. కార్యక్రమంలో కన్యకాపరమేశ్వరి వలంటరీ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కాకి శ్రీరామ్మూర్తి, కిషోర్, సభ్యులు పాల్గొన్నారు.

పులికాట్‌లో తెగిన విద్యుత్ లైన్



పులికాట్‌లో మరమ్మతులు చేపడుతున్న విద్యుత్‌శాఖ సిబ్బంది

సూళ్లూరుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని మన్నారుపోలూరు సబ్‌స్టేషన్ నుంచి శ్రీహరికోటకు వెళ్లే 33/11 కేవీ విద్యుత్ లైన్ పులికాట్ సరస్సులో సోమవారం తెగిపోవడంతో గంటపాటు సరఫరాలకు అంతరాయం కలిగింది. కుదిరి - అట్టకానితిప్ప మధ్య పులికాట్‌లో విద్యుత్ లైన్ తెగిపోయిన విషయం తెలుసుకున్న ఏడీఈ శేఖర్, ఏఈ జగదీస్ సిబ్బందితో అక్కడకు చేరుకుని వెంటనే మరమ్మతులు చేసి సరఫరా పునరుద్ధరించారు.

విద్యార్థినులకు అభినందన



విద్యార్థినులకు సర్టిఫికెట్స్, మెమెంటోలు అందించి అభినందిస్తున్న హెచ్‌ఎం మరుద్వతి, ఉపాధ్యాయినులు

చిల్లకూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినులను హెచ్‌ఎం మరుద్వతి, ఒకేషనల్ ట్రైనర్ చాందిని, ఉపాధ్యాయులు సోమవారం అభినందించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ ఈనెల 7వ తేదీన ఒకేషనల్ విభాగంలో తిరుపతిలో నిర్వహించిన జిల్లాస్థాయి స్కౌట్స్ అండ్ గైడ్స్ పోటీల్లో తమ పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థినులు సమీరాబేగం, భూమిక ఎలక్ట్రానిక్ అండ్ హార్డ్‌వేర్ విభాగంలో వైర్‌లెస్ ఎలక్ట్రికల్ వెహికల్ చార్జింగ్ ప్రాజెక్టును ప్రదర్శించి జిల్లాస్థాయిలో ప్రథమస్థానంలో నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. కార్యక్రమంలో కామాక్షమ్మ పాల్గొన్నారు.

కార్తీక సోమవార పూజలు



శివాలయంలో కార్తీక దీపాలను వెలగిస్తున్న భక్తులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక మూడో సోమవారం సందర్భంగా పట్టణంలోని పలు శివాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక శివాలయం, వీరభద్రస్వామి, సోమ సుందేశ్వర స్వామి ఆలయాలలో భక్తులు కార్తీక దీపాలను వెలగించి స్వామి వారిని దర్శించుకున్నారు.

దివ్యాంగుడి అదృశ్యం



ఏలిషా (ఫైల్‌ఫొటో)

గూడూరు అర్బన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలిచెర్ల గ్రామానికి చెందిన ఏలిషా కనిపించడంలేదని అతని భార్య మస్తానమ్మ సోమవారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఏలిషా దివ్యాంగ పింఛన్ వెరిఫికేషన్ కోసం ఈనెల 6వ తేదీన తిరుపతి రూయా ఆస్పత్రికి వెళ్లాడని, తిరిగి రాకపోవడంతో తిరుపతి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదన్నారు.

వరి విత్తనాల శ్యాంపిల్స్ సేకరణ

కోట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణంతో పాటు విద్యానగర్‌లోని ఎరువుల దుకాణాల్లో సోమవారం వ్యవసాయశాఖ అధికారులు వరి విత్తనాల శ్యాంపిల్స్ సేకరించారు. వరి వంగడాలు సామర్థ్యం, అసలైనవేనా లేక నకిలీ విత్తనాలా అనే విషయం తేల్చేందుకు ఏవో సుచేంద్రప్రసాద్, ఎరువుల దుకాణాల్లో బీపీటీ 5204, నెల్లూరు జిలకర్ర, 1010 రకం వరి విత్తనాలను శ్యాంపిల్స్ సేకరించారు.

మొక్కుబడిగా మండల సమావేశం

వాకాడు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): వాకాడులోని స్త్రీశక్తి భవనంలో సోమవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ కొడవలూరు అనసూయమ్మ ఆధ్వర్యంలో మొక్కుబడిగా జరిగింది. పలువురు అధికారులు గైర్హాజరయ్యారు. జడ్పీటీసీ రౌతు రామకృష్ణ ఉపాధిహామి పథకంలో జరుగుతున్న అవకతవకలపై ఏపీవోను నిలదీశారు. పలు గ్రామాలకు తాగునీరు సరఫరా జరగడంలేదని కొడవలూరు భక్తవత్సల్‌రెడ్డి ఆర్‌డబ్ల్యూఎస్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నెలిపూడి, వెంకటరెడ్డిపాళెం గ్రామాల్లో విద్యుత్ సరఫరా సరిగా లేదని సర్పంచుల సంఘం అధ్యక్షుడు దువ్వూరు భాస్కర్‌రెడ్డి అన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్ పర్సన్ మర్రి ప్రమీల, తహసీల్దారు సయ్యద్ ఇక్బాల్, ఎంపీడీవో సాయిప్రసాద్ పాల్గొన్నారు.

విద్యతో పాటు క్రీడలూ అవసరం



తైక్వాండో పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ చెంచుబాబు, సీఐ బాబి

నాయుడుపేట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు విద్యతో పాటు క్రీడలూ ఎంతో అవసరమని నాయుడుపేట డీఎస్పీ చెంచుబాబు అన్నారు. నాయుడుపేటలోని అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం రాత్రి జిల్లాస్థాయి తైక్వాండో పోటీలను ఆ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అఖీల్, కోచ్ ఉయ్యాల ప్రవీణ్‌కుమార్‌తో కలిసి డీఎస్పీ ప్రారంభించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి దాదాపు 100 మంది క్రీడాకారులు తైక్వాండో పోటీల్లో పాల్గొన్నారు. ప్రతిభ కనపరచిన క్రీడాకారులకు ఏఎంసీ చైర్మన్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్ ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేశారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనపరచిన క్రీడాకారులు ఈనెల 14, 15 తేదీల్లో కాకినాడలో జరగబోవు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని కోచ్ పవన్ తెలిపారు.

మూలస్థానేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బాలకృష్ణమ నాయుడు



బాలకృష్ణమ నాయుడును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రధాన శివాలయమైన మూలస్థానేశ్వరస్వామి ఆలయ కమిటీ చైర్మన్‌గా బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు నియమితులయ్యారు. సోమవారం స్థానిక నరసింగరావుపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆయనను ఆ పార్టీ నాయకులు సన్మానించారు. బాలకృష్ణమ నాయుడు మాట్లాడుతూ తనకు పదవి సహకరించిన ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణాధ్యక్షుడు దయాకర్, బాలకృష్ణ, నిరంజన్, శివకుమార్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

అభయ శంకరుడి ఆలయంలో పూజలు



అభయ శంకరుడి ఆలయంలో పూజలు చేస్తున్న టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రమేష్

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని నాగేశ్వరస్వామి ఆలయం, టీడీపీ కార్యాలయం వద్దనున్న అభయ శంకరుడి ఆలయంలో కార్తీక సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహిళలు అధిక సంఖ్యలో విచ్చేసి దీపాలు వెలిగించారు. టీటీడీ మాజీ సభ్యుడు వేనాటి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో అభయ శంకరుడి ఆలయంలో భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఆకుతోట రమేష్, టీడీపీ నాయకులు కేవీరెడ్డి, బుజ్జయ్య, వెంకటరమణ, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

శాకాంబరి అలంకరణలో కైలాసనాథ స్వామి

వెంకటగిరి టౌన్, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని హరహర క్షేత్రంలోని కాత్యాయని సమేత కైలాసనాథ స్వామి ఆలయంలో కార్తీక మూడవ సోమవారం పురష్కరించుకుని స్వామివారిని శాకాంబరిగా అలంకరించారు. అలాగే కాశీ విశ్వనాథస్వామి, రామలింగేశ్వరస్వామి, వల్లివేడు క్రాస్ వద్ద ఉన్న భ్రమరాంబిక మల్లిఖార్జున స్వామి ఆలయాల్లో భక్తులు కార్తీక దీపాలు వెలిగించారు.

ఓజిలి మండల సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న సీడీపీవో ఉమాదేవి, వేదికపై ఎంపీపీ అరుణమ్మ, ఎంపీడీవో నారాయణరెడ్డి

ఓజిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అరుణమ్మ అధ్యక్షతన సోమవారం జరిగింది. వివిధ శాఖలపై సమీక్షను నిర్వహించారు. విద్య, వైద్య, ఆరోగ్య, వ్యవసాయం, అంగన్‌వాడీ, పశువైద్యం, విద్యుత్, ఆర్‌అండ్‌బీ, వెలుగు, ఎన్‌ఆర్‌ఈజీఎస్, హౌసింగ్ అధికారులు తమ శాఖల పనితీరు, అభివృద్ధి గురించి వివరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు ప్రసాద్‌నాయుడు, మీనాక్షి, కుందాం సొసైటీ అధ్యక్షుడు పుషోత్తం రాజు, ఎంపీడీవో నారాయణరెడ్డి, తహసీల్దారు పద్మావతి, సీడీపీవో ఉమాదేవి, ఎంపీటీసీలు శేఖర్, ఏవో వరప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ రవివర్మ, ఏపీఎం పద్మ, ఏపీవో చిన్నయ్య పాల్గొన్నారు.

యూరియా కొరత లేదు

డక్కిలి, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మండలంలోని యూరియా కొరత లేదని ఆల్తూరుపాడు సొసైటీ అధ్యక్షుడు కానం చైతన్య అన్నారు. సోమవారం సొసైటీ పరిధిలోని రైతులకు మొదటి విడతగా ఎకరాకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని తగినంత యూరియా సరఫరా చేస్తోందన్నారు. ప్రతి రైతుకూ ఎకరాకు 3 బస్తాల చొప్పున దశల వారీగా అందచేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఏవో శిరీష, అగ్రికల్చర్ అసిస్టెంట్ భవాని, మాజీ ఎంపీటీసీ చంద్రమౌళిరెడ్డి, మాజీ సర్పంచ్ మునిరత్నంరెడ్డి, టీడీపీ నేత శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

సూళ్లూరుపేట, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): గ్రీవెన్స్‌లో వచ్చే అర్జీలను రూపంలో వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి అన్నారు. సోమవారం ఆయన రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ డేలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారం కోసమే ప్రత్యేకంగా నిర్వహిస్తున్న గ్రీవెన్స్‌లో వచ్చే సమస్యలను వెంటనే పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుప్పట్ల పంపిణీ

కోట, నవంబరు 10(ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు డాక్టర్ సారంగం రమేష్‌బాబు జన్మదినాన్ని పురస్కరించుకొని సోమవారం కోట పంచాయతీ పారిశుధ్య కార్మికులకు దుప్పట్లు, పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబరీషా, మంగమ్మ, శ్యామలమ్మ, పరుశురాం సాయి పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌గా శ్రీపతిబాబు

తడ, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌గా టీడీపీ నాయకుడు డాక్టర్ శ్రీపతిబాబును ప్రభుత్వం నియమించింది. సోమవారం వివిధ కార్పొరేషన్లకు డైరెక్టర్లను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా చిట్టమూరు మండలం ఎల్లూరు గ్రామానికి చెందిన శ్రీపతిబాబును రాష్ట్ర ఎస్సీ కమిషన్ డైరెక్టర్‌గా నియమించింది. శ్రీపతిబాబు కుటుంబం టీడీపీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తోంది. విద్యార్థి దశ నుంచే రాజకీయాల్లో చురుకుగా పాల్గొంటున్న శ్రీపతిబాబు గత ఎన్నికల్లో సూళ్లూరుపేట నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యే టిక్కెట్ ఆశించారు. అయితే పార్టీ అధిష్ఠానం రాజకీయ సమీకరణాలతో విజయశ్రీకి టిక్కెట్ కేటాయించింది. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత నిర్వహించిన వంద రోజుల పండుగకు సత్యవేడు నియోజకవర్గ కోఆర్డినేటర్‌గా శ్రీపతిబాబును పార్టీ అధిష్ఠానం నియమించింది. తాజాగా ఎస్సీ కమిషన్‌లో చోటు కల్పించారు.

మోటారు సైకిల్‌ను ఢీకొన్న బస్సు

ఒకరి మృతి... మరొకరికి తీవ్ర గాయాలు



మృతి చెందిన శివ

నాయుడుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): మోటారు సైకిల్‌ను బస్సు ఢీకొన్న ఘటనలో ఒకరు మృతి చెందగా... మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల కథనం మేరకు... పెళ్లకూరు మండలం అర్థమాల గ్రామానికి చెందిన శివ, నాయుడుపేట పట్టణంలోని రాజగోపాలపురంలో నివాసం ఉంటున్న శ్రావణిని సోమవారం సాయంత్రం మోటారు సైకిల్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న ఓ పరిశ్రమ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది క్షతగాత్రులను నాయుడుపేట ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శివ (35) మృతి చెందాడు. శ్రావణి పరిస్థితి విషమంగా ఉండటంతో నెల్లూరుకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న హెచ్‌ఎం భారతి

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు పలు విభాగాల్లో రాష్ట్రస్థాయి క్రీడాపోటీలకు ఎంపికయ్యారని హెచ్‌ఎం భారతి తెలిపారు. సోమవారం ఆమె మాట్లాడుతూ ఇటీవల నెల్లూరులోని ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో నిర్వహించిన స్కూల్ గేమ్స్ జిల్లాస్థాయి క్రీడాపోటీల్లో అండర్-17 హాకీ విభాగంలో మహిధర్, సంతోష్, వెంకటేశ్వర్లు, కబడ్డీలో జాషువా, అండర్-14 విభాగంలో హాకీ క్రీడలో హరిహరన్, వాలీబాల్ విభాగంలో ప్రణీత్ రాష్ట్రస్థాయి ప్రతిభచాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయుడు భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఐసీ ఉద్యోగులు ఇబ్బంది పెడుతున్నారు

బ్రాంచ్ మేనేజర్‌కు ఏజెంట్ల ఫిర్యాదు

నాయుడుపేట టౌన్, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట ఎల్ఐసీ కార్యాలయంలో పనిచేసే ఇద్దరు ఉద్యోగులు తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆ ఏజెంట్‌లు బ్రాంచ్ మేనేజర్ సతీష్‌కు ఫిర్యాదు చేశారు. ఎల్ఐసీ కార్యాలయంలో పనిచేస్తున్న సురేంద్రబాబు, సునీల్ పాలసీదారులను, ఏజెంట్‌లను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయుడుపేట, వెంకటగిరి, సూళ్లూరుపేట ప్రాంతాలకు చెందిన ఎల్ఐసీ ఏజెంట్‌లు పాల్గొన్నారు.

ప్రతి రైతుకూ యూరియా



రైతులకు యూరియా పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకూ యూరియా అందించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుందని తిరుపతి పార్లమెంటు తెలుగు మహిళా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి అన్నారు. సోమవారం మండలంలోని చెన్నూరు గ్రామంలో రైతులకు యూరియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎకరానికి ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. చెన్నూరులో 400 బస్తాల యూరియా అందుబాటులో ఉందని, రైతులకు పంపిణీ చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు అల్లూరు కరుణాకర్‌రెడ్డి, ఏఎంసీ డైరెక్టర్ శ్యామల, వ్యవసాయశాఖ ఏడీ గోపీనాయక్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం అందజేత



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న జేవీవీ ప్రతినిధులు

గూడూరు, నవంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రిలో సోమవారం జేవీవీ ఆధ్వర్యంలో గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆర్టీసీ డీఎం చెంచులక్ష్మి మాట్లాడుతూ గత 12ఏళ్లుగా జేవీవీ ఆధ్వర్యంలో ప్రతినెలా గర్భిణులకు పౌష్టికాహారం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జేవీవీ పట్టణాధ్యక్షుడు వేగూరు రాజేంద్రప్రసాద్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనా, చెంచు నారాయణ, పురుషోత్తమరావు, ప్రభాకర్ రాఘయ్య, శర్మ పాల్గొన్నారు.